వివాహము:

నేడు, నేటి

★

నెనినారు సందర్భంగా

సావనీరు



306.8
V I V

భ్యుదయ వివాహ వేదిక

శ్రీ, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ,

నాదీపట్నం, హైదరాబాద్-500 028

PROGRESS IN POWER SECTOR
IN ANDHRA PRADESH

POWER GENERATION — Index of development:

Twenty five fold increase — From 100 MW to 2500 MW

POWER LINES — arteries for current flow:

Twenty — 589 KM

CON

Nine — khs

PUM

Hunc

IND

Thir

ELE

Thir — ent ;

PER

Seve — of the

HAR — 6

ses

se.

AN — ARD

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

AQUA103B 136

వివాహ వేదిక: నేడు, రేపు

★

సేవినారు సందర్భంగా సావనీరు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10968

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10968

అభ్యుదయ వివాహ వేదిక
శ్రీ, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ,
మొహిదీపట్నం, హైదరాబాద్-500 028

A

వివాహము : నేడు, రేపు

సెమినారు సందర్భంగా సావనీరు

ముద్రణ : 1983 అక్టోబరు

306.8
VIV

ప్రతులు : 2000

వెల : రు. **15-00**

ప్రతులకు :

అభ్యుదయ వివాహ వేదిక,
శ్రీ, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ,
మెహదీపట్నం,
హైదరాబాదు - 500 028

ముద్రణ : లిబర్టి ప్రింటర్స్,
చీరాల - *523 155*

15

విషయసూచిక

రావలసిన మార్పు మనస్సులో

విభిన్న వివాహరీతులు

వివాహము – ఎంపిక

ప్రేమ వివాహాలు సఫలం కావాలంటే

ఆదర్శ దాంపత్యం

వరకట్నం - సామాజిక పరిశీలన

వైవాహిక జీవితం : సఖ్యత, సామరస్యం

కులాంతర, మతాంతర వివాహాలు అవసరమా ?

కులభేదాల తొలగింపుకు కులాంతర వివాహాలు

కుల, మత, జాతి, భాష, రంగు, ప్రాంత ప్రసక్తి లేని వివాహాలు

వివాహ వ్యవస్థకు అవసరం వుందా ?

వివాహం : వ్యక్తి స్వేచ్ఛ

వివాహం మతతంతా ? లేక సమానుల కలయిక సంబంధమా?

వివాహ వ్యవస్థ : ఆవశ్యకత

కులంలో పెండిండ్లు నిషేధించాలి

మానవమతం కావాలి

యువతరపు బాధ్యత

D

విషయసూచిక

ప్రకటనలు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డు
మెస్సర్స్ మార్కెటింగ్ ఇంజనీర్స్ అండ్ కన్సల్టెన్ట్స్
హైదరాబాద్ సెక్యూరిటి అండ్ ఆఫ్‌సెట ప్రింటర్స్
శ్రీమతి మల్లాది సుబ్బమ్మ రచనలు
హిందుస్థాన్ పవర్ ఎలక్ట్రిసిక్స్
మెస్సర్స్ భాగ్యనగర్ కన్‌స్ట్రక్షన్ కం.
పెనోప్లాస్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, సికింద్రాబాద్
ది. అనంతపూర్ డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్
భాగ్యలక్ష్మి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లాటరి
ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్
వెల్‌కం గ్రూపు బంజారా
వెంకటరమణ హట్చరీస్ (ప్రైవేట్) లిమిటెడ్
నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్
వాసవీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్
విజయవాడ
గౌతమి పీపుల్స్ క్లినిక్
ఎమరాల్డ్ వైన్స్, విజయవాడ
ఆంధ్రి మార్కెటింగ్ అసోసియేట్స్
వికుస రాక్‌డ్రిల్ అసిసోరిస్, అనంతపూర్
రంగా స్లాబ్ పాలిషింగ్ కంపెనీ, అనంతపూర్
కొత్తగూడెం కాలరీస్, ఖమ్మం
మెస్సర్స్ హాల్ మార్క్ టుబాకో కంపెని లిమిటెడ్, సికింద్రాబాద్
జనరల్ సిగరెట్ ట్రేడర్స్, బళ్ళారి

ది ఆంధ్రప్రదేశ్ హేండీకాప్డ్ పర్సన్స్ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ పౌరసంబంధశాఖ
ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్సియల్ కార్పొరేషన్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్మెంటు కార్పొరేషన్ లిమిటెడ్
హైదరాబాద్ ఆల్విన్ లిమిటెడ్
రావిపూడి వెంకటాద్రి గ్రింధాలు
స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
కబలవాయి రాధాకృష్ణారావు సన్స్
ఆప్కో ఫాబ్రిక్స్
భాగ్యదర్శి చిట్ ఫండ్స్, ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్మెంట్స్ ప్రై. లిమిటెడ్
మెస్సర్స్ హైదరాబాద్ బాటిలింగ్ కంపెని ప్రైవేటు లిమిటెడ్
రివబ్లిక్ పోర్జ్ కంపెని లిమిటెడ్
ఆంధ్రా బ్యాంక్
రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ
డేటాన్ ప్రింటర్స్, సికింద్రాబాద్
జ్యోతి సచిత్ర మాసపత్రిక
ది సిరిపూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్, సిరిపూర్-కాగజ్నగర్
"ఆదివారం" వారపత్రిక, కాకతీయ పబ్లికేషన్స్
లిబర్టి ప్రింటర్స్, చీరాల
మెస్సర్స్ రామకృష్ణ ఫైన్స్
జయకుమార్ బ్రదర్స్

ఆం. ప్ర. అభ్యుదయ వివాహ వేదిక

ఈ సంస్థ 1981 మే లో హైదరాబాదులో స్థాపించబడింది. ఆ నెల 22 వ తేదీన ఆం. ప్ర. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు కె. చంద్రయ్య గారు బహిరంగ సభలో వివాహ వేదికకు ప్రారంభోత్సవం చేశారు. మాజీ సమాచార శాఖ డైరెక్టరు శ్రీరాజ్యం సిన్హాగారు ఆ సభకు అధ్యక్షత వహించారు. కుల నిర్మూలన సంఘ ప్రతినిధి కార్యదర్శి వి. నాగేశ్వర్‌గారు ఈ వేదిక నిర్మాణానికి తమ సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్ర విభాగపు ఆచార్య లక్ష్మన్న వేదిక విశిష్టతను గురించి ప్రసంగించారు.

వేదికకు నార్ల వెంకటేశ్వరరావుగారు గౌరవాధ్యక్షులుగా ఉండడానికి సమ్మతించారు. వేదిక కార్యవర్గం ఎన్నుకోబడి సంస్థ రిజిష్టరు చేయబడింది. సంఘ కార్యరంగ పరిధి ఆంధ్రప్రదేశ్ ప్రాంతంగా నిర్ణయం జరిగింది.

వేదిక ఉద్దేశ్యములు, లక్ష్యాలు:

వైవాహిక జీవితంలో ప్రవేశించడానికి ఉదాత్త ఆశయాలు, ఉన్నత లక్ష్యాల కలిగిపుండాలనే భావం యువతరంలో వ్యాప్తి చేయడం, స్త్రీ పురుషుల మధ్య వివాహ బంధానికి కులము, మతము అడ్డు రాకూడదనే భావ ప్రసారాన్ని సాగించడం, స్త్రీ పురుషులు సమానులు కనుక పురుషులు కట్నం తీసుకోవడం స్త్రీని ఘోరంగా అవమానించడమనే సందేశాన్ని తెలియజెప్పడం, మత తంతులేని వివాహం అంటే సెక్యులర్ వివాహం శ్రేష్టమని, వాంఛనీయమని ప్రజలకు నొక్కిచెప్పటం, ఇలాంటి వివాహాలు చేసుకోతల్చుకున్న వధూవరులకు మార్గదర్శకత్వం, మానసిక వత్తాసు, సామాజిక బలం, ఆర్థిక సహాయం లాంటి సదుపాయాలు కలిగించడం, కుల మత భాషా ప్రాంత జాత్యాది అడ్డంకులను అధిగమించే సార్వజనిక, లౌకిక వివాహాలను చేపట్టమని యువతను ప్రోత్సహించడం, ఇలాంటి వివాహాలకు నిర్వాహకులుగా సంఘ సంస్కర్తలను ఆశీర్వదించడానికి సమాజంలోని పెద్దలను పిలవడం, వివాహ సలహా సేవా పథకాన్ని "మహిళా

భ్యుదయ సంస్థ" అనే పేరుగల సోదర సంస్థ సహకారంతో నిర్వహించడం వేదిక లక్ష్యాలు.

ఈ వేదికలో పదవీ నిర్వహణ చేసేవారు వేదిక స్థాపనకు పూర్వమే ఇలాంటి వివాహాల విషయంగా మేటి అనుభవం సంపాదించినవారు. వారు వ్యక్తి గతంగాను, అనేక ఉద్యమాలలో భాగస్వాములుగాను భారత హేతువాద సంఘం, భారత హ్యూమనిష్టు సమితి, ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘంలాంటి సంఘాల సభ్యులుగాను ఆ సంఘాల సహకారంతోను ఇలాంటి పెళ్ళిళ్ళు అనేకం చేశారు. అలా పేరెన్నికగన్న సంఘ సంస్కరణోద్యమ నాయకుల అండదండలు వేదికకు వున్నాయి.

వేదిక చేపట్టిన కార్యక్రమాలు :

1) వేదిక ఆదర్శాలను గురించి సారస్వతాన్ని పంచిపెట్టడం;

2) వివాహాలు చెయ్యడానికి అనువైన పరిదేశాన్ని సంపాదించడం, పెద్దలను నిర్వాహకులుగా ఆహ్వానించడంద్వారా సదుపాయాలు కలుగజేయడం;

3) వేదిక లక్ష్యాలను అంగీకరించి ఆ ప్రకారం వివాహ మాడదలచిన స్త్రీ పురుషుల రిజిష్టరును నెలకొల్పి తద్వారా వారికి అవసరమైన సమాచారాన్ని అందించడం;

4) సమాజంలో గౌరవ ప్రతిష్టలున్న స్త్రీ పురుషులను ఈ ఉద్యమంతో సంబంధం కల్పించడం;

5) ఇలాంటి వివాహాలను చేయడం;

6) ఇందు కవసరమైన చర్చా వేదికలను, గోష్టులను నిర్వహించడం వేదిక ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలు.

వేదిక ప్రధాన కార్యస్థానంలో ఎన్ని పెళ్ళిళ్ళు జరిపామనే దానికన్నా ఈ భావాల ప్రసారానికే వేదిక నిర్వాహకులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

వేదికవల్ల ప్రభోధితులైనవారు, వేదిక సలహా సేవా పథకంవల్ల సహాయం పొందినవారు వేదిక కార్యస్థానంలో కాని, వేదిక ఆధ్వర్యం క్రింద కాని తమ పెళ్ళిళ్ళను చేసుకోవాలనే నియమం, నిబంధనా లేవు. ఈ పరిస్థితులలో సహజంగా వేదిక పదవీ నిర్వాహకులు తరుచు ఇతర ప్రదేశాలలో వివాహ నిర్వాహకులుగా వుండటం జరుగుతోంది. వేదిక కార్యస్థానంలో వరకట్న రహిత, మతతంతు రహిత కులాంతర వివాహాలు జరుగుతూనే ఉన్నాయి.

భవిష్యత్ కార్యక్రమాలు :

1983 అక్టోబరు 15, 16 తేదీలలో "వివాహము : నేడు, రేపు" అనే శీర్షిక కల సెమినారును వేదిక నిర్వహిస్తోంది. దానికి వచ్చే పరిశోధన వ్యాసాలను తెలుగులో, ఇంగ్లీషులో పుస్తక రూపంగా ప్రచురిస్తుంది.

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు అంటే పట్టణాలకు, పల్లెలకు సలహా సేవా పథకాన్ని విస్తరింపచేయడం, వివాహాలకు వేదిక ఖర్చుచేయగల ఆర్థిక స్తోమతను దానికి కలిగించడం, వివాహానికి సంబంధించిన సాహిత్యాన్ని - నూతన వివాహ రీతుల సాహిత్యం కూడా - గ్రంథాలయంలో సంతరించడం. ఉచితంగా స్థలం సంపాదించి వేదిక కార్యస్థానాన్ని నెలకొల్పటానికి వివాహాలు నిర్వహించటానికి అనువైన భవన నిర్మాణం చేయడం, సంఘలక్ష్యాల కనుగుణంగా వివాహమాడేవారికి అన్నివిధాల సహాయ సహకారాలు అందించడం వేదిక మున్ముందు చేపట్టే కార్యములు. అందులకనువగు పథకాలను అన్వేషిస్తూ వేదిక అభ్యుదయ కాముకుల సహకారాన్ని అర్థిస్తున్నది.

వేదిక కార్యవర్గం :

నార్ల వెంకటేశ్వరరావు	గౌరవాధ్యక్షులు
పి. సత్యనారాయణ	అధ్యక్షులు
వి. లీలావతి రాఘవయ్య ఎం. వి. రామమూర్తి	ఉపాధ్యక్షులు

మల్లాది సుబ్బమ్మ	కార్యదర్శి & డైరెక్టరు
కె. సత్యవతి	కోశాధికారి
జి. హరగోపాల్	సభ్యులు
వి. శివలింగప్రసాద్	,,
ఎన్. ఇన్నయ్య	,,
మమతా లక్ష్మన్న	,,
వరదా పారిజాతం	,,
వి. శ్యామసుందర్	,,
ఎన్. కె. ఆచార్య	,,
కె. ఎన్. రామదాస్	,,

(శ్రీ ఎం. ఐ. జి. హెచ్. కాలనీ, మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028. ఫోన్ 31423)

రావలసిన మార్పు మనస్సులో

- నార్ల వెంకటేశ్వరరావు

వివాహ వ్యవస్థలో పవిత్రత అనేది ఏదీ లేదు. ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క జాతిలో, ఒక్కొక్క కాలంలో ఒక విధమైన వివాహ వ్యవస్థ ప్రచారంలో ఉండేది. ఇప్పుడు కూడా ఆ విధంగానే ఉన్నట్లు చెప్పవచ్చు. పున దేశంలో కూడా కొన్ని కొన్ని ప్రాంతాలలో బహు పత్నీత్వం ఉండేది. కొన్ని ప్రాంతాలలో, కాదు, హెచ్చు ప్రాంతాలలో బహు పత్నీత్వం ఉండేది. పోతే ఒకే భార్యకు నలుగురైదుగురు భర్తలు ఉండటం కూడా కద్దు. అది కూడా మన దేశంలో ఉన్నది. ఆటవికులలో వివాహానికి ముందు అన్య పురుషులతో సంపర్కం పెట్టుకొనడం తప్పుగా భావించడం లేదు. ఇది మన దేశపు ఆటవికులలోనే కాదు. మరి మెలినీషియాలోకూడా ఈ విధమైన ఆచారం ఉన్నది. ఆఫ్రికను దేశాలలోకూడా ఈ విధమైన ఆచారం ఉన్నది. అందువల్ల వివాహ వ్యవస్థ విషయంలో ఇది పవిత్రమైనది, ఇది అపవిత్రమైనది అని చెప్పడానికి ఎంత మాత్రమూ వీలులేదు. కాగా బహుళ దేశాల, బహుళ ప్రజల అనుభవాన్ని పురస్కరించుకొని చెప్పగలిగినటువంటి మాట ఆ MONOGAMY అనేది; అంటే ఒకేభార్య ఒకే భర్త అనేపద్ధతి సర్వోత్తమమైనదిగా కనిస్తున్నది. ఒక వేవకాలంలో మాట నేను గట్టిగా చెప్పలేనుగాని, తర్వాత మాత్రం దీనికి విరుద్ధంగానే దేశంలో జరిగినట్టు కన్పడుతున్నది.

ఆర్యుల రాకకుముందు ఈ దేశానికి వచ్చినవారు నిషాదులు, కిరాతులు, ద్రావిడులు. తర్వాత వచ్చిన వారు ఆర్యులు. మొదటి మూడు జాతులలో ఏ విధమైన వివాహ వ్యవస్థ ఉండేదో నాకు తెలియదు. కాని ఆర్యులు వచ్చిన తరువాత ముఖ్యంగా బ్రాహ్మణాలు, గృహ్య సూత్రాలు అనేటటువంటి మతగ్రంధాలు వెలువడిన తరువాత బహు పత్నీత్వాన్ని అంగీకరించినట్లు కన్పడుతుంది. ఒక ధర్మశాస్త్రంలో ముఖ్యంగా బ్రాహ్మణ కులానికి చెందిన వారు ఒక బ్రాహ్మణ స్త్రీని, ఒక క్షత్రియ స్త్రీని, ఒక వైశ్య స్త్రీని వివాహం చేసుకోవచ్చని, శూద్ర స్త్రీని దగ్గరకు తీయవచ్చని అది పరమ ధర్మమని వ్రాయబడి ఉన్నది కూడా. దీనినే ఇటీవల వారిలో

పూర్తిగా విశ్వసించినవారు మన విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయన తన పెద్ద నవల 'వేయి పగడల'లో దాని ముఖ్యపాత్ర ధర్మారావు చేత ఈ విధంగా నాలుగు కులాలనుంచి నల్గురు స్త్రీలను వివాహం చేసుకున్నట్లో లేక దగ్గరకు చేర్చుకున్నట్టో రచించారు. ఆ విధంగా చేయటంవల్ల తన ధర్మాన్ని, మత ధర్మాన్ని, మానవ ధర్మాన్ని పరిపాలించినట్లు నిరూపించడానికి ప్రయత్నం చేశారు కూడా. మరి ఈ విధమైన వ్యవస్థను క్రైస్తవ మతం ఒప్పుకోదు. నాకు తెలిసినంతవరకు బౌద్ధం ఒప్పుకోదు; జైనం ఒప్పుకోదు. ఇస్లాం మాత్రం ఒప్పుకుంటుంది. మరి ఈ మాట అంటే మన ముస్లిం సోదరులకు ఆగ్రహం రావచ్చునేమో కాని విల్ డ్యూరాంట్ తన 'హిస్టరీ ఆఫ్ సివిలిజేషను' లో (WILL DURANT IN HIS HISTORY OF CIVILI-SATOIN) ఒక ఛలోక్తి విసిరాడు. మహమ్మదు ప్రవక్త మొత్తం నల్గురిని వివాహం చేసుకున్నాడు. అందువల్ల నేకావచ్చు నల్గురివరకు వివాహం చేసుకోవటంలో తప్పులేదనిచెప్పాడు. ఆయనకు అయిదుగురుభార్యలుంటే బహుశ: అయిదుగురి వరకూ వివాహమాడవచ్చని అనేవాడేమో అని ఛలోక్తిగా ఒక మాట అన్నాడు. ఏమైనా ఈ విధమైన వివాహ వ్యవస్థ వల్లను జీవితం దుఃఖభాజనం కావటానికి అవకాశాలు చాల హెచ్చుగా ఉన్నవి. అయితే ఒకే భార్య ఒకే భర్త అంటే 'మోనగిమీ' (MONOGAMY) వ్యవస్థలో కూడ సాధక బాధకాలు చాలా లేకపోలేదు. దీనికి కారణం ఏమిటంటే స్త్రీకి ప్రతి పత్తి తక్కువ చేయడమే. స్త్రీ పురుషులకు సమానమైన హక్కులున్నపుడే, ప్రతిపత్తి ఉన్నప్పుడే, బాధ్యతలున్నపుడే, స్వాతంత్ర్యం ఉన్నపుడే ఏవివాహమైనా సుఖవంతంగా ఉంటుంది; ఆనందదాయకంగా ఉంటుంది. సంఘ క్షేమానికి తోడ్పడుతుంది. అలాకాని పక్షంలో, పురుషుని ఆధిక్యత బాగా చెల్లినపుడు, సంఘం ముందుకు నడవటానికి బదులు వెనక్కి నడవడమే జరుగుతుంది. మన ధర్మశాస్త్రాలలో, మన గృహ్య శాస్త్రాలలో ఇంకా తక్కిన మత గ్రంథాలలో స్త్రీకి చాల హీనమైన స్థానాన్ని నిర్ణయించారు. మనుధర్మ శాస్త్రంలో స్త్రీ స్వాతంత్ర్యానికి అర్థరాలు కాదన్నంత వరకు వెళ్ళటం జరిగింది. స్త్రీ కన్యగా తల్లి దండ్రుల పోషణలో ఉండాలని, భార్యగా భర్త పోషణలో ఉండాలని, తల్లిగా వృద్ధాప్యంలో బిడ్డలపోషణలో వుండాలని, అందువల్ల ఆవిడ జీవితంలో ఏ ఘట్టంలో కూడ స్వతంత్రతకు

అనర్హురాలని స్పష్టంగా చెప్పడం జరిగింది. తక్కిన ధర్మ శాస్త్రాలయినా ఇంతకు తక్కువగా చెప్పలేదు. ధర్మ శాస్త్రాలను మించి కూడా పురాణాలు స్త్రీకి చాల అన్యాయం చేసినవి. అందువల్ల ఈనాడు మన దేశంలో గృహిణి స్థానం అనేక సందర్భాలలో అని అనను-చాల సందర్భాలలో చాల హీనంగా, హేయంగా ఉన్నది. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలలో దీనిని మనం చూస్తాం. మనలో స్త్రీ యొక్క పతివ్రత తక్కువ అనే విశ్వాసం, స్త్రీ స్వాతంత్ర్యానికి అనర్హురాలనే నమ్మకమూ ఇవి కారణాలని నేను అనుకుంటాను. ఈ విధమైన నమ్మకం మన మతంలో ఉన్నది; ఆచార వ్యవహారాలలో ఉన్నది. మన రక్తంలో ఉన్నది. చివరకు మనలోనే వున్నదని కూడా చెప్పవచ్చు. ఇది తొలగనంతవరకు సుఖమైనటువంటి వైవాహిక జీవితము సాధ్యం కాదేమోనని నామటుకు నాకు గట్టి అనుమానము.

మరొక విషయం నాకు ఎప్పటికపుడు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంటుంది. అదేమిటంటే, మన దేశంలో — ఎందువల్ల జరుగుతున్నదో తెలియదు. బహుశః స్త్రీ యొక్క పతివ్రత తక్కువ అనే అభిప్రాయం మన రక్తంలో జీర్ణించి పోయినందు వల్లనే కావచ్చు. పురుషుడు స్త్రీ పట్ల చేస్తున్న అన్యాయాల కంటే స్త్రీ స్త్రీ పట్ల ఎక్కువ అన్యాయంగా, ఎక్కువ క్రూరంగా, ఎక్కువ ఘోరంగా ప్రవర్తిస్తున్నదని నాకు అనిపిస్తున్నది. ఇటీవల పత్రికలలో దాదాపు ఏ రోజు పత్రిక తీసినప్పటికి ఎవరో ఎక్కడో ఒకచోట ఒకరినో ఇద్దరినో కట్నాలు పూర్తిగా తేలేదని చెప్పేసని కాల్చి చంపినట్లు వార్తలు కనబడుతున్నాయి. వార్తలను క్షుణ్ణంగా పరిశీలించినట్లయితే, కట్నం తగినంత తేలేదని ఈ హత్యకు ప్రధాన కారణం. నూతన వధువు అత్తగారే అవుతున్నదేమోనని అనిపిస్తున్నది. స్త్రీ స్త్రీపట్ల ఇంత క్రూరంగా, ఇంత ఘోరంగా ఎందుకు ప్రవర్తిస్తున్నదో నామట్టుకు నాకు అర్థం కావటంలేదు. అన్నట్టు అర్థంకావటం లేదని చెప్పనక్కర లేదేమో! ఎందుకంటే ఇందాక చెప్పినట్లు ఒక స్త్రీ స్థానం ఒక పురుషుని స్థానంకంటే హీనమయినదని, హేయమయినదనే విశ్వాసం మన రక్తంలో జీతించి పోయింది. 'స్త్రీ పురుషుని సుఖం కోసం, క్షేమం కోసం సర్వమూ త్యాగం చెయ్యాలి; వ్యక్తిత్వాన్ని చంపుకోవాలి' అనే

నమ్మకం మనలో బాగా పాదుకు పోయినట్లు కనిపిస్తున్నది. ఈ నమ్మకం పురుషుడికంటే స్త్రీ లోనే ఎక్కువగా వుండేమోనని అనిపిస్తున్నది. పైగా మనం పతివ్రతలని పొగిడే వాళ్ళు — సీతకాదు నిజానికి — ముఖ్యంగా దమయంతి, సావిత్రి వగైరాలు — పూర్తిగా వ్యక్తిత్వాన్ని చంపుకొని భర్త సేవచేస్తేనే తాము మోక్షాన్ని పొందుతామని, ముక్తిని పొందుతామని, తమ జన్మ తరిస్తుందని, తమకు ఆధిక్యత లభిస్తుందని భావిస్తున్నట్లు చూపించారు. ఎప్పుడైతే ఈ విధమైన వ్యక్తిత్వం లేనటువంటి, మెదడుకూడా లేనటువంటి స్త్రీలను అదర్శపు గృహిణులుగా, భార్యలుగా చూపించడం జరిగిందో, అప్పుడు వాళ్ళకు సంబంధించిన కధలు నిత్య పారాయణాన్ని పొందడం ప్రారంభమయింది. అలాంటప్పుడు ఈనాడు స్త్రీల పట్ల జరుగుతున్న అత్యాచారాలను చూచి మనం ఆశ్చర్యపడనక్కరలేదు.

ఇంతకంటె నాకు చిత్రంగా, విపరీతంగా తోచే విషయం : ఉన్నత విద్యను అభ్యసించినవారు – బి. ఏ; ఎం. ఏ డిగ్రీలు పొందినవారు, డాక్టరేటు కూడా పొందినటువంటి వారు - స్త్రీ లలో ఈనాడు చాల మంది ముఖ్యంగా మధ్య తరగతిలో నుంచి పైకి వస్తున్నారు; వీళ్ళలో కూడా పాత ఆచారాలపట్ల, విశ్వాసాలపట్ల ఎందుకు అంత అభిమానం వుంటున్నదో నామట్టుకు నాకు పొలుపోవటం లేదు. మరి చదువు దారి చదువు అవుతుంటే, నమ్మకాల దారి నమ్మకాలు అవుతున్నవి. విజ్ఞానం ఒక దారిన పోతుంటే, పరివర్తన మరో దారిన వెళ్తున్నది విశ్వాసాల దారి ఇంకొకటి అవుతున్నది. మరి ఈ విద్యకూ, విజ్ఞానానికి, విశ్వాసాలకూ పొంతన లేకుండా ఎందుకు పోతున్నదో నేను చెప్పలేకుండా ఉన్నాను. అది విద్యావిధానంలో లోపమా లేక సంస్కృతిలో లోపమా ఆలోచించి నిర్ణయించు కోవలసిన విషయం. ఈనాడు –40, 50 ఏండ్ల నాటికంటే - కేవలమూ కట్నాలపైనా, కాన్కల పైనా ఆధారపడి ఉన్నదేమోనని అనిపిస్తున్నది. ప్రేమించి వివాహం చేసుకొంటున్నవారు బహు అరుదుగా కన్పడుతున్నారు. కేవలం తమకు వస్తు వాహనాల రూపంలో, ఇతరకట్నాల కానుకల రూపంలో ఎంత ఎక్కువ వస్తే అందుకోసం తాపత్రయ పడుతున్నట్లు కన్పడుతున్నది. ఈ విషయంలో కనుక ఏమైనా ఆశాభంగాలు జరిగినట్లయితే- ఆశకు తగినంతగా లభించక

పోయినట్లయితే-నూతన వధువును దారుణంగా హత్యచేయటం జరుగుతూ ఉన్నది. ఈ విధమైన వివాహ వ్యవస్థ మన దేశంలో ఈ విధంగా కొనసాగినట్లయితే అసలు వివాహ వ్యవస్థ రద్దయి పోవడమే మంచిదేమోనని అనిపిస్తూ వుంటుంది.

ఈనాడు సంఘంలో చెలరేగుతున్న దురాచారాలు తొలగాలంటే కనీసం విద్యాధికులైన యువతులు కట్నం కోరిన వారిని ఏమైనా సరే మేము వివాహం చేసుకోమని పట్టుదల చూపిస్తే తప్ప మార్గం లేదేమోనని తోస్తున్నది.

మరొకటి ఏమిటంటే నేను ముందే చెప్పినట్లు పురుషుడు స్త్రీ పట్ల కంటే స్త్రీ స్త్రీవట్ల ఎక్కువ క్రూరంగా, ఘోరంగా పరివర్తించడం ఈనాడు జరుగుతున్నది. అత్త తానుకూడా ఒకనాడు కోడలేననే సంగతి ఎలా మరిచిపోతున్నదో, ఎందుకు మరిచిపోతున్నదో తెలియటం లేదు. పైగా మన దేశంలో విద్య ఎతంగా వ్యాప్తి చెందినా, విజ్ఞానం ఎంతగా వృద్ధి చెందినా పూర్వాచారాలు సడలక పోవటానికి, మూఢ విశ్వాసాలు తొలగక పోవటానికి ప్రధాన కారణము స్త్రీయే నేమోనని అనిపిస్తున్నది. ఒక వేళ పురుషుడు ఒక అడుగు ముందుకు వేద్దామని సంకల్పించినా స్త్రీ వెనక్కు లాగడం సర్వ సాధారణంగా మనం చూస్తున్నాము. ముఖ్యంగా నేను ఈ మాటలు చెప్పడంలో నా మనస్సులో పెట్టుకుంటున్నది మధ్యతరగతి వాళ్ళను. ఈ మధ్యతరగతికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది మన దేశంలోనే కాదు ఏ దేశంలో నయినా, ఏ కాలంలో నయినా. ఎందువల్లనంటే మధ్య తరగతికి చెందినవాళ్ళే తక్కిన వారికి ఆదర్శాన్ని నిర్ణయించే వారవుతారు. ఇంగ్లీషులో (TREND SETTERS) అవుతారు, అందువల్లవీళ్ళే కనుక అనుచితంగా, అన్యాయంగా, అజ్ఞానంగా పరివర్తిస్తున్నపుడు తక్కిన వారిలో ఈ దుర్గుణాలు ప్రతిఫలించడంలో ఆశ్చర్యం లేదు.

ప్రస్తుత వివాహ వ్యవస్థ మారాలన్నట్లయితే

1. కట్నాల దురాచారాన్ని పూర్తిగా తొలగించడం అవసరం.

2. అది తేలికగా తొలగదు కాబట్టి కనీసం విద్యాధికులైన యువతులు కట్నాలు కోరినవాళ్ళను ఏమైనాసరే పెళ్ళిచేసుకోమని, అవసరమైతే, అవివాహితలంగా మిగిలిపోతామనే ధృడ నిశ్చయాన్ని ప్రదర్శించాలి.

3. తమరిని కట్నం కనక అధికంగా తీసుకురమ్మని వేధిస్తుంటే తల్లిదండ్రులవద్ద ఏడుపులు మొత్తుకోళ్ళు చెయ్యడంకంటే వెంటనే పోలీసులకు రిపోర్టిచ్చి వేధిస్తున్నవారిని కోర్టుకు ఈడ్వడమో, రచ్చకు లాగడమో అవసరము.

4. కేవలం వివాహం తమకులంలోనే, శాఖలోనే జరగాలని కోరుకోకూడదు. అర్హుడైన యువకుడు ఏ కులానికిచెందిన వాడయినా, ఏ శాఖకు చెందిన వాడయినా, ఏ మతానికి చెందిన వాడయినా అతడిని వివాహం చేసుకోవడానికి సన్నద్ధత ప్రదర్శించాలి.

5. స్త్రీకి తక్కువ ప్రతిపత్తిని నిర్దేశిస్తున్నటువంటి ఈ పురాణాలనూ, ధర్మశాస్త్రాలనూ, గృహ్య సూత్రాలనూ, ఇతర మత గ్రంథాలను తుంగలో తొక్కాలి. వాటిని పవిత్ర గ్రంథాలుగా భావించరాదు; అంతేకాదు అవి అంటే ఈసడించుకోవాలి. అవి ఈ కాలానికి పనికిరావని ప్రోసిపుచ్చాలి. ఒక విధంగా రామస్వామి నాయకరు వెళ్ళినంతవరకు వెళ్ళి వీటిని బాహాటంగా తగలబెట్టినప్పటికి నేను సంతోషిస్తాను.

6. భర్త బాధలు పెట్టున్నట్లయితే, లేదా అత్తమామలు బాధలు పెట్టున్నట్లయితే విడాకులు కోరడానికి ఏ మాత్రమూ సంకోచించ నక్కర లేదు. వయస్సులోవున్న యువతి ధైర్యంగా ప్రవర్తించి, అన్యాయాలను ఎదురొడ్డిని, అవసరమైతే విడాకులనుకోరి, తిరిగి రెండో వివాహం చేసుకోవడానికి సన్నద్ధత చూపించాలి. పురుషుడు రెండవ వివాహం చేసుకోవడానికి ఏమి అభ్యంతరం లేనప్పుడు స్త్రీ అదేవిధంగా చేయడానికి ఎందుకు అభ్యంతరం ఉండాలో నామటుకు నాకు అర్థంకాదు. విడాకుల విషయంలో ఇప్పుడెందుకో కొంత సంకోచం కన్పడుతున్నది ముఖ్యంగా యువతులలో. ఈ విధమైన సంకోచానికి నిజంగా ఆస్కారంలేదు. నా మటుకు నేను కనీసం అయిదారు సందర్భాలలో భర్త చాలా క్రూరంగా ప్రవర్తించినపుడు, అన్యాయంగా ప్రవర్తించినపుడు, కట్నాన్ని దిగమ్రింగి గొంతు కోయడానికి సిద్ధపడినప్పుడు భర్తకు విడాకులిచ్చి వివాహం చేసుకోమని యువతులను ప్రోత్సహించాను. నైతిక మయిన సమర్థన పూర్తిగా చేశాను. అలా వివాహం చేసుకున్నవారు చాల సుఖజీవనం చేస్తున్నారు కూడా. చిన్నదానికి పెద్దదానికి చిల్లితగాదాలకు విడాకులు తీసుకోవడం మంచిదికాదు కాని బ్రతుకు దుర్భరమయినప్పుడు

భర్తతో జీవితం భారమయినపుడు తప్పకుండా విడాకులు తీసుకోవలసిందే, వివాహం చేసుకోవలసిందే. అందులో ఎంతమాత్రమూ తప్పులేదు. అది దూష్యం కానేకాదు. ఈ విషయంలో పురుషునికి ఒక నియమమూ, స్త్రీకి మరొక నియమమూ ఉండటం కంటే – నిజానికి – విపరీతమేమీలేదు. ఈ విషయంలో స్త్రీలూ పురుషులూ అందరికీ సమానమయినటు వంటి స్వాతంత్ర్యం ఉండాలి; సమానమయినటువంటి అవకాశాలు ఉండాలి. ఒకరు చేస్తే తప్పుకానిది, మరొకరు చేస్తే తప్పు కానక్కరలేదు.

అన్నింటికంటే నొక్కిచెప్పవలసింది ఇదే. వివాహవ్యవస్థ కానివ్వండి, ఇతర సామాజిక సమస్యలు కానివ్వండి, సాంస్కృతికంగా మన దేశాభివృద్ధి కానీయండి వీటన్నింటిలోనూ ముందడుగు వేయవలసినది స్త్రీ. ఆవిడ కనుక ముందడుగు వేసినప్పుడు ఆవిడ బిడ్డలుకూడా ముందడుగు వేస్తారు. తరువాత ఆవిడ మనవళ్ళు, మనవరాండ్రుకూడా ముందడుగు వేస్తారు. ఈ విధంగా జాతే పురోగమిస్తుంది. ఇందుకు మారుగా స్త్రీ కనుక వెనకడుగు వేస్తూఉంటే మొత్తం సంఘమే వెనుకబడిపోతుంది. స్త్రీలు ఈ విషయంలో చూపించ వలసినంతటి చొరవ, నాయకత్వపు లక్షణాలు చూపించక పోవడం నిజంగా శోచనీయం. ఏ దృష్టితో చూచినప్పటికి కూడా ముఖ్యంగా ఈ విషయంలో ఈనాడు నిందించవలసినది ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువతులనేమో అని నేను అన్నందుకు వారు నన్ను మన్నిస్తారని నేను భావిస్తున్నాను. ఎందువల్లనంటే సాంఘిక విషయాలలో, వైవాహిక వ్యవస్థ విషయంలో, ఇతరంగాను ఉండవలసిన చొరవ వీరిలో కన్పడటంలేదు; స్వతంత్ర బుద్ధి కనపడటంలేదు. ధైర్య సాహసాలు, విజ్ఞత, వివేకం కన్పడటంలేదు. అందువలన ఏ బి.ఏ. నో, ఎం.ఏ. నో చదువుకున్న యువతి వివాహం అయిన వెంటనే వరలక్ష్మీ వ్రతమనో, శ్రావణ శుక్ర వారమనో, మరొకటనో, చేస్తూంటే నాకేదో జుగుప్సాకరంగా ఉంటుంది. ఇంత చదువుకున్న తరువాతకూడా వ్రతాలు ఈ విధమైన మూఢ విశ్వాసాలలో కూడా లేక ఎవరో ముసలమ్మ చెప్పిందనో, తాతమ్మ చెప్పిందనో — ఈ పాడుపనులు చెయ్యడానికి వీరు అంగీకరించవచ్చునా? అంతేకాదు. విద్యావతి అయిన యువతి మంత్రాల తంత్రాలతో పాతకాలపు పద్ధతిన వివాహం చేసుకోవడానికి కూడా నిజానికి అంగీకరించకూడదు.

ఏనాడో చేసిన స్పెషల్ మేరేజి ఆక్టు (SPECIAL MARRIAGE ACT) ఉన్నది. ఆ శాసనం ప్రకారం వివాహం చేసుకున్నట్లయితే ఈనాడు గృహిణికి – భార్యకు లేనటువంటి హక్కులు – ప్రత్యేకమైనహక్కులు – కొన్ని సిద్ధిస్తవి. అయినప్పటికి కూడా తనకు అర్ధంకాని మంత్రాలతో, తమకు గౌరవంలేని పురోహితుడు పెండ్లి చేయిస్తుంటే ఆ తతంగానికి వీరు అంగీకరిస్తారూ ? ఆ తతంగం జరగకపోతే ఏదో లోపం జరిగిందని భావిస్తారు. "అయినప్పుడు ఈ బి.ఏ. డిగ్రీ ఎందుకు తగలెయ్యనా ? ఈ ఎం.ఏ. డిగ్రీ ఎందుకు మంటకలపనా ? ఈ డాక్టరేటు ఎందుకు గోతిలో పెట్టనా ?" అని నాకు అనిపిస్తుంది.

ఇంతకూ నేను చెప్పకోరిందేమిటంటే — ప్రత్యేకించి నొక్కి చెప్ప కోరుతున్నదేమంటే వివాహవ్యవస్థలో కానివ్వండి, లేక ఇతర సామాజిక సంస్కరణలో కానివ్వండి, సాంస్కృతిక రంగంలో పురోగతి కానివ్వండి నాయకత్వం వహించవలసింది స్త్రీ. అలాంటి స్త్రీయే ఈనాడు వెనుకపడి ఉన్నది. ఈ పరిస్థితిలో మార్పురానంత వరకు మనం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే పద్ధతిలోనే ఉండిపోతాము ; మనం ఏ విధమైన ప్రగతిని సాధించలేము.

తరువాత, వస్త్రాలంకరణలో నూతనత్వం కనపడుతున్నది. 'మేకప్' లో నూతనత్వం కనవడుతున్నది. మనస్సులో మాత్రం ఏ విధమైన నూతనత్వం కనపడటం లేదు. నడవడికలో, విశ్వాసాలలో నూతనత్వం కనపడటంలేదు. కేవలం బాహ్యాలంకరణ, వస్త్రాలంకరణలో కనపడే నవ్యత్వం పై పై మెరుగు మాత్రమే. అందువల్ల అయ్యేది, పొయ్యేది ఏ మాత్రమూలేదు. అది మార్పుకాదు. మార్పు జరగవలసింది మనస్సులో, విశ్వాసాలలో, మార్పు జరగవలసింది జీవిత విధానంలో. అది రానంతవరకు మనదేశంలో ఈ వరకట్నాలు తప్పవు ; వరకట్నాలకోసం హత్యలు తప్పవు ; స్త్రీకి హీనస్థితీ, హేయస్థితీ తప్పదు ; పురుషుని దురహంకార పరివర్తన తప్పదు ; సంఘం ఈనాటివలె తక్కిన ప్రపంచం కంటే ఏడడుగులు వెనకకుపడి ఉండడం తప్పదు.

—)o(—

విభిన్న వివాహరీతులు

— మల్లాది సుబ్బమ్మ

మానవ జీవితంలో వివాహం చాలా ముఖ్యమైనది. మధురమైనది. మహత్తరమైనది. శాశ్వతమైనది, అనిర్వచనీయ అనుభూతిని కలిగించేది. ఎక్కడోపుట్టి మరెక్కడో పెరిగిన ఇద్దరు వ్యక్తులు స్వయం సంపూర్ణమైన ఒక ఏకత్వాన్ని ఆశించి చేసే మహాప్రయాణం ఈ వివాహంతో ఆరంభమవుతుంది. ఆ క్షణంనుండి వారిది ఒకేమాట ; ఒకేబాట, ఒకే భావన. అది వారి ఇచ్ఛాసంకల్పం కూడాను. అది పాశ్చ్యదేశం కాని, పాశ్చాత్య దేశంకాని వివాహం ఒక నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంది. వధూవరుల వ్యక్తిగత జీవితంలో ప్రాధాన్యత వహిస్తుంది. ఈ అద్వైతసిద్ధి విశేషమే వివాహం. అచ్చగా ప్రేమానురాగాలకే కాక కొన్ని సాధనలకు, బాధ్యతలకు అంకురార్పణ అవుతుంది. ఆ కర్తవ్యనిర్వహణలో వారు ధర్మబద్ధులై అకుంఠిత దీక్షాస్వీకారంచేసే అద్వైతమూర్తులవుతారు. జీవితాన్ని ఒక శాంతి నిలయంగా లోకధర్మపాశ్రయంగా మలుస్తుంది ఈ వివాహ ఘట్టం. హెచ్చు తగ్గులులేని స్వేచ్ఛా సమానత్వాలు వెల్లివిరిసే సాంఘిక సహజీవన వ్యవస్థే వివాహం. "ఎవరు నిర్మించినా అది ఇల్లే, కాని దంపతులు ఆ ఇంట్లో ప్రవేశించగానే దాన్ని గృహం అంటాం" అన్నాడు రస్కిన్. అలాంటి వైవాహిక జీవితాన్ని ఎలా సుఖవంతం చేసుకోవాలి? అసలు సనాతన సంప్రదాయ వివాహాలకు, ఆధునిక వివాహాలకు తేడాలేమిటి? పాత అంతా పనికిమాలినదేనా? సంస్కరణ వివాహాలు, ఆదర్శ వివాహాలు, విప్లవాత్మక వివాహాల ప్రత్యేకత ఏమిటి? అనే విషయాలు మన ముందుకొచ్చాయి. ఈ వివాహాల గురించి తర్జన భర్జనలు జరుగుతున్నాయి. కనుక చర్చించాల్సిన అవసరం కలిగింది.

సనాతన హిందూ వివాహ విధానంలో కన్యాదానం, పాణిగ్రహణం, సప్తపదివుంటాయి. వధువును ఆమె తల్లిదండ్రులు వరునికి దానంచెయ్యటమే కన్యాదానం. చేతిలో చెయ్యివేసి బాసచెయ్యటమే పాణిగ్రహణం. వరుడు ముందు పోతూవుంటే అతని చేతివేళ్లు పట్టుకొని అతని కోరికపై వధువు ఏడు అడుగులు వేస్తుంది. అదే సప్తపది. ఆ ఏడు అడుగులు వారి

జీవయాత్రకు చిహ్నం. వాటికి బలం, ఆహారం, ధనం, సఖ్యత, దాంపత్యం, సంతానం, సౌఖ్యం అనే వాటిని సంకేతాలుగా నిర్వచిస్తారు. వీటికోసం తనతో ఏడు అడుగులు వెయ్యమంటాడు వరుడు. ఇలా జరుగుతుంది సప్తపది తంతు. ఈ సనాతన పద్ధతిని ఆధునికులు నిరసిస్తారు. దానికి కారణాలనేకం: ఒకే కులాహారు అంటే బ్రాహ్మణులే పౌరోహిత్యం చేయడం, పర్రిజలకు అర్థంకాని సంస్కృత భాషలో మంత్రాలు చదవడం, వధువు వరుని చేపట్టటం కాక వధువును దానం చేయడం అని. సప్తపది మంత్రం విష్ణుమూర్తి పరంగా చెప్పడంలాంటి పద్ధతులన్నీ మతపరమైనవే. ఈ సనాతన వివాహం వ్యక్తిగత మనోభావాలను చంపుతుంది; వ్యక్తిత్వాన్ని కించపరుస్తుంది. ఇది మానవాభ్యుదయానికి గొడ్డలిపెట్టు. కనుక సామాజిక మార్పు, శాస్త్రీయవిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో వెనుకబాటు తనాన్ని గౌరవించే సనాతన వివాహాలు ఆదర్శంకావు. కనుక భవ్యప్రపంచం ఆలోచించాలి.

ఇస్లాం శాస్త్రప్రకారం మహమ్మదీయ వరుడు ఇస్లాం యువతిని, లేక కైస్తవ స్త్రీని వివాహమాడవచ్చు. కాని తదితర మతాల వారిని వివాహ మాడరాదు. ముస్లింల పెళ్ళి కంట్రాక్టుమీద జరుగుతుంది. ఇది వధూ వరుల మధ్య ఒప్పందంక్రింద లెక్క. "ఇంత మహర్‌తో ఫలాని ఆయన నిన్ను పెళ్ళాడుతానంటున్నాడు. నీకు ఇష్టమేనా?" అని వధువును అడుగు తారు. వధువు తరఫున వ్యవహరించే వ్యక్తి — అన్న, పినతండ్రి, మేన మామలాంటివారు సారధ్యం వహిస్తారు — 'వలి' ఇద్దరు సాక్షుల ఎదుట వధువును ఆమె అంగీకారాన్ని గురించి అడిగితే ఆమె ఇష్టపూర్వకంగా తలూపినా, లేక మౌనంగావున్నా ఆమె ఆ పెళ్ళికి ఒప్పుకున్నట్లే. ఈ విష యాన్ని 'వలి' సభాముఖంగా నాయబ్ (పురోహితుడు) కు చెప్తాడు. సాక్షులు తల ఊపుతారు. నికా రిజిష్టరులో వరుడు, వధువు తరఫున 'వలి' దస్కతు చేస్తారు. దాంతో పెళ్ళి అయినట్లే. పరదా పద్ధతి వున్నందున వధువు వరుని, వరుడు వధువును ముందుగా చూడటానికి వీలులేదు. తరువాత ముస్లిం వివాహవ్యవస్థ ఏకపక్షంగా వుండి పురుషాధిపత్యానికి అనుకూలంగా వున్నందున ఇది స్త్రీలకు నష్టదాయకం. ముస్లింస్త్రీ భార్యగా ఎన్నో హక్కులకు అనుభవించటంలేదు. తన సంతానానికి గార్డియనుకాదు.

భర్త ఆజ్ఞానుసారంగా జీవితం సాగించాలి. ముస్లిం స్త్రీల ఈ దుర్భర పరిస్థితిని మేధావులు హర్షించరు.

క్రైస్తవ వివాహం :- క్రైస్తవ వివాహం చర్చిలో జరగాలి. దేవుని సాక్షిగా మతగురువు ఆధ్వర్యంలో ఈ పెళ్ళి జరుగుతుంది. ఇందులో వధువు వరునికి విధేయతగా వుంటానని ప్రమాణం చేయాలి. క్రైస్తవ వివాహం వల్ల క్రైస్తవ శాసనాలు ఆ దంపతులకు వర్తిస్తాయి. అంటే వారసత్వం దగ్గరనుండి విడాకుల వరకు వారి ప్రత్యేక శాసనాలు వారిని బద్ధపరుస్తాయి. అవి స్త్రీలకు వ్యతిరేకంగా ఉన్నాయి. స్వేచ్ఛా సమానత్వ సూత్రాలకు ఈ వివాహపద్ధతి వ్యతిరేకం. "దేవుడు జతపరచిన వారిని మనుష్యులు వేరుపరచకూడదు." (మత్తయి - అ. 19) ఏవైనా విషమ పరిస్థితులు ఏర్పడినప్పుడు భార్యా భర్తలు విడివిడిగా జీవించవచ్చు గాని విడాకులు తీసుకోరాదు అని క్రైస్తవ మతం ఆంక్షలు విధించింది. 1869 లోని చట్టం ప్రకారం కొన్ని పరిస్థితులలో మాత్రమే విడాకులు పుచ్చుకొనే అవకాశం క్రైస్తవ స్త్రీలకు వచ్చింది. ఆ చట్టంలోకూడా స్త్రీలపట్ల కఠోరమైన నిబంధనలున్నాయి. పురుషుడికి లభించినంత తేలికగా స్త్రీకి విడాకులు లభించవు. ఈ వివక్షను ఆధునిక స్త్రీలు అవమానంగా భావిస్తున్నారు.

రిజిస్టరు పెళ్ళి :- ప్రత్యేక వివాహశాసనం (SPECIAL MARRIAGE ACT) కింద జరిగే పెళ్ళి కొంతగా ఆమోదకరమైనదని గుర్తించాలి. ఈ వివాహానికి వధువుకు 18, వరునికి 21 సంవత్సరాలు విధిగా నిండి వుండాలి. వివాహానంతరం రిజిష్టరు చేసుకుంటే వారిద్దరి వయస్సు 21 ఏళ్ళు తప్పనిసరిగా నిండాలి. ఈ ప్రత్యేక వివాహం విభిన్న జాతులు, కులాలు, మతాలు, దేశాలభాషలు, తెగలు వీటికిచెందిన వారిమధ్య జరగవచ్చు. రిజిష్ట్రారుకు 30 రోజులు ముందుగా నోటీసు ఇవ్వాలి.

ముగ్గురు సాక్షులతో రిజిష్ట్రాఫీసుకు పోయి అధికారి యెదుట ప్రమాణాలుచేసి రిజిష్టరులో దస్కతులు చేయాలి. సాక్షులు సాక్షి సంతకాలు చేస్తారు. ఇలా వివాహం చేసుకున్నవారికి భారతవారసత్వ శాసనం

(Indian Succession Act) వర్తిస్తుంది. విడాకుల నిబంధనలు ప్రత్యేక వివాహ శాసనంలో పొందుపరచబడినాయి 30 రోజులు ముందుగా నోటీసు ఇవ్వవలసి ఉండడం, కారణాలు చెప్పకుండా ఏడిగా వుండవలసిన పరిస్థితి ఏర్పడిందనిచెప్పి విడాకులుపొందే అవకాశం దంపతులలో ఏ ఒక్కరికో లేకపోవడం, వారసత్వ శాసనంలో లోపాలు, ఇవన్నీ ఈ వివాహంలో అసౌకర్యాలుగా పరిణమించాయి. కాగా మత వివాహాలకన్నా ఇది మెరుగయినది.

సంస్కరణ వివాహం:- సంస్కరణ వివాహాల్లో పెండ్లి తంతు సందర్భంగా కాని, పెండ్లి షరతుల విషయంలో కాని, పెండ్లి జరిపించే వారి పరంగా కాని, పెండ్లి ప్రమాణాలవిషయంలో కాని మార్పువుంటుంది. అన్నింటా విధిగా మార్పువుండవలసిన అవసరంలేదు. ఏ ఒక్క అంశంలో మార్పువున్నా చాలు. ఈ॥ పెండ్లిమంత్రాలు సంస్కృతంలో కాక తెలుగులో చదివితే అది సంస్కరణ క్రిందే లెక్క. మహమ్మదీయులలో, వధువుకు ఆ సందర్భంవస్తే విడాకులిచ్చే హక్కును, ఆమెపుట్టింట వరుడు నివసించాలనే నిబంధనకు, ఆమె తన సంతానానికి సంరక్షకురాలుగా ఉండే పద్ధతిని ఇలాంటివాటిని పొందుపరచి నికా రిజిష్టరులో వ్రాసుకుంటే అది మార్పే. హిందూ వివాహంలో ఇంతవరకు బ్రాహ్మణులే పౌరోహిత్యం చేస్తున్నారు. అలాకాక కులప్రసక్తిలేకుండా, స్త్రీ పురుష లింగవిభేదం లేకుండా ఎవరు ప్రమాణాలు చేయించినా అది మామూలు పద్ధతికి భిన్నమే. హిందూ వివాహంలో 'నా వెంట ఏడు అడుగులు వేయువలసినది' అని వరుడు వధువును కోరకుండా వధూవరులు ఇద్దరూ ఏడడుగులు వేయడం క్రొత్త విధానమే. పెండ్లి తంతును సర్వులకు అర్థమయ్యేలాగున చెయ్యటం, సనాతనాచారాలను మార్చటం, నేటిసకాలానికి అనుగుణంగా సరిదిద్దటం ఈ సంస్కరణ వివాహంయొక్క లక్షణాలు.

ఆదర్శ వివాహం:- ఇక ఆదర్శ వివాహంయొక్క విశిష్టతను గురించి చర్చిద్దాం. ఇందులో కన్యాదానంలేదు. ఈ నూతన వివాహం వ్యక్తితో ప్రారంభమవుతుంది. వధూవరులు తమ మనోభావాలను స్వేచ్ఛగా

పరికటించుకోవచ్చు. వధువు, వరుడు ఒకరినొకరు ఎన్నుకొనుట జరుగుతుంది, దండలుమార్పిడి దానికి గుర్తు. ఆ మార్పిడి ఒకరినొకరు వరించారనడానికి నిదర్శనం. ఈ పెళ్ళిప్రమాణాలు వధూవరులకు అర్థమయ్యే భాషలో జరుగుతాయి. మామూలుగా ప్రమాణం ఇలావుంటుంది. "కలిమి లేములలో, కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ నీకు చేదోడు వాదోడుగా వుంటూ, నీ ప్రేయసిగా, స్నేహితురాలిగా, సహచారిగా, ఆలిగా ఉంటాను." అని వధువు ప్రమాణం చేస్తుంది. పదాలమార్పుతో అలాగే వరుడు ప్రమాణం చేస్తాడు. ఇలాంటి వివాహంలో కుల మత ప్రసక్తివుండదు. దేవుని ఊసే వుండదు. మంత్రాలు, తలంబ్రాలు, తాళిబొట్టు అసలేవుండవు. తిధి, వారం, నక్షత్రాల ప్రసక్తేరాదు. తమకు అనుకూలమైనప్రదేశంలో, అవకాశాన్నిబట్టి తగిన సమయంలో ఈ పెళ్ళిళ్ళు జరుగుతాయి. కాని ముహూర్తబలాన్ని బట్టికాదు. ఇందులో కట్నకానుకలకై తర్జనభర్జన లుండవు. విందులు వినోదాలకై తలకుమించిన ఖర్చులుండవు. ఆడంబరాలకై ఆర్భాటాలుచాచరు. మూఢవిశ్వాసాల స్వైరవిహారం వుండదు. వధూవరులు, వారి తల్లిదండ్రులు, బంధువర్గం, స్నేహబృందం అరమరికలు లేకుండా తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తారు. ఈ ఆధునిక వివాహాలు పురుషులే కాక స్త్రీల ఆధ్వర్యంలో కూడా జరగవచ్చు. అందులో వధూవరులచేత స్త్రీయే ప్రమాణ స్వీకారాన్ని చేయిస్తుంది. ఈ రోజునుండి "జీవితాంతం కలిసివుంటాం" అని ప్రమాణం చేయించదు. ఇద్దరిచేత దండమార్పిడి జరిపించి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అన్ని విషయాలలో పరస్పరం గౌరవించుకొంటూ ఇతరుల ప్రమేయం లేకుండా సంప్రదించుకొంటూ సాహచర్య జీవితం గడపమని దంపతులను హెచ్చరిస్తూ వివాహవిధిని పూర్తిచేస్తుంది.

ఈ ఆదర్శ వివాహాలు ఒకరి ఆధ్వర్యంలో జరగాలనే నియమంలేదు. వధూవరులే ప్రమాణాలు చేయవచ్చు. కాగా వివాహం సామాజిక వ్యవస్థగా చలామణీ అవుతున్నది కనుక పెద్దలయెదుట ప్రమాణాలు చేస్తారు. నిజానికి వివాహం ఇద్దరు వ్యక్తుల జీవితాలకు సంబంధించింది. కాగా సంతానం, ఆస్తిపాస్తులు వగైరా విషయ సందర్భంగా సామాజిక గుర్తింపు అవసరమవుతుంది. అందుకే హితులు, సన్నిహితుల సమక్షంలో వధూవరులు తమ అభిప్రాయాలను ఒకరికొకరు స్పష్టంగా తెలియజేసుకుంటారు. ఈ వివాహ

పద్ధతి పూర్తిగా మత తంతును వ్యతిరేకిస్తుంది. మతగురువు ఆధ్వర్యంలో పెళ్లికాని, న్యాయాధికారిఎదుట పెళ్ళికాని ఆధునికుల్ని అసంతృప్తిపరుస్తుంది. ఆ దంపతులు ఆజన్మాంతం దంపతులుగా వుంటామని ప్రమాణం చెయ్యటానికి ఇష్టపడరు. వ్యక్తికీ ప్రకృతికి వున్న సంబంధాన్ని వెలికితెచ్చే నిమిత్తం వారు సముద్ర తీరాన్నో, పర్వత ప్రాంతాన్నో, తోటలనో తమ వివాహ వేదికలగా ఎంచుకుంటారు.

విప్లవ వివాహం :- విప్లవ వివాహం పై రెంటికీ భిన్నమయింది. దీంట్లో ఏ తంతూ ఉండదు. పెద్దల సమావేశం ఉండదు. వేదిక ప్రమాణాలు ఉండవు. ప్రేయసీ ప్రియులు ఇద్దరూ కూడబలుక్కుని కాపురం చేస్తుంటారు. అంతే కాని భార్యాభర్తలు కారు. ఒకరు భరించేవారు రెండోవారు భరింపబడేవారు కాదు. ఒకరిపై రెండవ వారికి హక్కులూ, బాధ్యతలూ లేవు. పరస్పర ప్రేమానురాగాలు, గౌరవభావం, సదవగాహన, సానుభూతితోకూడిన స్పందన ఇవి ఆ కలయికకు ఆలంబనాలు. నిజానికి ఈ రకపు కాపురం పరిణతమనస్కులకే పరిమితం. సామాన్యులకు ఇది అదుపాటులో ఉండదు. ఇది సంస్కారులైన స్త్రీ పురుషులకు అనువైన పద్ధతి. ఇది ప్రస్తుతానికి జనసామాన్యానికి ఆదర్శ ప్రాయం. ఈ రకపు కలయిక వివాహవ్యవస్థ యొక్క మౌలికోద్దేశ్యానికి ప్రాధాన్యతను ఇచ్చి బాహ్య రూపాలను, వాటిలో ఏర్పడ్డ వికారాలను తోసిరాజంటున్నది. మానసిక స్వేచ్ఛకు, నికాల్సయిన ప్రణయానికి పట్టంకట్టుంది. ప్రేమ లోపించినవాడు వారిరువురూ రభసలేకుండా, సామాజిక దౌష్ట్యంవల్ల బాధపడకుండా విడిగా కాపురముంటారు. ఆ ఏర్పాటుకు వారికి కోర్టులు అవసరంలేదు. తగాదా తీర్చటానికి పెద్దల ప్రమేయం పనిలేదు. ఇంత తేలికగా విడిపోవడానికి ఆస్కారమిచ్చే పద్ధతి మరొకటిలేదు. కొంతమంది ఈ పద్ధతిని 'వివాహం' అని పిలవడానికి అభ్యంతరం చెప్తారు. కాని నిజానికి ఆ అభ్యంతరం నిలవదు. పెండ్లితంతు దేశకాల ప్రాంతాలనుబట్టి ఉంటుంది.

ఈ నాడు వివాహాలలో కూడా విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. మార్పులను ఆపలేము; మార్పు అనివార్యం కూడాను. ఇప్పటికీ సంతానవతియైన స్త్రీ నితప్ప మరొకరిని వివాహమాడరు

కొన్నిదేశాలలో; కన్యనే వివాహమాడతామంటారు మరికొన్ని దేశాలలో; విధవావివాహం అమలులో వుంటుంది కొన్నిచోట్ల; అది నిషేధం మరికొన్ని ప్రాంతాలలో; ముసుగులో దూరడమే పెండ్లి తంతుగా ఒక తెగలోవుంటే సూత్రాధారణ మరొకజాతిలో వుంటుంది. ఓలికి ఒకజాతి ప్రాధాన్యతనిస్తే మరొకజాతి వరకట్నానికి పెద్దపీట వేస్తుంది. ఆలుమగలుగా కొంతకాలం కాపురమంటే వారిని దంపతులుగా గుర్తిస్తుంది మరో సమాజం. కనుక ఫలానా తంతు ఉండాలని నిర్దేశించ వీలులేదు. ఆ తంతుకు వేరే సాక్ష్యం అవసరంలేదు. ఇద్దరు స్త్రీ పురుషులు ఒకఇంట్లో సహచరులుగా ప్రేయసీ ప్రియులుగా కాపురముండటమే వివాహానికి నిదర్శనం. దానినే అవసరమైతే 'తంతు' గా ఎంచుకోవచ్చు. స్త్రీ పురుషులు ఆలుమగలుగా బహుకాలం కాపురం చేస్తుంటే ఇరుగు పొరుగువారు వారిని భార్యాభర్తలుగా గుర్తిస్తే, వారి సంతానాన్ని తన సంతానంగా పురుషుడు ప్రకటిస్తే ఆ స్త్రీ పురుషులిరువురూ వివాహితులనే భావనను అంగీకరిస్తుంది హిందూ ధర్మశాస్త్రం. కాగా హిందూవివాహం శాస్త్ర నిబంధనలకు వ్యతిరేకంగా వుండరాదు. అంటే ఒకస్త్రీ, ఆమె పినతల్లి కుమారుడు ఇరువురూ ఆలుమగలుగా చాలా సంవత్సరాలుగా కాపురం చేస్తున్నారనుకోండి, అయినా వారిని భార్యా భర్తలుగా పరిగణించ వీలులేదు. కనుక తనతో కాపురమున్నటువంటి స్త్రీని పురుషుడు తన భార్యగా పేర్కొంటేనో, లేక చాలా ఏండ్లుగా కలిసి వారిరువురు కాపురం చేస్తేనో వారిద్దరిమధ్య వివాహం అయివుంటుందని ముస్లింలా ప్రాతిపదికగా అంగీకరిస్తుంది. కాగా ఆ వివాహం జరుగలేదని ఇతరత్రా రుజువు చేయవచ్చును. అలాగే బహుకాలం కలిసి కాపురం చేస్తున్న స్త్రీ పురుషులను భార్యా భర్తలుగా ఎంచవచ్చని సాక్ష్య సంబంధమైన శాసనం (Indian Evidence Act) 114 వ సెక్షన్ చెప్తుంది. అయితే వారికి వర్తించే శాసనం ప్రకారం వారు వివాహమాడి ఉండబానికి ప్రతిబంధకాలు ఉండరాదు. మత వివాహంలో సూచించబడిన పైన ఉదహరింపబడిన ఆంక్షలు విప్లవ వివాహంలో, ఉండవు. అయితే విప్లవ వివాహం ఇంతవరకు శాసనబద్ధం కాలేదు.

ఆదర్శ విప్లవ వివాహాలలో కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. అందులో భార్యా భర్తల సంబంధం విలక్షణమైనది, ప్రత్యేకమైనది.

ఇద్దరూ స్వయం సంపూర్ణమైన వ్యక్తులుగా విశాల పరిధిగల అభ్యుదయంలోకి అడుగు పెడతారు. ఇద్దరూ ప్రేమతో సమష్టిగా వ్యక్తిత్వాలను పెంచుకుంటారు. కాని రెండో వ్యక్తిని తమ స్వార్థానికి వాడుకోరు. అవతలి వ్యక్తియొక్క శ్రేయస్సుకై పాటుపడతారు. కాని, వారిని విధేయులుగా స్వీకరించరు. ఆ వివాహాలలో దాంపత్య సాహచర్యం నిర్బంధంగా వుండదు. పరస్పరానుభూతులతో సమ్మిశ్రితమై హృదయాలను ఉల్లాసపరుస్తుంది. వధూవరులలో హెచ్చు తగ్గులను, తేడాలను నిరసిస్తుంది. వివాహం వధూవరులిద్దరికీ కావలసిన విషయం. ఇరువురి సౌకర్యం, సంతోషం, సుఖం, ఆనందం ఇమిడిఉన్నాయి అందులో. అంతేకాని పురుషుని సౌకర్యం కోసం మాత్రమే సృష్టించబడిన వ్యవస్థకాదు. ఆమాటకు వస్తే స్త్రీ భద్రత కోసం, పోషణ కోసం ఉద్దేశింపబడినది కూడాకాదు. అంతేకాదు. ఇటీవల ప్రేమ, సెక్సుల గురించి భావాలు మారుతున్నాయి. సెక్సు సంబంధంగా స్త్రీకి పరిగణన లభిస్తున్నది. ప్రేమ అంటే పాతివ్రత్యం మాత్రమే అనేభావన తొలగిపోతున్నది. ప్రేమభావన పురుషుడుకూడా ప్రదర్శించవలసి వస్తున్నది. పెంపుడు జంతువులపైచూపే శ్రద్ధాశక్తులు, అభిమానాలుకాదు. ఆలిపై చూపవలసిన ప్రేమ అంటే పరస్పర గౌరవంపై ఆధారపడిన ఆర్ద్రభావన అని. ఆ భావనకు ఆవిర్భావం, వృద్ధి, వికాసం ఆదర్శ విప్లవ వివాహాలలోనే కలుగుతుంది.

ఒక్క విషయం నొక్కి వక్కాణించవలసి ఉన్నది. విప్లవ వివాహం సర్వులకూ పనికిరాకపోవచ్చును. సర్వులకూ వర్తించకపోవచ్చును. పరిణత మనస్కులకు, స్వేచ్ఛా జీవులకు, మానవ విలువలను వంటపట్టించుకున్న వారికి మాత్రమే అది ఆచరణయోగ్యం కావచ్చును. కాగా ఆదర్శవివాహం అందరికీ అందుబాటులోనిది. అందరికీ ఆచరణ సాధ్యమైనది. మానవ విలువలను మానవ సమాజంలోని వ్యత్యాసాలను సమన్వయంచేసేది. ఆదర్శ వివాహాలను పోత్సహించడం విజ్ఞుల, సహృదయుల కర్తవ్యం.

నాకు వివాహవ్యవస్థలో విశ్వాసం ఉన్నది.

—ఇంగర్ సాల్

వివాహము -- ఎంపిక

—డా॥ రవి భారతి

వివాహం ఒక నూరేళ్లపంట. ఆ పంటని ఫలవంతంగా మార్చడంలో భార్యా భర్తలిద్దరూ భాగస్వాములే. ఒక బండికి రెండు చక్రాల్లాగా, పక్షికి రెండు రెక్కల్లాగా సామరస్యం ఉంటేనే ఆ దాంపత్యం సమంగా ఒడుదుడుకులు లేకుండా సాగిపోతుంది, కనుక ఒక వివాహఘట్టానికి పూర్వరంగం ఎంత పటిష్టంగావుంటే వివాహవ్యవస్థ అంత బలంగానూ, ఆరోగ్యదాయకంగానూ ఉంటుంది. ఆ పూర్వరంగానికి పునాది "వధూ వరుల ఎంపిక".

ఈ ఎంపిక కొన్ని సందర్భాల్లో పరస్పరప్రేమ ప్రాతిపదికగా జరుగుతుంది. ఇలాంటి వివాహాలు అయిదుశాతం మాత్రం జరుగుతాయి. కొన్ని విఫలమైపోవడంకద్దు. ప్రేమ వివాహాల్లో కుల మత వర్గ వివక్షకు తావుండదు. కేవలంప్రేమే వారి వివాహానికి ఒకవరం కనుక వరకట్నంయొక్క ప్రమేయం ఇందులో ఉండదు. ఏ వివాహమైతే ప్రేమ సూత్రంతో బంధింపబడుతుందో, ఏ బంధమైతే 'అనుబంధమే' ఆధారంగా నిలదొక్కు కుంటుందో అక్కడ ధన ప్రలోభానికవకాశముండదు. కనుక ఇలాంటి ప్రేమ వివాహాల్ని ప్రోత్సహించే స్వచ్ఛంద సంస్థలు ఆ ప్రేమను వివాహరూపంలో ఫలింప జేస్తే ఆ వివాహవృక్షం పుష్పించి, ఫలించి మూడుపూలు ఆరుకాయలుగా విలసిల్లుతుంది. నీరుపోసే నాధుడే కరువైనప్పుడు ; శుష్కించి ఎండి పోతుంది.

ఇక్కడ యువత ఒక్కవిషయం గుర్తుంచుకోవాలి. ప్రేమ అనేది ఒకవరంలాంటిది. సాంఘిక బంధాలన్నింటికంటే అతి పవిత్రమైంది. నవ నాగరికత వెర్రితలలువేస్తున్న ఈ రోజుల్లో ప్రేమ ఒక 'మైకంగా', ఒక 'ఫ్యాషన్' గా మారి కాలక్షేపంకోసం, సరదాకోసం కలిసి తిరిగే తాత్కాలిక ఒప్పందంగా భావించబడుతున్నది. నైతికపతనంలో ఇద్దరూ భాగస్వాములే అయినా ఆడపిల్లే కష్టనష్టాలకు లక్ష్యంగా మారుతున్నది. పరస్పరం

మనస్ఫూర్తిగా ప్రేమించు కొన్నామంటే సరిపోదు. వాస్తవిక దృక్పథంతో ఆ ప్రేమఫలించడంలో ఎన్ని అడ్డంకులుకలిగినా వాటినిదాటే ధైర్యం, స్థైర్యం ఉంటేనే ముందడుగు వేయాలి. వివాహానంతరంకూడా సమాజం నుండి ఎన్నో సవాళ్లు సహించవలసి ఉంటుంది. ప్రతిఘటన అనే పెనుతుఫానుకు తట్టుకొని నిలబడగలమన్న దృఢవిశ్వాసం, నమ్మకం ఇద్దరికీ ఉన్నప్పుడే వివాహఘట్టాన్ని చేరుకోవాలి. లేకపోతే ఆ ప్రేమికు స్వస్తి చెప్పడం సమాజానికి అన్నివిధాలా ఆరోగ్యదాయకం.

ఒక శోచనీయమైన విషయమేమిటంటే విద్యార్థినులుగ ఉన్న యువతులకు జీవితంపట్ల ఒక ధ్యేయంగానీ, లక్ష్యంగాని లేదు. "కాలేజీ చదువు" అనేది పెండ్లి అనే పొగబండి కోసం నిరీక్షించడానికి అనువైన 'ప్లాట్ ఫారమ్' గా భావించబడుతున్నది. సిగ్నల్ పడడమే ఆలస్యం, మూడుముళ్లు వేయించుకోవడానికి సిద్ధంగావుంటారు. ఈ విధంగా తన స్వంత అభిప్రాయాన్ని ఉట్టికెక్కించి, పెద్దవాళ్లు చదవమంటే చదవటం, వద్దంటే వెనకముందాడకుండా మానేయడం, ఇలాంటి గమ్యరహితమైన జీవితనౌక ఏ గాలివాటుకెటు పోతుందో ఎవరికెఱుక?

మరికొందరు ఆడపిల్లల మనస్తత్వాలు అతివిచిత్రమైన స్వప్న స్థితిలో తేలిపోతూ ఉంటాయి. తమ చుట్టూవున్న డబ్బు ప్రపంచం, సినిమాలు, నవలలు — ఇవి వాస్తవ ప్రపంచానికి దూరంగా తీసుకొనివెళ్ళి పంచరంగుల స్వప్నలోకంలో తేలేటట్లుగా చేస్తున్నాయి. రాబోయే వరుడు అందంగా, ఆరడుగుల పొడుగుండాలి, ధనవంతుడై ఉండాలి. విద్యావంతుడు, మంచి సంస్కారవంతుడై ఉండాలి. అన్నిటినిమించి అతడు తనను అమితంగా ప్రేమించాలి. వాస్తవ విరుద్ధమైన ఈ కోరికల కలలు చెదిరిపోయి, తమ తాహతుకు తగిన సగటు ఉద్యోగితో జీవితం ముడిపడితే, ఊహల్లో ఉండలేక, వాస్తవాన్ని అంగీకరించలేక మానసికవ్యధకు గురౌతూ జీవితాల్నే నాశనం చేసుకునేవారు లేకపోలేదు. కనుక యువతులు వాస్తవికతలో జీవించడం నేర్చుకోవాలి. సమస్యల్ని ఎదురొక్కంటూ, వాటి పరిష్కారం కోసం ప్రయత్నం చేయడంలోనే పరమార్థమున్నదని భావించినవాడు ఎలాంటి నిరుత్సాహానికి అవకాశముండదు.

తమ కుమార్తెల వివాహవిషయంలో వరుని ఎంపికలో తల్లిదండ్రుల మనస్తత్వాలుకూడా మారాలి. అయిదేండ్ల వయసు ఆడపిల్లను ముద్దుచేస్తూ "నా బంగారుతల్లికి డాక్టర్ని భర్తగా తెస్తాననో, నా చిట్టి తల్లిని ఇంజనీయరుకు ఇల్లాలిని చేస్తాననో" తాము కలలుకంటూ, వయసు పెరిగినకొద్ది తమబిడ్డ కలలు కనడానికి అవకాశం కల్పిస్తూ, కోరిక నెరవేరక పోతే కృంగిపోయే తల్లిదండ్రులు కొందరుంటారు. కనుక ఆడపిల్లల ఆనందాన్నికోరే తల్లిదండ్రులే అయితే, తాము వాస్తవంలో జీవిస్తూ తమ సంతానాన్ని వాస్తవంలోనే ఊపిరి పీల్చేటట్లుచేయాలి. తమ ఆర్థిక స్థితి గతుల్ని, సమస్యల్ని తమ సంతానానికి మభ్యపెట్టకుండా ఎప్పటికప్పుడు విప్పిచెపుతూ ఉండాలి. అలాంటప్పుడు వారిలో ఎలాంటి మిథ్యా గౌరవానికి చోటుండదు. వరుని ఎంపికలో ఆతడు గొప్ప విద్యావంతుడు కాకపోయినా సంస్కారవంతుడయితే చాలు తమ కూతుర్ని ఈయడానికి వెనుకాడకూడదు. డిగ్రీల సంపాదన సంస్కారానికి గీటురాయి కాదన్న సత్యాన్ని తాము తెలిసికొని తమ సంతానానికి తెలియజెప్పాలి.

సంప్రదాయ వివాహాల్లో వధువుయొక్క ఎంపికలో ప్రధమఘట్టం 'పెళ్లిచూపుల' తంతు. మనం సాంఘికంగా, వైజ్ఞానికంగా ఎంత పురోగమిస్తున్నామో, అంతకంటే పదింతలు తిరోగమన మార్గంలో పయనిస్తున్నాము. తరాలు మారుతున్నా ఈ తంతులో మార్పులేదు. ఒక సంతలో పశువుల శ్రేష్ఠతను పరీక్షించవచ్చు. లేదా మార్కెట్టులో ఒక వస్తువుయొక్క నాణ్యతను నిర్ణయించవచ్చు. కాని వివాహ విపణివీధిలో చైతన్యం మూర్తీభవించిన ఒక వధువు వ్యక్తిత్వాన్ని ఫణంగాపెట్టే ఈ పెళ్లిచూపుల తంతు ప్రగతిశీలమైన మనజాతికే సిగ్గుచేటు. వధువు ఈ పెళ్లిచూపుల తంతును ప్రతిఘటించడమే కాదు, ఈ తంతులో ఏకపక్ష నిర్ణయాధికారాన్ని, ఎంపికను సవాల్ చేయాలి. తానుకూడా వ్యక్తినని, తనకూ ఇష్టాయిష్టాలు, అభిరుచులు, జీవితంపట్ల కొన్ని విలువలు ఉన్నాయని తెలియజెప్పాలి.

ఒక్కొక్కచోట వధూవరులకు ఈడూజోడూ కుదురుతుంది. కట్నానికి లోటులేదు. పెట్టిపోతలకు కొదువలేదు. వధూవరులు ఒకరినొకరు అంగీకరించారు. అయినా "జాతకాల" భూతాన్ని తప్పించుకోనిదే పెళ్లి కావడానికి

వీల్లేదు. ఆడపిల్ల ఆశ్లేషంలో పుట్టింది కనుక అత్తగారికి గండం, మూలలో పుట్టింది కనుక మామగారు మంచమెక్కుతారు, జ్యేష్టలో పుడితే పెద బావ గారికి పరలోక ప్రయాణం ఖాయం. కుజ దోషంఉంటే కట్టుకున్నవాడు గుటుక్కుమంటాడు. ఇది వధువుకే వర్తిస్తుంది. వరుడికి కుజదోషం ఉంటే వధువుకు ఎలాంటి ప్రమాదంలేదు. అంటే నక్షత్రాలుకూడా పక్షపాతబుద్ధి పోనిచ్చుకోలేదన్నమాట. దేవగణం; మానవ గణం; రాక్షస గణం - వీటికి సంబంధించిన 27 అంశాలు వధూవరులకు సరిపోవాలి. ఏ ఒక్కటి సరిపోక పోయినా ఆసంబంధం రద్దవుతుంది. ఇది జాతకాల భాగోతం; జాతకాలు సమగ్రంగాకలిసి శాస్త్రోక్తంగా జరిగిన వివాహాలు విచ్ఛిన్నం కావడంలేదా? అని ప్రశ్నిస్తే "ఆ దోషం జాతకానిదికాదు, జాతక రచనకీయబడిన సమయంలో వ్యత్యాసముందని" తప్పుకుంటారు. ఏ పాదంలో పుట్టినా ఏదో ఒక దోషం ఉండితీరుతుంది. ఆ దోషానికి 'శాంతి' సిద్ధంగా ఉంటుంది. మొత్తంమీద ఈ దోషాలనుండి తప్పుకోవాలంటే గర్భవతియైనతల్లి తిధి, వార, నక్షత్రాలుచూచి మరీ బిడ్డల్ని కనాలన్నమాట! ఈ విధంగా ప్రకృతి సిద్ధమైన పుట్టుకకీ, అశాస్త్రీయమైన జాతకానికి ముడిపెట్టి, 'శాంతి' పేరిట 'ముడుపు' వదిలించుకొనే మూర్ఖత్వం ఈ వైజ్ఞానిక యుగంలోకూడా మనల్ని వదలలేదు. పంచాగం రెండు భాగాలు. ఒకటి ఖగోళస్కంధం. రెండవది జాతకస్కంధం. గణితస్కంధం ఒక శాస్త్రం. జాతకస్కంధం ఊహాజనితం. కనుక దాని ఫలితాలు కాకతాళీయం. కనుక కొతరు చేయవలసిన అవసరంలేదు.

వధువు ఎ-పికలో కొందరు మగపిల్లల మనస్తత్వాలు పరిశీలిద్దాం. తాతల కాలంనాటి బూజుపట్టిన దుస్సాంప్రదాయాలకూ, ఫ్యూడల్ భావాలకూ వీరు అవశేషరూపాలంటే అతిశయోక్తి కాదు. వీరు పుట్టుకచేతనే "బంగారు కడ్డి" లుగా పరిగణింపబడుతూ ఉన్నత విద్యావంతులై భవిష్యత్తు బంగారు బాటల్ని నిర్మించుకుంటారు. వీరికి ఉన్నత విద్యావంతురాలైన భార్యగాని, ఉద్యోగంచేసే భార్యగాని అక్కరలేదు. భార్యకూడా ఉద్యోగం చేస్తూ "ఊళ్లేలుతుంటే" గృహజీవితం అస్తవ్యస్తమై వృత్తిరీత్యా తమ భవిష్యత్తు దెబ్బతింటుంది. కాబట్టి సామాన్యమైన చదువు, కొంత

లోకపరిజ్ఞానం ఉంటేచాలు, ఇంటిని, పిల్లల్ని చక్కదిద్దుకుంటుంది. మరొక్క విశేషం: చదువు లేకపోయినా చాలినంత కట్నంతేవాలి. అంత అందంగా లేకపోయినా అణకువగా ఉంటేచాలు. విదేశాలకు పంపిస్తే మరీ మంచిది. అక్కడి ఉన్నత విద్యకవసరమైన ఆర్థికభారం వహిస్తేచాలు, కానీ కట్నం అక్షరలేదు! విదేశాల్లో చదివించడమంటే ఆర్థికంగా వీధిన పడడమే!

ఈ ధనవ్యామోహం యువకుల్లో అంటు జాడ్యంలాగా వ్యాపిస్తున్నది. దీనికి కారణం మనం సులభంగా ఊహించవచ్చు. ఈ పెట్టుబడిదారీ సమాజంలో ఈనాడు వేలంవెట్టిగా చెలామణిఔతున్న అక్రమ సంపద, నల్లడబ్బు, యువతలకు వెర్రెక్కించి వ్యామోహంలో ముంచుతున్నాయి. అగ్నికి వాయువు తోడైనట్లు నవనాగరిక జీవనంపట్ల ఆసక్తి విదేశీవ్యామోహం దానికి తోడవుతున్నాయి. కనుక ఏనాడయితే అక్రమ సంపాదన సాంఘిక నేరాల్లో ఒకటిగా పరిగణింపబడుతుందో, అవసరానికంటే ఎక్కువ డబ్బు కూడబెట్టడం సంఘవ్యతిరేక కార్యకలాపంగా ఎంచబడుతుందో, ఆనాడే ఈ 'డబ్బు' పట్ల ఏర్పడ్డ 'జబ్బు' మాయమౌతుంది.

వధువుయొక్క ఎంపికలో వరుని తల్లిదండ్రుల పాత్రికూడా చాలా ఉంది. వివాహం అన్ని వ్యాపారాల్లాగే ఒక వ్యాపారం. తమ కుమారునిపై తాము పెట్టిన పెట్టుబడి చక్రవడ్డితోసహా రాబట్టాలి. కనుక వధువుకన్నా, వరువు తేబోయే కట్నం మొదట నచ్చాలి. ఈ 'డబ్బు' అనే పాదరసం తగిలితేచాలు అనాకారివధువైనా అందంగా మారుతుంది. బంగారు బొమ్మలా కనిపిస్తుంది. 'మనీ' మహత్యం మరి!

గత చరిత్ర అనుభవం ఎప్పుడూ మనల్ని ఆశావాదులుగానే ఉంచుతుంది. పరిశీలించిచూస్తే గతంలో ఏ సాంఘిక సంస్కరణోద్యమం కూడా విఫలం కాలేదు. ఆనాటి సతీ సహగమనం మొదలు మొన్నమొన్నటి అస్పృశ్యతా నివారణవరకు ప్రతీ సాంఘిక సంస్కరణవెనుక ఒక వీరోచిత పోరాటం నడిచింది. ఈనాటి వరకట్నం ఒక సాంఘిక ఆర్థిక సమస్య. మూఢనమ్మకాలు, మూఢాచారాలు ఒక సాంఘిక జాడ్యం. మనసులేని మనువులు, జాతకాల జాడ్యాలు, వరకట్న హత్యలు —ఆస్తిహక్కు చట్టంలోని లోపాలు — ఈ విషయాల్లో వివాహయోగ్యమైన వధువుకు కూలంకషమైన పరిజ్ఞానం ఉండాలి. తద్వారా చైతన్యం కలగాలి.

సమాజాన్ని ఈనాడు పట్టి పీడిస్తున్న ఈ జాడ్యాన్ని జయించడానికి కొన్ని సూత్రాల్ని నేటి యువత పాటించాలి.

1) ప్రాంత కుల మత పరిధుల్ని వదలి విశాల సమాజ సముదాయంలో వరాన్వేషణ జరగాలి.
2) కేవలం విద్యాధిక్యత సంస్కారానికి గీటురాయికాదని ప్రతియువతీ, యువకుడూ గుర్తుంచుకోవాలి.
3) వరకట్నంకోరే వరుల్ని వధువులు తిరస్కరించాలి.
4) పెళ్లిచూపుల తంతును ప్రతిఘటించాలి.
5) వివాహ సందర్భంలో వధువుకు స్థిరాస్తిరూపానగానీ, చరాస్తి రూపానగానీ సహోదరులతో సమానభాగం హక్కుగా చెందాలి. దానితో వరునకుగాని వరుని బంధువులకు గాని ఎలాంటి ప్రమేయముండరాదు.
6) యువత నిరాడంబర జీవన విధానాన్ని అలవర్చుకోవాలి.
7) వివాహాలలో ఆడంబరాల్ని తగ్గించి వ్యయంపై పరిమితుల్ని విధించాలి.
8) లాంఛనాలకు, సాంప్రదాయాలకు, మామూళ్లకు తిలోదకాలు వదలాలి.

ఇవేకాక సమాజం ఆర్థిక, సాంఘిక పరమైన మరికొన్ని మౌలికమైన మార్పులకు లోనైతే తప్ప ఈ వ్యవస్థకు అంటుకున్న అనేక జాడ్యాలు వదలిపోవు.

"తన భార్యను దాస్యంలో ఉంచే భర్తను నేను మరింతగా అసహ్యించుకుంటాను"

—ఇంగర్ సాల్

కుటుంబంలో ప్రజాస్వామ్యం ఉండాలని నా నమ్మకం.
స్వేచ్ఛ, సమానత్వం, ప్రేమలో నాకు విశ్వాసం ఉన్నది.

— ఇంగర్ సాల్

ప్రేమ వివాహాలు

సఫలం కావాలంటే

- వాసిరెడ్డి సీతాదేవి

ఒకనాడు స్త్రీకి భర్త భగవంతుడు. భగవంతుడుచేసే పనుల్ని విమర్శించేహక్కు భక్తులకు ఉండదు కాబట్టి ఆ సంసారాలు విచ్ఛిన్నం అయ్యే అవకాశం ఉండేదికాదు భర్త తన్ని నా, అవమానించినా, ఆ పాదాలలో ఇంత చోటు పడిఉండేది.

కాని ఈనాడు యువతీ యువకులు వివాహం అనేది భగవంతుని నిరయ

కెనడాలో చదువుతున్న మరో అమ్మాయి ఇండియాకు వచ్చింది. మళ్ళీ వెళ్ళిపోవాలి. పేపర్లో వరుడు కావాలని అనౌన్సు చేశారు. కులమింటి కుర్రాడితోనే వివాహం జరిగింది. భర్తతో కెనడావెళ్ళింది. ఆరు నెలలు తిరక్కుండానే విడిపోయారు. అతను మరో వివాహం చేసుకున్నాడు. ఆ అమ్మాయి మనస్సు విరిగిపోయింది. అలాగే ఉండిపోయింది.

మన అభిప్రాయాల్లో కొంతవరకు మార్పువచ్చింది. వివాహపద్ధతులలో పెద్దగా మార్పురాలేదు. పెళ్ళిచూపుల్లో ఒకరినొకరు చూచుకున్నంత మాత్రంచేత ఆ వివాహం సఫలం అవుతుందనే నమ్మకం ఉండదు. ఒకసారి చూడగానే ఒకరి అభిప్రాయాలు ఒకరికి అర్థంకావు. ఆలోచనలూ, అలవాట్లూ, తెలియవు. అందుకే పెళ్ళిచూపుల[illegible] వివాహానికీ మధ్య కొంత వ్యవధి కావాలి. ఆ వ్యవధిలో వారు సన్నిహితంగా మెలిగి ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

మనిషి సమాజజీవి. ఒంటరి[illegible] జీవన సహచరి లేక

వివాహమనేది జీవితంలో చాలా ప్రధానమయిన విషయం. వివాహానికి పూర్వమే యువతీ యువకులు మనసువిప్పి మాట్లాడుకోవాలి. ఇంటి పరిస్థితుల్ని గురించికూడా మాట్లాడుకోవడం అవసరం. ఒకోసారి యువకుడు ఇంటికి పెద్దవాడై ఉంటాడు; బాధ్యత వహించవలసిన వాడుగా ఉంటాడు. భార్యకు అది ఇష్టంఉండదు. వివాహం కాగానే వేరు కాపురం పెట్టాలనే కోరిక ఆమెకు ఉండడం సహజం. అటువంటప్పుడు అతను తన ఉద్దేశ్యాలను భార్యకు వివాహంముందే ఖచ్చితంగాచెప్పి ఆలోచించుకొనే దానికి అవకాశం ఇవ్వాలి.

దాంపత్య జీవితం అంటే ఏమిటి? సుఖమయమైన దాంపత్య జీవితం గురించి వారి అభిప్రాయాలు ఏమిటి? వారి కోరికలు ఏమిటి? భవిష్యత్తు గురించి వారి కలలు ఏమిటి? మొదలైన అన్ని విషయాలమీద మనసులు విప్పి చర్చించుకోవాలి.

ముఖ్యంగా వారి ఆర్థిక స్థితిగతుల్ని గురించి చర్చించుకోవాలి. ప్రేమతో పొట్టనిండదు. పెళ్ళయి ఆర్థిక ఇబ్బందులకు లోనైన మరుక్షణంలోనే ప్రేమజ్వరం సబ్‌నార్మల్‌కు వచ్చేస్తుంది.

ఇది పురుష ప్రపంచం. వివాహం విషయంలో చదువుకున్న స్త్రీ బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి. సంఘర్షణ వక్తులమధ్య జరగదు; వారి భావాలమధ్య, అభిరుచులమధ్య జరుగుతుంది. అవసరం అయితే ఇద్దరూ తమ అభిప్రాయాల విషయంలో కొంతవరకు రాజీపడటానికి ప్రయత్నించాలి. ప్రేమ వివాహాలు విఫలం అవుతున్నాయి అనే అపవాదును తొలగించాలి. పాత వద్దతుల వివాహాలే సుఖవంతంగా ఉన్నాయనే నమ్మకాలనుకూడా తొలగించి, కాలంతోపాటు ఆలోచించుకోవడం నేర్చుకోవాలి.

ఒక పురుషుడికి ఒక స్త్రీతోను, ఒక స్త్రీకి ఒక పురుషుడితోను మాత్రమే జరిగే వివాహం నాగరికతకు నిలయం; పెట్టనికోట.

—ఇంగర్ సాల్

ఆదర్శ దాంపత్యం

తురగా
జానకీరాణి

వివాహం అనే అంశం గురించి చెప్పాలంటే, లోకంలో ఎంతమంది దంపతులున్నారో అన్ని చోట్ల నిర్వచనాలు చేయవలసివస్తుంది. ఒక మనిషిని ముమ్మూర్తులా పోలిన మనుషులేవిధంగానైతే వుండరో, ఒక దాంపత్యానికి నమూనా అనదగిన దాంపత్యం మరొకటి వుండదు.

ఐనప్పటికీ స్థూలంగా కొన్ని అంశాలు సుఖజీవితానికి దోహదం చేసేవిగాను, మరికొన్ని అశాంతిని పురికొల్పేవిగానూ విభజన చేసుకునే అవకాశమున్నది. వివాహానికి సంబంధించిన ఏ సిద్ధాంతీకరణైనా, యీ అంశాలలోనే యిమిడుతుంది. దేశకాల పరిస్థితులలో ఎటువంటి ముప్పులు వచ్చినా, సంసారంలో శాంతికీ, అశాంతికీకూడా ప్రధానకారణం మాత్రం ఎప్పటికీ మనుష్య ప్రవృత్తే. ఇది అనుభవజ్ఞులందరికీ తెలుసు.

సుఖశాంతినిలయమై, గృహమే స్వర్గసీమ అనిపించేది ఆదర్శ దాంపత్యం. ఇది సృష్టిలోగానీ, ముల్లోకాల్లోగానీ లేదనడానికి తార్కాణం మనదైవాలు సైతం అస్తమానం కీచులాడుకోవడమే. ఇలాచెప్పుకొంటే మానవమాత్రులకు కూడా కొంత ఊరటగా ఉంటుంది. ఒక స్త్రీకి, ఒక పురుషుడికి మధ్య ఆకర్షణ, ఆరాధన, పెదవి విప్పి చెప్పకుండానే యింగితం గ్రహించుకునే అవగాహన, కంటికి రెప్పలా, గుండెలోని చప్పుడులా కలిసి పోవడం — ఇవన్నీ ఆదర్శ దాంపత్యం లక్షణాలు. దీని ప్రాతిపదిక ప్రేమ. సాంఘిక, ఆర్థిక, నైతిక విషయాలన్నిటికీ అతీతమై పెనవేసుకొని పోయిన ఒక స్నేహబంధం. ఈ బంధంలోని ప్రగాఢత, మైత్రిలోని తీపి జంటలు తమ జీవితంలోని కొన్నికొన్ని సందర్భాలలో చవిచూచి తరించి వుండవచ్చును. కాని మన దేశంలో కొన్ని దశాబ్దాలపాటు సాగే సంసారాల్లో ఆ మైత్రి చెక్కుచెదరక అలాగే ఉంటుందనుకోవడం ఆత్మవంచన.

విద్య, వివేకంకలిగి, వయోజనులైన భార్యాభర్తలు స్వప్రయత్నం ద్వారా ఆదర్శ దాంపత్యాన్ని సాధించవచ్చును. ప్రతి రంగంలోను కృషి, పట్టుదల, చిత్తశుద్ధి, ఆత్మత్యాగం ఎంత అవసరమో ఈ విషయంలోనూ అంతే అవసరమవి. మనస్ఫూర్తిగా ప్రయత్నించి ఒక ఆచరణ సాధ్యమైన పద్ధతి ఎవరికివారు రూపొందించుకోవచ్చును.

ఇల్లా చెబితే, వివాహమనేది పరిధానంగా ఒక సర్దుబాటు విషయం అని స్పష్టమవుతుంది. పైనందిన జీవితానికి సంబంధించిన చిన్న విషయాలనుంచి, బ్రతుకుకి అవసరమైన దీర్ఘకాల ప్రణాళిక వరకు పరితి అంశంలో తన జీవిత భాగస్వామి అభిప్రాయాలను మన్నించడం, చేతనైతే తనకు అనువుగా ఎదుటి వ్యక్తిని మార్చుకోవడం, తన సంసారధ్యేయం ఏమిటి, వ్యక్తిగత అభివృద్ధిని సాధిస్తానా, సంసారంలో ఒడిదుడుకులు లేకుండా జాగ్రత్తపడడం ఎల్లా అనేవి యోచించుకోవడం — ఇవన్నీ అవసరం. ఈ విషయాలు ఒక సమావేశంగా కూర్చొని చర్చిస్తారని కాదుగాని, సంసారం ఆరంభించిన తొలిరోజులలోనే ఎవరికి వారికి ఈ ధ్యేయాలు స్ఫురిస్తాయి. వాటిని గుర్తించి ఆ దిశగా జీవితాన్ని మళ్ళించవలసివుంటుంది. ఇష్టంతో చేయిచేయి కలుపుకొని పరియత్నించాలి. ఎడాపెడా లాక్కుండా, అసలు దారిలో కనిపించనంత గందరగోళంలో పడండాకునే ఈ సర్దుబాటు.

ఏజంట కొజంట ఈ సర్దుబాటు సాధించుకొన్నప్పటికీ, ఇరువురి కుటుంబాలకు సంబంధించిన ఇతరులు దాన్ని సాగనివ్వక పోవచ్చును. కనుక, ఆకాశం విరిగి నెత్తినపడినాసరే మనమిద్దరం ఒకటి అనే ఐక్యత దంపతుల్లో ప్రస్ఫుటమైతే, ఇతరులు ప్రక్కకు తప్పుకుంటారు. తల్లులకీ, తండ్రిలకీ, ఇతర పెద్దలకీ తరచు గుర్తుచేస్తుండవలసిన సంగతిఇదే. వాళ్ళిద్దరిదీ ఒకే జీవితం, మనమంతా పరాయివాళ్ళం అనే సంగతి.

సంసారంలో అత్త, ఆడబిడ్డలు, తోడుకోడళ్ళు మొదలైన స్త్రీ జనం, మామ, మరదులు, బావలు మొదలైన పురుష జనం ఉంటారుకదా! పరితి దంపతులకి వీరందరిపట్ల కొద్దోగొప్పో బాధ్యతవుంటుంది. వివిధ దశలలో ఏ బాధ్యత ఎంతవరకు వహించాలి, ఎక్కడ నిష్కర్షగా వదిలించుకోవాలి అనే విషయాల్లో భేధాభిప్రాయాలు తరచుగా వస్తుంటాయి. 'నీ వాళ్ళు',

'నావాళ్ళు' అనే విద్వేషం అంకురిస్తుంది. కాపురం చేయవలసిన ఆలుమగల మధ్యనే, ఈ మధ్యవారి జీవితాదర్శాలు చొచ్చుకొనివస్తాయి. మారుతున్న ఆర్థిక వ్యవస్థలో, ఉమ్మడి ఆస్తులుతగ్గి, ఎవరి సంపాదన, వ్యక్తిగతసంపద వారికుంటున్న తరుణంలో, భార్య, భర్త, వారి సంతానం మాత్రమే ఒక 'యూనిట' అని భావించాలి. అంల్లాటి సందర్భంలో ఇతరులంతాకూడా తమ పరిధిని గ్రహించి, తమ కనీసావసరాలను మాత్రమే అన్న, వదినలు తీర్చరని అనుకోవాలి. తమపట్ల కొడుకులకుగాని, అన్నదమ్ములకుగాని పరిమితమయిన బాధ్యతవుందన్న సంగతి గ్రహించనివారు ఆలుమలమధ్య కలతలకు కారణమవుతారు. ఈ వత్తిడులను తట్టుకునే సహనం, వివేచన దంపతులలో ఉండాలి.

నాగరికత మనకిచ్చిన గొప్పశక్తి 'డబ్బు' అంటే అతిశయోక్తికాదు. ధనము, యితర సంపదలు విరాట్ స్వరూపదాల్చి, భార్యాభర్తలను ఆవహించి ఆటలాడిస్తున్నవి. కోరికలు ఎప్పుడూ గుర్రాలే. సంసారంలోని భార్య భర్త, వారిపైన ఆధారపడిన యితరులుకూడా గుర్రపుపందేల ధోరణిలో కోరికలను పరుగులెత్తిస్తే ఆ సంసార రథం బోల్తాపడక తప్పదు. కొత్తగా కొన్నదవున్న భూమి గట్టితనం ఎంత, వడగాలికి, జడివానకు తట్టుకోవడానికి సంసారం ఎల్లా పటిష్టంచేసుకోవాలి అనే విషయాల్లో అందరికీ జాగ్రత్త అవసరం. పెద్దలు, ఆస్తులు, అప్పులు వాటన్నింటికీ సమాధానం చెప్పుకోగలిగిన గట్టితనం, పట్టువిడుపులు చాకచక్యం దంపతులకి వుండాలి. 'నీది', 'నాది' అనే ధోరణికంటే, మనది అనే ఉమ్మడి సమైక్యతావాక్కు అవసరం. లేకపోతే, అందరిలో లోకువకావడం, ఎడాపెడా సంసారాన్ని నలుగురూ పట్టిలాగటం తథ్యం.

సంసారవృక్షానికి తియ్యని ఫలాలు బిడ్డలు. ఆ బిడ్డల సమగ్ర సంక్షేమంకోసం ఓర్పుతో కృషిచేయడం భార్యాభర్తలిద్దరి కర్తవ్యం. ఈ విషయంలో వలతులు, అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు పిల్లలు నలిగిపోతారు. వారి వ్యక్తిత్వం భయంకరంగా దెబ్బతింటుంది, స్వసుఖం త్యాగంచేసి, పిల్లలకోసం నిజమైన సమస్యలను కూడా పక్కకునెట్టి, యిల్లంటే నందనవనమని, అందులో అమ్మా, నాన్న దేవతలనీ వారికి భగ్నమయినా కలగచేయగలిగిన వారు ధన్యులు.

స్త్రీ పురుషుల సహజీవనం, సాహచర్యం వివాహలక్ష్యాలు. శారీరకమైన ఆకర్షణ, పరస్పర స్పర్శానందం సహజంగానే తరుణవయస్కుల్లో ఉన్నప్పటికీ, వాటిని పరిపోషించు కోవటంకూడా అవసరం. జీవితకాలం కలిసివుందామని నిశ్చయించుకున్నారు కనుక, ఒకరి సాహచర్యాన్ని ఒకరు ఆక్షేపించడం, ఇతరులెవ్వరూ ప్రవేశించలేని ఏకాంత మాధుర్యం కోసం తపించడంకూడా అవసరం. వర్ణనాతీతం, అనుభవైకవేద్యం అయిన ఒక బంధం వారిని పెనవేసినప్పుడు సృష్టిలో భర్త ఒక్కడే ఆమెకు పురుషుడు, ప్రకృతిలో భార్య ఒక్కతే అతనికి స్త్రీ. ఇతరులంతా భ్రాతృసమానులే, మాతృసదృశులే.

పురుషుడికీ, స్త్రీకికూడా సంసారంతోపాటుగా అతిముఖ్యమైన అంశం తమతమ ఉద్యోగాలు, వ్యాపకాలు. ధర్మనిర్వహణకు, ఇటు గృహకర్తవ్య నిర్వహణకు సమానమైన తూకం ఇవ్వగలగాలి స్త్రీ, పురుషుడు. నాకంటే మీకు ఆఫీసుమిన్న అనిగాని, నాకంటే నీకు ఉద్యోగం ఎక్కువ అనిగాని సాధించుకునే సందర్భాలు అతి కొద్ది మోతాదులో వుండాలి. పెద్దచదువులు చదివి, సాహిత్య, కళారంగాల్లో పెద్ద పేరుతెచ్చుకున్న సందర్భాల్లో కూడా వృత్తివేరు, దాంపత్యంవేరు — రెంటికీ సమానంగా అంకితం కావాలనే తపనవుండాలి. అది లోపించిన నాడు దాంపత్యం విచ్ఛిన్నమవుతుంది.

ఆదర్శమైన, వాంఛనీయమైన దాంపత్యానికి ఎన్ని అత్యవసర అంశాలున్నాయో అవన్నీ చెప్పుకున్నాము. ఎన్ని బాహ్య విషయాలు దీనికి అవరోధాలు కలిగిస్తాయోకూడా పరిస్తావించుకున్నాము. ఇవికాక, కులగోత్రాలు, మతం, అంతస్తు, భాష మొదలైన విభేదాలతోనే ఆరంభమైన సంసారం మరింత కంటక మార్గంలో ప్రయాణం చెయ్యాలి. అది ఓటిపడవే ఆయినా గట్టిపరచే అదనపు బాధ్యత భార్యా భర్తల మీదవుంది.

సంసారం ఎటులాగినా, ఎటుసర్దినా సాగదనే నిశ్చయానికి వస్తారు మొదట దంపతులు. వివాహం వ్యక్తిగత విషయం, నిజమే. కానీ అది సామాజిక విషయం. సమాజంలోని యితరుల జీవితాలను ప్రభావితం చెయ్యగల విషయం. పిల్లలు కలిగిన తర్వాత బాధ్యతకు సంబంధించిన విషయం. ఎవరెటుపోయినా ఫరవాలేదు నా సుఖం ముఖ్యం అనుకోవడం

పరమ క్షుద్రమైన స్వార్థం క్రిందకు వస్తుంది. దుర్భర పరిస్థితులలో వివాహ జీవితం కొనసాగదని తెలిసినప్పుడు చట్టరీత్యా తెగతెంపులు చేసుకోవడం తప్పనిసరే. కానీ భార్యకు పునర్వివాహం, పిల్లలకు సుఖమైన భవిష్యత్తు ఎంతవరకు సమకూడుతాయన్నది యిప్పటికి పెద్దప్రశ్న. నాగరికత పెరిగినా యీ సమస్యకు పరిష్కారంలేదు. బిడ్డల్ని కడుపులో పెట్టుకొని దాచుకో వలసింది తల్లేనని అనేక వందల జీవితాలు నిరూపిస్తున్నాయి ప్రత్యక్షంగా.

కళాశాల విద్యలో వైవాహిక జీవితానికి సంబంధించిన ప్రాథమిక లక్ష్యాలు నేర్పడంకూడా అవసరం. యువతీ యువకులు యీ విషయాలు చర్చించే సాహసం వుండాలి. ఇది సెక్సు విద్యకాదు. సంసార సమస్యల పరిశీలన, చర్చ, భావిజీవితంలో ఎదురొక్కనవలసిన పరిస్థితులతో పరిచయం అని గ్రహించాలి.

పెద్దలుకూడా తమ తరం, తమ జీవితం పూర్తయిందని, పిన్నలు అనుభవాలను ఎదురొక్కనేందుకు తరుణం వచ్చింది కనుక, వారి విషయాల్లో కలగజేసుకోకూడదని గుర్తించాలి.

"మానవులు చేసుకోగల ఒప్పందాలన్నింటిలో వివాహం చాలా ప్రాముఖ్యత కలది"

— ఇంగర్ సాల్

"ప్రేమ కళకు తల్లి; కవులనూ, దేశభక్తులనూ, తత్వవేత్తలను ఉత్తేజపరిచేది."

— ఇంగర్ సాల్

"సంకుచిత మనస్కులూ, ఇంకా ఆ బాపతు జనం ప్రేమను ఉదాత్తమైన ఉద్రేకవిషయంగా పరిగణించక విధ్యుక్త ధర్మంగా చిత్రించుకొని 'స్వార్థత్యాగానికి' ఒడిగడ్తున్నారు; సర్వోత్కృష్టమైన ఆనందాన్ని కాలదన్నుకుంటున్నారు."

— ఇంగర్ సాల్

వరకట్నం --

సామాజిక పరిశీలన

— డా|| కె. మురళీ మనోహర్
వి. శోభ

వివాహమనేది ఒక సామాజిక క్రియ. వివాహానికి సంబంధించి జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో పురుషునికున్న స్వేచ్ఛ స్త్రీకిలేదు. పైగా వరకట్నమనే సాంఘిక దురాచారంలో సంతలో పశువులనుకొన్నట్లు యువకులను కొనడం, కొనలేని ఆడవాళ్ళు ఏళ్ళ తరబడి అవివాహితలుగా మిగిలిపోవడం సర్వసాధారణమైంది.

వరకట్నమంటే ఏమిటి? అసలు ఈ వరకట్న సమస్యకు మూలం ఏమిటి? అది ఎప్పుడు మొదలయింది? ఏ విధంగా పునాదులు వేసుకొని జీవితాలకు సమాధి కడుతొంది అని ఆలోచిస్తే ఈ సమస్యకు తరిష్కారం లభ్యమవుతుంది.

వరకట్నమనగా వివాహ సమయమందు నగదు రూపంలో గాని, వస్తురూపంలోదాని లేదా రెండూగాని వరుడికి వధువు తల్లిదండ్రులు అందించే 'కట్నం' లేదా బహుమానం లేదా లాంఛనం.

పరకట్నమనేది తల్లిదండ్రుల శక్త్యానుసారం ఇచ్చేటట్లయితే అది వరుడికి వాళ్ళతరఫు బంధువులకు ఆమోదయోగ్య మవుతుందా, అసలు ఆడపిల్లలను బరువు గా భావించడంవల్ల తల్లిదండ్రుల దగ్గరనుంచి అమ్మాయిని స్వీకరించినప్పుడు కట్నం అవసరమవుతుందా — అనేది ఆలోచించవలసిన అంశం. కాని ఈ రకమైన ఆలోచన కొనసాగినంతకాలం వరకట్న నిషేధానికిచేసే ప్రయత్నాలన్ని కూడా నిష్ప్రయోజన మవుతాయి. 'స్త్రీని పనికిరానిదిగా' పరిగణించడం ఆమె వివాహానంతరం పుట్టింటినుండి తనతో తీసుకువచ్చే సామగ్రినే విలువైనదిగా భావించడం — అలా తేలేని వారు, ఒప్పుకొన్న వస్తువులను సకాలంలో చెల్లింపలేని స్త్రీలు వరకట్న దురంతాల కోరలలో నలిగి నశించిపోతున్నారు.

వరకట్న దురాచారం కొనసాగటానికి అనేక కారణాలున్నాయి. అందులో ఆర్థిక కారణంతోపాటు ప్రధానంగా సాంస్కృతిక కారణంకూడా ముడివడియుంది. ఒక అబ్బాయి వరకట్న వ్యతిరేకి అయినప్పటికికూడా అమ్మాయి తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన, బలవంతం వలన 'కన్యాదాన' సమయంలో అబ్బాయికి ఏదో రూపంలో కొంత ముట్టచెప్పడం జరుగుతుంది. దీనికి కారణం వరకట్నం ఇవ్వకుండా పెళ్ళిచేస్తే వారి హోదా తరిగిపోతుందేమోననే భయం, సమాజంలో చిన్నచూపు చూడబడతామోనన్న అనుమానం వరకట్నం దురాచారంగా ప్రబలడానికి కారణమైంది. ప్రేమ పూర్వకంగా ఇచ్చిన బహుమానం కిమేఁ శక్తికిమించి ఇస్తే తప్ప అమ్మాయి వివాహంకాదు అనేంతవరకు సాగి, అతిముఖ్యమైన సామాజిక సమస్యగా పరిణమించింది. పైగా వరుడి తల్లిదండ్రులు తమ కొడుకు 'పనికిరానివాడు కాడు' కాబట్టి ఎక్కువ వరకట్నాన్ని కోరడంకూడా వరకట్న సమస్యను మరింత తీవ్రతరం చేసింది. పురుషుడి ఉద్యోగ హోదానుబట్టి, సంపాదననుబట్టి వరకట్నపు రేట్లు పెరిగిపోతున్నాయి. వరకట్నం ఇలా కొనసాగడానికి కొంతవరకు ఆడపిల్లలుకూడా బాధ్యులవుతారు. మధ్యతరగతి లేదా కిందిమధ్యతరగతి కుటుంబంలోకి భార్యగా వెళ్ళిన స్త్రీ అత్తవారి పేదరికాన్ని భరించలేక అలాంటి సంబంధంచేసిన తల్లిదండ్రులను తూలనాడటం వల్లకూడా తల తాకట్టుపెట్టయినా తల్లిదండ్రులు కూతురికి ఘనంగా కట్నమిచ్చి అయినింటి సంబంధాలు చూస్తున్నారు. అటువంటప్పుడు కట్నం తీసుకొన్న భర్త అంతరంగాన్ని అర్థంచేసుకోలేక, అతడిని అసమర్థుడుగా పరిగణిస్తూ, తల్లిదండ్రుల నిందిస్తూ పురికొందరు స్త్రీలు జీవితాలను చేజేతులా నరకప్రాయం చేసుకోవటం వల్లకూడా ఈ వరకట్నం ఒక సమస్య అయింది. కొగా ఇంకోరకపు పెళ్ళి కొడుకులు వివాహసమయమందు 'అతి మంచివాడ' ని పించుకొని వివాహానంతరం కోరే గొంతెమ్మ కోరికలను తీర్చలేక ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు నలిగిపోతున్నారు. అడపడుచుల లాంఛనాలను చెల్లించలేక, భర్తల, కోరికలను తీర్చలేక, అత్తగారి వాగ్బాణాలను ఎదుర్కోలేకనే ఎంతోమంది ఆడపిల్లలు తమ జీవితాలను అంతం చేసుకోవడం, అత్త, భర్తలచే హత్య గావింపబడటం మనం నిత్యజీవితంలో చూస్తూనే ఉన్నాము.

సాంప్రదాయికమయిన మన సమాజంలో వేళ్ళూనుకుపోయిన ఈ సమస్య అనేక కొత్త సమస్యలకుకూడా దారితీస్తుంది. వరుడు, వరుడి తల్లిదండ్రిలు వివాహ సమయమందు కోరే విపరీతమయిన కోరికలకు అసలు కారణం స్త్రీలపట్ల వారికిగల చులకనభావం, వారు నిర్వహించే గృహ కృత్యాలకు విలువకట్టకపోవడం వలన అనేది సుస్పష్టం. సాంప్రదాయికంగా కూడా చూచినట్లయితే వివాహ సమయమందు కుమార్తెకిచ్చే లాంఛనాలు ఏదో రూపంలో, ఎంతోకొంత చెల్లించవలసి రావడం వలన ఆడపిల్లలు తల్లిదండ్రిలకు గుండెలమీద కుంపటి అయినారు. దానివల్ల అమ్మాయి కుటుంబసభ్యులంతాకూడా తమ చిన్నచిన్న కోర్కెలను సైతం త్యాగంచేసి ఎదిగిన తోబుట్టువు పెళ్ళికి శక్త్యానుసారం తోడ్పడటం అనేదికూడా చాలా మామూలయింది.

ఈ రకంగా వరకట్నం కొనసాగటానికి మూలకారణం స్త్రీలు నిర్వహించే గృహ కార్యకలాపాలకు ఎటువంటి ఆర్థికవిలువ లేకపోవడం — వివాహం వలన కుటుంబంలోకి కొత్తగా అడుగుపెట్టిన కోడలిని అదనపు బరువుగా, ఏం పనిలేక ఊరికే తినికూర్చునేదిగా భావించడం వలన స్త్రీల పుట్టుక భారమైంది. పైగా తమపట్ల కనీస గౌరవాదరాలు కలిగి యుండటానికి అసలు కారణం ఆమె "వంశోద్ధారకుడి" ని కనివ్వస్తుందనే భావమే. అలా ఇవ్వలేని స్త్రీ, కూతుళ్ళనుకన్న స్త్రీ బాధలు చెప్పనలవికావు. దానికంతకూ ఆమే కారణమయినట్లు అందరూ ఆమెను నిందించడంకూడా అతి మామూలయిపోయింది ఈ సమాజంలో. అలాంటి సందర్భాల్లో 'వంశోద్ధారకుడి' ని కనడం కోసం కొడుకులను మళ్ళీ మార్కెట్లోపెట్టి మరో కన్నెపిల్ల మెడలో ఉరిత్రాడువేసి ఆమె అలా కనలేనినాడు ఆమె జీవితంకూడా నరకప్రాయం చేయడానికి వెనుకాడని వ్యక్తులున్న సంఘమిది.

అందువల్ల ఎంతో అనర్థదాయకమై, ఆనందాన్ని, జీవితాలను హరిస్తున్న ఈ దురాచారం "కన్యాశుల్కం", "వరకట్నం" రూపంలో ఎప్పుడు వచ్చాయో తెలుసుకోవడం ఎంతైనా అవసరం. అందుకు గత చరిత్రయే మనకు ఆధారమవుతుంది. ప్రాచీనకాలంనాటి కుటుంబ చరిత్ర

పరిశీలిస్తే వివాహబంధం పరిధి అంతకంతకూ సంకుచిత మవుతూవచ్చింది. రక్తసంబంధీకుల కుటుంబం[1]లోను, పునాలువీన్ కుటుంబం[2]లోను అమలులో ఉన్న కుటుంబ పద్ధతులలో మగవాడికి ఆడవాళ్ళ కొరత ఎన్నడూలేదు. పై పెచ్చు చాలా ఎక్కువగా లభిస్తుండేవారు. జంటపెళ్ళి కుటుంబవ్యవస్థ అమలులో కొచ్చేనాటికి ఆడవాళ్ళు కరువయ్యారు. వాళ్ళకోసం వెతుకులాడ వలసి వచ్చింది. ఫలితంగా జంటపెళ్ళి[3] తో పాటు ఆడపిల్లల్ని ఎత్తుకొచ్చి పెళ్ళిచేసుకోవడం. డబ్బిచ్చి కొనుక్కోవడంవంటిప ద్ధతులు వ్యాప్తిలోకి వచ్చాయి.ఇప్పటి వరకట్న దురాచారం వంటివి ఆ వ్యవస్థ గుర్తులేకాని మరేమికావు. భార్యల్ని సంపాదించడంలో అవలంబించిన పద్ధతుల్ని మాక్ లెన్నాన్ ప్రత్యేకతరగతి వివాహపద్ధతులని ఊహించాడు — "రాక్షస వివాహం", "కన్యాశుల్కం" వివాహం వాటి ప్రకారం ప్రత్యేక కుటుంబ తరగతులయ్యాయి.

---

1. రక్తసంబంధీకులు :- ఇది కుటుంబవ్యవస్థ ప్రప్రథమదశ. ఇందులో వివాహబంధంలో కలిగే గుంపులు వారివారి తరాల్నిబట్టి విభజితం అవుతాయి. ఒక కుటుంబంలోని తాతలు, అవ్వలు ఒకరికొకరు భార్యాభర్తలు. వీరి సంతానం అయిన స్త్రీపురుషులు ఒకరికొకరు భార్యాభర్తలు. అలాగే వీరిబిడ్డలు అంటే మొదటితరం వారి మనుమలూ, మనుమరాండ్రు (మూడోతరం) ఒకరికొకరు భార్యాభర్తలు — అలాగే మునిమనుమలూ మనుమరాండ్రూ నాలుగవ బృందం. ఈ మాదిరి వివాహాలలో ఒకటి రెండు తరాలవారు, రెండూ మూడు తరాలవారు వివాహ సంబంధం కలిగియుండ కూడదు.

2. పునాలువీన్ కుటుంబం :- తల్లిదండ్రులకి సంతానానికి మధ్య లైంగిక సంబంధాల నిషేధం కుటుంబనిర్మాణంలో వచ్చిన మొదటి మెట్టుకాగా, తర్వాత వచ్చిన సోదరీమణులమధ్య లైంగిక సంబంధాల నిషేధం రెండోమెట్టు.

3. జంటపెళ్ళి :- జంటపెళ్ళి రూపంలో యే ఇద్దరు వ్యక్తులమధ్యనో దాంపత్య సంబంధంవుండే స్థితి ఏర్పడుతుంది. ఈ దశలో మగవాడు ఒకే ఆడదానితో జీవిస్తాడు. బహు భార్యాత్వము — ఇతర స్త్రీలతో పొందు మగవాళ్ళ ప్రత్యేకహక్కు అయినప్పటికి అసంఖ్యాకంగా వుండే భార్యలలో ఒకామె మగవానికి ముఖ్యభార్యగా వుండేది.

మధ్యయుగాల ఆఖరువరకు వివాహానికి సంబంధించి వధూవరుల సమ్మతికి ప్రాముఖ్యంలేదు. ప్రారంభంలో మనుష్యుడు వివాహితుడుగానే పుట్టేవాడు పుట్టుకతోనే పురుషుల గుంపుకంతకూ ప్రతి స్త్రీ భార్య — అలాగే స్త్రీల గుంపుకంతకూ ప్రతి పురుషుడూ భర్త. ఈ విధమైన గుంపుపెళ్ళిలో అనేక మార్పులువచ్చి కొత్తరూపాలు ఏర్పడ్డాయి. గుంపులు పరిమితమవుతూ వచ్చాయి. జంటపెళ్ళిళ్ళలో మామూలుగా తల్లులు తమ బిడ్డలకు సంబంధాలు కుదిర్చేవారు. ఆ దంపతులకు గుణంలోను, తెగలోను బలీయమైన స్థానం ఏర్పడేటట్లుచూసి సంబంధాలు కుదిర్చేవారు. క్రమంగా ఉమ్మడి ఆస్తికన్నా సొంతఆస్తికి ప్రాముఖ్యత లభించింది. తన బిడ్డలకే ఆస్తి సంక్రమింప జేయాలన్న ఆమర్దా ఏర్పడింది. తండ్రిహక్కు, దాంపత్య వివాహం ప్రాముఖ్యానికి వచ్చాయి. దానితో అంతకు ముందెప్పటికన్నా ఇంకా ఎక్కువగా ఆర్థిక విషయాలమీదనే ఆధారపడి వివాహం జరిగేది 'శుల్కం' ఇచ్చి కన్యను కొనుక్కొనే పద్ధతి అంతరించింది. ఆడదానికి కాక మగవాడికికూడా విలువకట్టడం అమల్లోకి వచ్చింది. విలువ అతని గుణగణాలకు, వ్యక్తిత్వానికి కాక అతనికున్న ఆస్తినిబట్టి వచ్చింది. వధూవరులమధ్య పరస్పరప్రేమే వివాహానికి మూలంకావాలని పాలకవర్గీయులు ఎన్నడూ వూహించి యుండరు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వ్యాపారం, వస్తూత్పత్తులద్వారా ప్రపంచాధిపత్యం సంపాదించేటందుకు ప్రయత్నాలు ఆరంభించిన నాటి పరిస్థితులవి. ఉత్పత్తివిధానం ప్రతి ఒక్కదాన్ని మారకపు సరుకుగా మార్చేసింది. అనుభూతంగా వస్తున్న ఆచారాలను — చారిత్రకంగా లభించిన హక్కులు తుడిచేశాయి. స్వేచ్ఛాయుత ఒప్పందాన్ని తెచ్చిపెట్టాయి. వివాహంకూడా ఇలాంటి ఒక ఒప్పందమయింది. దాంపత్య సంబంధాలు, మగవాని పెత్తనం, వివాహం రద్దుచేయ వీలులేనటువంటి పరిస్థితులేర్పడ్డాయి.

వీణాదాసు పాశ్చాత్య సమాజంలో అధికారం ప్రధానంగా తండ్రి చేతుల్లో ఉంటుందని తెలియజేసింది. ఆ సమాజంలో తండ్రి సాంఘిక అధికారాన్ని కలిగియుంటాడు. భార్యగా, గృహిణిగా స్త్రీకి అధిక ప్రాధాన్యం

ఇస్తారు అక్కడ. కుటుంబం కేవలం వినియోగదారు స్థాయికి దిగజారిపోవడంలో తండ్రి సంపాదన అతని అధికార చిహ్నంగా మారుతుంది. ఎందుకంటే కుటుంబపు జీవనస్థాయి డబ్బుపై ఆధారపడియుంటుంది. కనుక అలాంటి వ్యవస్థలో పిల్లలపైన, తమపైన కుటుంబ యజమాని అధికారాన్ని బలపరచడంలో స్త్రీలు సహకరిస్తారు.

కాని సుధీర్ కక్కర్, ఆషిస్‌నంది వంటి మనస్తత్వ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ఆధారంగా, భారతీయ కుటుంబంలో అధికారం తండ్రి చేతుల్లోకాక తల్లిచేతుల్లో ఉంటుందని సూచించారు. భారతీయ కుటుంబంలో పరిముఖపాత్ర వహించేది భార్యాభర్తలు కాదు — తల్లీ బిడ్డలే. వివాహం బంధంతో సంతృప్తి చెందని స్త్రీ కుమారునిపై విపరీతమైన అభిమానం, మమకారం పెంచుకోవడం ద్వారా ఆ కొరత తీర్చుకుంటుంది. పైగా ఎదిగిన కుమారులపై ఆ పెత్తనం పదులుకోలేక కోడళ్ళపై కూడా అధికారం చెలాయిస్తూ వరకట్నం సరిగా చెల్లించని స్త్రీలను నానా బాధలకు గురి చేయడంకూడా చాలా సాధారణమైంది. పైగా వరకట్నంవల్ల సంభవించే మరణాల వార్తలను పరిశీలిస్తే తల్లి కుమారుడు కలిసి కొత్త పెళ్ళికూతురిపై కుట్రిపన్నినట్లు స్పష్టమవుతుంది. పెద్దలదురాశ ఈ మరణాలకు కారణమనేది బాహ్య దృష్టికాగా భార్యాభర్తల వివాహబంధానికి, తల్లీబిడ్డల అనుబంధానికి మధ్య జరిగే ఘర్షణలో తల్లీ బిడ్డల అనుబంధం ప్రాబల్యం వహించి, ఆ ప్రాబల్యం నవవధువుల దారుణ హత్యలకు దారితీస్తుంది.

వరకట్నపు దురాచారానికి బలి చేయబడుతున్న నిర్భాగ్యురాళ్ళ సంఖ్య రోజురోజుకి పెరిగిపోతుంది. తెచ్చిన కట్నం చాలలేదనో, ఇచ్చిన లాంఛనాలు సరిపోలేదనో వేధించి, పుట్టింటి దగ్గరినుండి మరింతడబ్బు తెమ్మంటూ మానసికంగా, శారీరకంగా స్త్రీలను చిత్రహింసలు పెట్టడం, అలా తేలేని స్త్రీని హత్యచేయడం — ఆ హత్యను ఆత్మహత్యగా తీర్చిదిద్దడం ఆ విధంగా ఒక స్త్రీని అంతంచేసి మరో స్త్రీని కట్టుకోవడం ఈ పురుషాధిక్య సమాజంలో దాదాపు మామూలయిపోయింది. ఈ దురాచారంవలన భార్యాభర్తల సంబంధాలు సైతం 'వ్యాపారమయమై' భార్యలను కొట్టడం, వదలివేయడం, విడాకులు తీసుకోవడం వంటి విషయాలు ప్రధానంగా మధ్య, క్రింది మధ్యతరగతి కుటుంబాలలో చాలా మామూలయిపోయాయి.

స్త్రీలకు సరియైన రక్షణ లేకపోవడం వలన స్త్రీలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 1981 లో మొదటి 3 నెలల్లో లక్నోలో 32 మంది వరకట్నానికి ఆహుతి అయినారు. ఢిల్లీలో 1980 లో వరకట్నానికి ఆహుతైన కేసులు 394 కాగా దేశంలో 500 కాగా, కట్నాలు తీసుకురానందుకు భర్తలు భార్యలను చంపివేసిన ఉదంతాలు మరిన్నో ఉన్నాయి. 1975 లో అటువంటివి 670 కేసులుంటే 1979 లో 1676 కు పెరిగినట్లు అధికార లెక్కలు సూచిస్తున్నాయి. కొత్తగా పెళ్ళయిన యువతులు, వరకట్న సమస్య వలన ఆహుతైన వారిసంఖ్య 1977 లో 12 మంది ఉంటే 1980 లో 22 మంది ఉన్నారు. ఈ కేసులన్నికూడా ఎవరో రిపోర్టుచేయగా వచ్చినటువంటివే. ఇందులో 1676 కేసుల్లోను 744 ఉత్తర ప్రదేశ్‌లోను 362 మహారాష్ట్ర నుండి రిపోర్టుచేయబడినది. 249 ఆంధ్రనుండి 148 ఢిల్లీ నుండి, 98 రాజస్థాన్ నుండి 48 పశ్చిమ బెంగాల్ నుండి, 2 తమిళనాడు నుండి, 2 కర్నాటక నుండి రిపోర్టు చేయబడినవి. కేరళ నుండి ఒక్కటి కూడా రిపోర్టు చేయబడలేదు.

మహిళే దేశాన్నేలుతున్న రోజుల్లోకూడా ఆడకూతుళ్ళ జీవితాలకు ఏ మాత్రం భరోసాలేదు. స్త్రీలపై జరిగే అత్యాచారాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. వాటిని రిపోర్టుచేయని పత్రికలంటూలేవు.

ఆంధ్రప్రదేశ్‌ను కదిలించిన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు 13 కిలోమీటర్ల దూరంలో ధర్మవరం గ్రామంలో ఒళ్ళు కాలిన ఫలితంగా మరణించినకేసు కందుల కోటి నాగమణి. ఈ కేసు సందర్భంగా మహారాష్ట్రకు చెందిన సంఘసేవిక సీమానజారే ఈ కేసును స్వయంగా పరిశీలించి కందుల నాగమణిని ఆమె అత్త, భర్త కలిసి కిరోసిన్‌పోసి హత్యచేశారు అని నిర్ధారించారు. కట్నానికి సంబంధించి నాగమణిని వేధించి, వేధించి చివరకు ఈ హత్యకు ఒడిగట్టారు అని ఆమె తీర్మానించారు. హైదరాబాదుకు చెందిన మేఘమాల టాంక్ బండ్‌పై నుండి హుస్సేన్ సాగర్‌లోకిదూకి ఆత్మహత్య చేసుకోవటానికి కారణం ఆమెభర్త అత్తగార్ల వేధింపు చర్యలే. పుట్టింటి నుండి వస్తువులు తీసుకురమ్మని వేధించిన కారణంగానే నానా బాధలుపడ్డ మేఘమాల విధిలేక చివరకు ఆత్మాహుతి చేసుకుంది. తిరుపతిలో సైకాలజి లెక్చరర్ అయిన భారతి ఆత్మహత్యకు కారణం భర్త మరో అమ్మాయితో

కులుకుతూ భార్యను చిత్రహింసలు పెట్టడమే. కట్నంచాలని కారణంగానే రావిపాడు గ్రామానికి చెందిన లక్ష్మి, భీమవరంలో వెంకట ధనలక్ష్మి, మార్కాపురంలో సూర్యలక్ష్మి, సికింద్రాబాదులో శాంతకుమారి, విజయ, భాగ్యలక్ష్మి, విజయవాడకు చెందిన సువర్ణమేరి, హేమలత భర్త, లేదా అత్తగార్లచేత హత్య గావింపబడ్డారు. బెంగుళూరుకు చెందిన ఫిల్లిస్, కౌసల్య, శంషాద్ బేగం, కోకిల కూడా ఆ కోవకు చెందినవారే. ఇలా చెప్పుకుపోతుంటే సగటుగా రోజూ ఎక్కడో ఈ సమయానికి మరో మహిళ అఘాయిత్యానికి గురవుతుంది.

నేరస్థులను గట్టిగా శిక్షించడంద్వారా స్త్రీల మాన ప్రాణాలను దోచే వారిని కొంతవరకు శిక్షించవచ్చునేమో కాని, పురుషులు బాధ్యతాయుతమైన జీవితంలో భార్యలపట్ల అనురాగవంతులై వైవాహిక జీవితంలో ఉన్న ఆనందాన్ని గుర్తించడంద్వారా, తల్లులు ఎదిగిన తమ మగబిడ్డలపై అధికారాన్ని వదులుకొని కుమారులను స్నేహితులుగా గౌరవించడం ద్వారాను, తమ వైవాహిక బంధాన్ని దృఢతరం చేసుకోవడం ద్వారా మాత్రమే కొంతవరకు జీవితాన్ని సుఖమయంచేసుకొని, వరకట్న సమస్యను కొంతవరకు అరికట్టవచ్చు.

కాని వివాహంలో పూర్తిస్వేచ్ఛ వుండాలంటే పెట్టుబడిదారి ఉత్పత్తి విధానమూ, దాని ఫలితంగా ఏర్పడిన ఆస్తి సంబంధాలు రద్దయిపోవాలి. అప్పుడే భార్యాభర్తల ఎన్నికల విషయంలో ఆర్థిక విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వడం తొలగుతుంది — అప్పుడు పరస్పర ఆకర్షణతప్ప వివాహానికి మరేమి కారణం కాదు. అంతేకాని తాత్కాలికంగాచేసే చట్టాలద్వారా, సమస్యకు పూర్తి పరిష్కారం లభింపదు. చట్టాలలోఉండే లొసుగులు ఈ సమస్యను తీవ్రతరం చేస్తాయేతప్ప పరిష్కారానికి ఉపయోగపడవు.

అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా కేంద్ర ప్రభుత్వంచే ఏర్పాటయిన స్త్రీల హోదాకు సంబంధించిన కమిటి తన నివేదికలో వరకట్న నిషేధచట్టం విజయవంతం కాలేకపోవడానికి తగు కారణాలను వివరించింది.

1) వరకట్నం ఇవ్వడం పుచ్చుకోవడం విషయంలో కోర్టు స్వయంగా జోక్యం కలిగించుకోలేదు కనుక బాధితుడుగాని, అమ్మాయిగాని లేదా ఆమె

సన్నిహిత బంధువులుగాని కోర్టుకు వెళ్ళాలి. కాని అలా చేయడానికి కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళెవరూ కోర్టుకు వెళ్ళడానికి ఇష్టపడరు.

2) పైగా ఈ చట్టము తల్లిదండ్రులు, అత్తమామలు వధూవరులకిచ్చే "బహుమానాల" ను వస్తు రూపంలో అంగీకరిస్తుంది.

అందువల్లనే ఈ నివేదిక వరకట్నమివ్వటమనేదే నేరంగా కోర్టు గుర్తించాలని, బహుమానాలు 500 రూపాయల పరిధి లో మాత్రమే ఉండాలనిన్నీ సిఫారసు చేసింది.

ఏది ఏమయినప్పటికి సంయుక్త సంఘమేమో ఈ క్రింది సిఫారసులను సూచించింది.

1) వరకట్నమివ్వటమే కోర్టు గుర్తించాలి, కాని కావాలని తీసుకోవటం మాత్రమే తప్పు కాకూడదు.

2) వరకట్నం తీసుకున్నా లేక డిమాండు చేసినా 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు శిక్ష విధించాలి.

3) వరకట్నానికి సంబంధించిన ఫిర్యాదులు చేయడానికి ఎటువంటి నియమ నిబంధనలు ఉండనవసరంలేదు.

4) వరకట్న నిషేధ చట్టమును గురించి మాట్లాడుతూ కమిటీ బహుమానాలకు సంబంధించి చేసిన సీలింగు వార్షిక ఆదాయములో 20 శాతము గాని లేదా 15,000 రూపాయలు గాని ఏది తక్కువైతే దానిని పరిగణించాలని సూచించింది. అదే విధంగా వరునకుఇచ్చే బహుమానాల విలువ 3 శాతం ఆదాయంగాని, 2,000 రూపాయలకు మించిగాని లేదా ఏది తక్కువైతే దానిని దాటరాదని, వివాహానికి అయ్యే ఖర్చు 7 శాతము ఆదాయంగాని, 3,000 రూపాయలుగాని మించకూడదని లేదా అందులో ఏది తక్కువైతే దానిని పాటించాలని సూచించింది. పైగా అనుమానాస్పద పరిస్థితులలో కనుక అమ్మాయి మరణించినట్లయితే వరునకు ఇచ్చిన బహుమానాలను వధువు తల్లిదండ్రులకు తిరిగి పంపించవలసి యుంటుంది అనికూడా తెలియజేసింది.

వరకట్న నిషేధచట్టము రూపొందించిన నియమ నిబంధనలకన్నా, నిషేధాలకన్నా, సంయుక్త కమిటీ సూచించిన సిఫారసులు ఎక్కువ ఉదారంగా ఉండటానికి కారణాన్ని వివరిస్తూ ఈ కమిటీ ఇవి తల్లిదండ్రుల శక్తికి మించకుండా, సమాజానికికూడా ఆమోదయోగ్యమైనవన్న విషయాన్ని తెలియపరిచింది.

కాని మన సమాజంలో అనేక కుటుంబాలు కేవలం వారి ఆదాయం పైననే చాలీచాలని జీతాలతో జీవచ్ఛవాలలా బ్రతుకుతున్నప్పుడు వాళ్ళ ఆదాయంలో 10 శాతాన్ని కుమార్తె వివాహంపై ఖర్చు పెట్టడమనేది చాలా కష్టసాధ్యమైనపని. పైగా ఒకరికంటే ఎక్కువమంది కూతుళ్ళను కన్న తల్లిదండ్రులకు ఇది తలకు మించిన భారమవుతుంది. పైగా మరో కోణంలో నుండి పరిశీలించినా సమాజంలో కొన్ని కుటుంబాల 30 శాతం ఆదాయం కొన్నివేలు, లక్షలూ దాటవచ్చుకూడా. అలాంటప్పుడు ఉన్నవాళ్ళు ఇస్తూపోతే, లేనివాళ్ళు ఇవ్వలేకపోతారు. వారి కుమార్తెలు అవివాహితలుగానే మిగిలిపోవడమో, లేదా వారి తల్లిదండ్రులు శక్తికిమించి కట్నాలిచ్చి కుమార్తెల వివాహాలుచేసి అప్పుల్లో మునిగిపోవడమో జరుగుతుంది. అందువల్లనే వరకట్నమనేది ఉండాలా వద్దా అనేది మౌలికమైన సమస్యే వరకట్న నిషేధచట్టాలెన్ని చేసినా సమస్య ఎప్పటిలాగానే అపరిష్కృతంగా మిగిలిపోయిందే తప్ప పరిష్కారం సాధించలేక పోయింది. పురుషుడు స్త్రీని 'పనికిరానిదిగా', 'భారమైనది' గా భావించినంతకాలం, ఆమె సమాజంలో అత్యాచారాలను, అవమానాలను ఎదుర్కొంటూనే ఉంటుంది. పైన పేర్కొన్న కమిటీల సిఫారసులను ఆమోదించినా ఇది బలహీనంగానే ఉంటుంది తప్ప ఫలితమేమి సాధించడమంటూ ఉండదు.

వరకట్నం సాంఘిక దురాచారంగాను, ఘోరమైన అనాచారంగాను పరిదణింపబడటం వలన అందుకు సంబంధించి, వధువు హత్యలకు, దుర్మరణాలకు సంబంధించి వేలుగులోకివచ్చి హంతకులు మరణశిక్షకు గురికావలసియుంటుందనేది ఇటీవలనే సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. మూడు పదవత్సరాల క్రితం ఏర్పాటయిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ఏరకమైన నేరాలకు మరణశిక్ష విధించవచ్చో నిర్ధారించక వదిలివేసింది. కాని ఈ మధ్యనే వరకట్న మరణాలకు కారకులైన వారికి మరణశిక్ష సరియైన శిక్షగా ధృవీకరించింది.

వేలకువేలు వరకట్నాలిచ్చినా, అల్లుళ్ళ అలకలను, కోర్కెలను తీర్చుతున్నా వారి కుమార్తెలు మాత్రం అత్తామామలు, భర్తలచే ఇంకా అఘాయిత్యాలకు గురవుతూనే ఉన్నారు, హింసింపబడుతూనే ఉన్నారు. ఎన్ని ఘోరాలుజరుగుతున్నా, ఎంత అపహాస్యం పాలవుతున్నా, జీవితాలు అభాసవుతున్నా స్త్రీలు కష్టాలను సహించడం, భరించడం నేర్చుకొన్నారే గాని ఎదిరించడం నేర్చుకోలేదు. చలం అన్నట్లు తిరుగుబాటు ఆదర్శం. అందుకే స్త్రీలు పురుషులు పోరాటాలు సలిపి సామాజిక లోపాలను సరిదిద్దుకొని స్త్రీ పురుషులు ఒకరినొకరు దోపిడీ చేసుకోనట్టి సామాజిక వ్యవస్థను పునర్నిర్మించుకోవలసిన అవసరముంది. అందుకు ఈ మహత్తర కార్య సాధనకు ఎవరోవస్తారని, తోడు నిలుస్తారని ఎదురుచూడటం కన్నా తామే ఉద్యుక్తులై, ఉత్తేజితులై అన్ని రంగాలలో తమతు జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కోవడానికి స్త్రీలు సంసిద్ధులు కావాలి. ముందుకు రావాలి. ఈ అసమ సమాజాన్ని నిర్మూలించి, సమసమాజానికి కొత్తబాటలు వేయాలి.

ప్రేమ ప్రతి హృదయానికి మలయ మారుతం ; ప్రతి హృదయానికి కాంతి పుంజం."

— ఇంగర్ సాల్

"వివాహం చాలా గొప్ప వ్యవస్థ ; మరీ ప్రత్యేకంగా పిల్లలకు"

— మార్క్ ట్వెయిను

"నిష్కళంక ప్రేమ అనంతం. దాన్ని మించింది మరొకటిలేదు. వృద్ధుల్లో కనపడినా హృదయాల్లో అది నిత్య నూతనం"

— బాల్‌జాక్

"ప్రేమలేని వివాహమున్నంత కాలమూ
వివాహంలేని ప్రేమ ఉంటుంది"

— ఫ్రెంక్లిస్ (1934)

వైవాహికజీవితం: సఖ్యత, సామరస్యం

— వల్లాది సుబ్బమ్మ

వివాహం సాంఘిక సహజీవన వ్యవస్థ. అందులో హెచ్చుతగ్గులు లేవు. విల్లూ బాణమూ ఎలాంటి పరస్పరాధేయాలో అలాంటిదే దాంపత్య జీవితం. అలాగే ఎవరిని ఎవరు అధిగమించినా ప్రయోజనం శూన్యం. వ్యక్తిత్వాలను పెంచుకోగల ఇద్దరు ప్రేమతో సమష్టి జీవితం గడపాలంటే ముందుగా ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవాలి. ఆ పైన ఆలుమగలుగా అనురాగ బాటలు వేసుకొని ఆ బాటలలో పయనించిన నాడే చక్కని సంసారాన్ని చేరుకోగలరు. "వివాహం అనేది దంపతుల జీవితసమరంలో చివరి అంశం కాదు. జీవన యాత్రికు నాంది ఈ పెళ్ళితోనే ప్రారంభమవుతుంది." కనుక ఈ అలల తాకిడిని తట్టుకోగల విజ్ఞానం, ధైర్యస్థయిర్యాలు ప్రతి వ్యక్తికి చాలా అవసరం.

కష్టసుఖాల కలయికే వివాహ జీవితం. కష్టాలకు అదిరి, సమస్యలకు బెదిరితే వ్యక్తి పిరికివాడవుతాడు. బంధాలలోనే బాధలూ, సౌఖ్యాలూ వుంటాయి. అయితే ఆ భవబంధాన్ని తనకు బానిసగా చేసుకొనే నేర్పు ఓర్పు విజ్ఞులకు వుంటుంది. అజ్ఞానికి అవి నరకతుల్యమయి అతన్ని బంధిస్తాయి. కనుక వైవాహిక జీవితాన్ని ఆనందమయం చేసుకోగల సమర్థత వధూవరులదేనని విశ్వసించాలి.

పెళ్ళి కాగానే తమ సంసారం స్వర్గతుల్య మవుతుందనుకోవడం భ్రమ. దానికై సర్వశక్తులూ వినియోగించి పాటుపడాలి. త్యాగాలు చెయ్యాలి. ఒండొరులు వారి వారి మనస్తత్వాల నర్థంచేసుకోవాలి. సహనం, సామరస్యం,

ఓర్పు, నేర్పు వారిలో చోటుచేసుకోవాలి. ముందుగా తమ తమ పరిస్థితుల నర్థం చేసుకోవాలి. అలాంటి విషయజ్ఞానంకల విజ్ఞత ఇద్దరిలో కలగాలంటే ప్రపంచ జ్ఞానాన్వేషణ జరగాలి.

వివాహం జరిగేవరకూ జరిగినదంతా, ఊహించినదంతా ఒక కల. ఆ కలలో వారి జీవితం అంతా సుఖమయమే కాని ఇప్పుడు ఆ కల కరిగిపోయి కొన్ని బాధ్యతలు ఏర్పడతాయి. ఇంతవరకూ వారు నడిపించబడతారు. ఇప్పుడు ఎవరినీ ఎవరూ నడిపించేది లేదు. ఇద్దరూ నడవగలగాలి. అంటే కొంత సదవగాహన కావాలి. అది అలవరచుకున్నప్పుడు వారి హృదయాలు విడిపోవు. పగిలిన హృదయాలు అతకవు, అతుకులులేని జీవితాలకు అంశా అమృతమయమే. అందినదాన్నే అందంగా మార్చుకొని ఆనందించగల శక్తి ముందుగా దంపతులలో రావాలి. లేకపోతే జీవితంలో ప్రగతి వుండదు. అంతా శూన్యమవుతుంది.

జీవిత భాగస్వాములైన ఒండొరులయెడ కొన్ని నైతిక బాధ్యతలు వుంటాయి. స్నేహరూపంలో నిర్వర్తించాల్సిన జీవితలక్ష్యాలు కూడా లేక పోలేదు. మంచివారు, చెడ్డవారు అనే రెండు రకాల వ్యక్తులు వుంటారు సమాజంలో. స్వతహాగా మంచితనం అందరిలో వుంటుంది. భాగస్వామిలోని మంచిని పోత్సహిస్తే అది ప్రస్ఫుటిస్తుంది. అందుకు ఓర్పు, నేర్పు, స్వార్థత్యాగమూ కావాలి. ఒకరు మనసారా రెండోవారి బాగుకోరితే వారూ వీరి శ్రేయస్సు కోరతారు. అలాంటి ఇచ్చి పుచ్చుకోగల సౌశీల్యం భార్యా భర్తల ఇద్దరిలోనూ వుండాలి. ప్రియులయెడ దూషణరహిత సంభాషణ చాలా ఉత్తమం; అవసరం కూడాను. అలాంటి నాగరికుణ్ణిచూచి అనాగరికుడు సిగ్గుపడతాడు కాని తానెన్నటికీ గర్వపడడు. తన ప్రియుని మేలుకోరిచెప్పే నిజం అప్రియమైనా చెప్పే విధం ప్రియంగావుండాలి. ఒండొరులు ప్రేమించుకోవడం, ప్రేమలో వుండటం ఒకటికాదు. ప్రేమలో వుండటమనేది ఒకస్థితి. ప్రేమించడమనేది ఒక క్రియ. అదే అసలైన ప్రేమ స్వరూపం. ఒండొరులపై సానుభూతి కేవలం మానసికమే కాకుండా నిత్యజీవితంలోకూడా రాణించాలి. ముఖ్యంగా ప్రేయసీ ప్రియులలో అంతరంగాలను అతికించగల అపూర్వకారణం అన్యోన్య ప్రేమకుంది.

అది నిజమైన అనురాగం గల దంపతులలో మాత్రమే గోచరిస్తుంది. జీవిత భాగస్వామిని తన్నుగా చూడగల ధీశక్తి వున్న సంసారంలో అన్యోన్యతా ఆప్యాయతలకు కొరవవుండదు. ఒకరు రెండో వారి చర్యను అర్థం చేసుకోటానికి ప్రయత్నించాలి. అలాంటి ప్రయత్నమే లేకపోతే జీవితమే వ్యర్థమవుతుంది.

మంచి స్నేహితులుగా భార్యాభర్తలు మనగలగడం జీవిత పరమావధి కావాలి. ఒక్కో సమయంలో స్నేహానికి త్యాగంకూడా గీటురాయి కావచ్చు. అప్పుడు వారు రెండోవారికి త్యాగం చేస్తున్నట్లు భావించరు. నిజమైన స్నేహానికి బాహ్య ప్రకటన అవసరం. అది క్రియారూపంలో మిళితమై వుంటుంది. మిత్రుడు ఏడిపిస్తాడు, శత్రువు నవ్విస్తాడు అనేది ఒక లోకోక్తి. అందువల్లే ప్రియులకు చేదునిజాలు చెప్పక తప్పదు. ఇద్దరు విభిన్న వ్యక్తులమధ్య సంబంధం వారి వ్యక్తిత్వాలను కలిపివేయలేదు. వారివారి ప్రత్యేకతను పెంచుతుంది. అలాంటి స్నేహసంపదను భార్యాభర్తలలో చూచి ప్రజలు గర్వించాలి.

తొలిచూపులోనే ప్రేమపుడుతుంది అని అంటారు కాని అది ప్రేమకాదు, ఆకర్షణ. అది నిత్యం జరిగే సంఘటనే. తొలిచూపులోనే ప్రేమ పుట్టదు. తాత్కాలిక ఆకర్షణ ప్రేమక్రిందికి రాదు. మోహానికి ప్రేమకూ తేడావుంది. ఒక వ్యక్తియొక్క నడకను చూచి, సంభాషణను విని, హాస్యధోరణిని తిలకించి, శారీరక సౌందర్యాన్ని గమనించి మరోవ్యక్తి ఆకర్షణకు లోను కావచ్చు. అది అంతా ప్రేమ అని భావిస్తే జీవితంలో ఎదురుదెబ్బ తినవచ్చు.

ఇద్దరు వ్యక్తులను సన్నిహితం చేసేది ప్రేమ. పరస్పర గౌరవం, అభిమానం, సహనం, సర్దుకుపోవడం, ఒకరి కొరకొకరు త్యాగం చేయ్యడం, ఒకరి సంతృప్తికొరకొకరు ప్రయత్నించడం ప్రేమ లక్షణాలు. అది స్త్రీ పురుషుల సన్నిహితత్వాన్ని కోరుతుంది. అది సహజం. ఒకరికి మరొకరు చేరువయ్యాక సెక్సు వారి సంబంధాలలో ప్రవేశిస్తుంది. దాంతో ప్రేమ ఫలిస్తుంది. పుష్పిస్తుంది. సంతృప్తినిస్తుంది.

ప్రేమంటే అవతలి వ్యక్తిని సొంతం చేసుకోవటం కాదు. అవతలి వ్యక్తిలోని మానవతను గ్రహించడమే ప్రేమ లక్షణం. మృదుభాషణాన్ని, నడతను, చిరునవ్వునూ, చూపులను ప్రేమించేది నిజమైన ప్రేమకాదు. పరిస్థితులలో మార్పువస్తే మారేది ప్రేమకాదు. కొన్ని లక్షణాలుపోతే పోయేది ప్రేమ కాదు. అది కాలంతోపాటు మారదు. చిరకాలం వుంటుంది. తుఫానులను తట్టుకుంటుంది. దానికి చలనం లేదు, ప్రేమ వున్నచోట విశ్వాసంకూడా వుంటుంది. ప్రేమ మోహం కంటే ఉన్నతమైనది; శృంగారం కంటే విలువైనది ప్రేమ. దాగికి హద్దులు, అవధులు లేవు. శృంగారాన్ని కొలవడానికి సాధనాలుండవచ్చు. కాని ఇది ప్రేమ అని నిర్వచించటానికి ఏ కొలమానమూ లేదు. ప్రేమ అంటే సంతోషంతో జీవించడం, భాగస్వామ్యం గలిగివుండడం. ప్రతి వైవాహిక నౌకకు అది ధ్రువ నక్షత్రం లాంటిది.

జీవిత భాగస్వామి అభ్యున్నతినికోరే సహృదయమే దాంపత్య జీవితానికి గీటురాయి. ఒకరి పొరపాట్లను ఒతరు సహనంతో సానుభూతితో చూడాలి కాని తొందరపాటువల్ల వరిస్థితులు విషమించవచ్చు. మానవజీవితం అలల లాంటిది. ధైర్యంగా స్థిరచిత్తంతో, ధృఢసంకల్పంతో అధిగమిస్తే ఆనందదాయకం అవుతుంది. ఆటుపోట్లకు అదిరిపడితే అవి మనలను తుడిచి పెడతాయి. సంసార నౌకకు ఇద్దరూ చుక్కాని కావాలి కాని, భర్త మాత్రమే కారాదు. అనురాగ సమ్మిశ్రితమైన సాహచర్యం ఒక కళ. అది పరస్పరానుభూతులతో పరిమళించు జీవన గమనం. దంపతుల సంబంధ మన్నది ఆలుమగలలోని మానవత్వాన్ని పరిపుష్టం చేస్తుంది. సంకల్ప వికల్ప సమన్వయ సాధనకు ప్రేమా, పట్టుదల, అభిమానం అవసరమవుతాయి. దానికి త్యాగం చాలా అవసరం. అలా అర్థంచేసుకున్న జీవితాలు ఆనందమయ తరంగాలవుతాయి.

ఒకరి గుణాలు మరొకరికి తెలియాలి. ఒకరి జీవితలక్ష్యం, ఆదర్శం ఏమిటో రెండోవారికి తెలియాలి. ఆ లక్ష్యం ఇద్దరికీ ఆసక్తిదాయకమై వుండాలి. ఇద్దరిమధ్య పరస్పర అభిమానం, గౌరవం ఏర్పడాలి. పరస్పర సమ్మతితో ఇద్దరి అభ్యుదయం కోసం కాపురం చేయటానికి ఇష్టపడితేనే అది

వివాహంగా పరిణమిస్తుంది. ప్రతివ్యక్తికీ ఒక ఆలోచనాసరళి, ఒక జీవిత తత్వం వుంటాయి. తమకు అలాంటి భావాలున్నాయని వారి, తెలియక పోవచ్చు. కాని పూసలపేరులోని దారంలాగా ఏదోఒక జీవిత తత్వం వుంటుంది. ఒక్కొక్కప్పుడు దృక్పథాలు వేరుగా వుండవచ్చు. అలా వున్నప్పటికి ఒకరు మరొకరిని గౌరవించుకుంటూ కాపురం చెయ్యాలి. జీవితం సుఖంగా నడవటానికి సహనం, సర్దుకుపోవటం మూల సూత్రాలు. అయితే వాటిని పాటించేది స్త్రీ మాత్రమే కాదు. ఏ ఇద్దరి లక్ష్యాలు, ఆదర్శాలు ఒకే మూసనుండి దిగిరావు. అయితే ద్వేషంతో, ఈర్ష్యా అసూయలతో కలిసివుండేకంటే విడిపోవడమే మేలు. పూర్తిగా విరుద్ధ తత్వాలున్న దంపతులు ఎవరి మార్గంలో వారు పయనించడం శ్రేయస్కరం. సమాజంకోసం, పరువు ప్రతిష్టలకోసం చేసే కాపురంలో అద్వితీయానందం లేకపోగా అది నరకతుల్యంగా వుంటుంది. జీవిత లక్ష్యం, జీవనరీతి, ఆదర్శం వీటిని పరిగణలోకి తీసుకోవాలి. బాహ్య సౌందర్యంకంటే మానసిక సౌందర్యం మిన్నగా భావించాలి. నిత్య జీవితంలో హృదయ సౌందర్యాన్ని నిలుపుకోటానికి ఒండొరులు ప్రయత్నం చెయ్యాలి. దానికి సాధన, శ్రమకి శిక్షణ అవసరం. అదొక కళ. ఆ కళనాస్వాదించగల కళాతపస్వులు కావాలి నూతన దంపతులు.

స్త్రీ పురుష వాంఛ వారి వ్యక్తిత్వాలకు సంబంధించినది. ఇతరులతో అనుభవాలద్వారా వారు దానిని వమ్ము చేసుకోవడానికి ఇష్టపడరు. అవతలి మనిషి తనకు అవశ్యం కావాల్సిన మనిషి. మరోమనిషి ఆ స్థానాన్ని ఆక్రమించరాదు. అందువల్ల పరస్పర విశ్వాసం అవసరం. లైంగిక సంబంధంలో ఆనందం పొందాలంటే ప్రేమలో కాని, కోరిక సందర్భంగా కాని రెండో మనిషి ఇష్టాయిష్టాలను పరిగణిస్తేనే అది సాధ్యమవుతుంది. ఒకరిని మరొకరు వాడుకోరాదు. ఒకరి వ్యక్తిత్వాన్ని రెండోవారి వ్యక్తిత్వంలో కలిపి వేయకుండా ఎవరి వ్యక్తిత్వాన్ని వారు పెంచుకుంటూ నూతన దాంపత్య జీవిత సౌధానికి పునాదులు వేసుకోవాలి.

ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక పురుషుడికి ఒకేస్త్రీ అన్న భావం కలిగిన నాడే దాంపత్య జీవితం పరిపూర్ణమై ఫలిస్తుంది. అది విడదీయలేని ప్రేమ, మానసిక సంస్కారమున్న వారికే చెల్లుతుంది. చిత్తశుద్ధి, పరిపక్వదశ,

స్వచ్ఛమైనప్రేమ లేని వారికి యావజ్జీవం ఒకే భార్య ఒకే భర్త అనేది బంధమేకాక బానిసత్వమవుతుంది; అంతేకాదు ఆ దాంపత్యాన్ని వ్యభిచార మని నిర్వచించినా తప్పులేదు. రోజూ తిట్టుకుంటూ, కొట్టుకుంటూ, మరణాన్ని కోరుకుంటూ రాత్రివేళకు రాజీపడే దంపతులు మనకు ఆదర్శం కాదు. ఈ ప్రపంచంలోని అనంత సౌందర్యాన్ని, విశాల పరిధిగల ఆకాశమంత ప్రేమను, సాటిలేని సద్గుణాలను తన భాగస్వామిలో చూడగల్గిన దంపతులే మనకావర్శం. అలా మనసారా ప్రేమించుకున్న వారి హృదయాలలో వేరొకరికి స్థానం వుండదు. ప్రేమ, స్పందన, సౌందర్యాలతో పరిపూర్ణత్వంచెంది రససిద్ధినిపొందే అనురాగ దాంపత్య జీవితమే వివాహానికి లక్ష్యం.

పరస్పరప్రేమ, తపన, ఆకర్షణలేని శూన్య జీవితానికి బలవంతంగా తమ శరీరాలప్పజెప్పడం కంటే ధైర్యంగా విడిపోగల స్థిరచిత్తం ఆధునిక వివాహవ్యవస్థలో వుంటుంది. అందుకే ఆ వివాహాలు కావాలని పోరాటం సాగుతుంది. ఎక్కడ పరస్పర ప్రేమ, గౌరవం వుంటాయో ఎక్కడ పరిపూర్ణ స్వేచ్ఛాసమానత్వాలు వుంటాయో అక్కడ ఆనందానుభూతులు వెల్లివిరుస్తాయి. కనుక ఆ స్థితి వివాహంలోనికి వచ్చిన నాడే దాంపత్య జీవితం సార్థకమవుతుంది; ఆ జీవితాలకు లక్ష్యసిద్ధి కలుగుతుంది.

ఈనాటి వివాహాలు రెండు రకాలుగా ఉన్నాయి — పెద్దలు ఏర్పాటు చేసిన పెండ్లిండ్లు, వధూవరులు ప్రేమించుకొని నిర్ణయించుకున్నవి. మొదటి దానిలో కలిసిఉందామనే సంకల్పం ముందు, తదుపరి తద్వారా ప్రేమాభిమానాలు; రెండవదానిలో ముందు ప్రేమ, తరువాత కలిసి కాపురం చేద్దామనే సంకల్పం. ఏదైనా, కలిసి కాపురం చేయటం రెండింటిలోనూ ఉంటుంది. దాంపత్య జీవితం సుసంపన్నం కావాలంటే ఏ యే అంశాలు తోడ్పడతాయో పైన చర్చించటం జరిగింది. ప్రేమ నశించిన వైవాహిక జీవితం ఎంత నిస్సారమో, కేవలం ప్రేమ భావన మాత్రంఉండి తదితర అవసర గుణాల సతీపతులలో లోపిస్తే ఆ కాపురం దుఃఖభాజనమవుతుంది. కలుక సమతుల్య భావనతో ఈ దశలోకి యువతీ యువకులు అడుగిడడం అవశ్య కర్తవ్యం. అలా జరగని నాడు వారు అనవసరంగా ప్రమాదాలను కొని తెచ్చుకున్న వారవుతారు. సఖ్యత, సామరస్యం వెల్లివిరిసే దాంపత్య జీవితం సుఖప్రదం అవుతుcదనడంలో అతిశయోక్తిలేదు.

కులాంతర, మతాంతర వివాహాలు అవసరమా?

— శ్రీ రాజ్యం సిన్హా

ఎన్నో రంగాలలో అభివృద్ధిచెంది' ఆధునిక యుగంగా పరిగణింప బడుతున్న యీ రోజుల్లో, ఒక కులంవారు మరోకులంలోని వారిని, అలాగే ఒక మతానికి చెందిన వారు, ఇంకొక మతానికి చెందినవారిని వివాహం చేసుకోవడాన్ని ఎంతవరకు సమాజం హర్షిస్తోంది? వరకట్నంలాంటి దురాచారాలకు గురి అయిన ఎన్నో విషాదగాథలవలె యిలాంటి వివాహాల విషయమై మనం వినకపోవచ్చును. కాని అక్కడడక్కడ 'కులాంతర వివాహం' చేసుకున్న వారిని యింట్లోని బంధువులు, సమాజంలో పెద్దలుగా పరిగణింప బడే కొందరు వ్యక్తులు కూడా సరిగా ఆదరించక పోవడం జరుగుతుంది.

ఇందుకు కారణం యీనాటి సాంఘిక పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు అని చెప్పవచ్చును. కరుడుగట్టిన అనేక సాంప్రదాయాలు సామాజిక అన్యాయాలకు దారితీస్తున్నాయి. ఒకవైపు రాళ్ళు, రప్పలకు పూజలు చేస్తుంటారు. కాని తమతోటి మానవులను కొందరను ముట్టుకుంటేనే మైల పడతాం అనే తత్వంతో జీవితం గడిపేవారిని ఏమని పిలవాలి? పైగా 'అస్పృశ్యులు' అనే మాటలు ప్రభుత్వము హరిజనులు లేక నమోదైన కులాలు అంటూ ప్రత్యేక సౌకర్యాలు ఇస్తున్నాం ఆని చెపుతున్నారు.

ఒక ప్రక్క శాస్త్రీయ విజ్ఞానాన్ని గురించి, అభివృద్ధి గురించి మాట్లాడుతున్న సంఘంలో, కుల, మతభేదాలు, ముఖ్యంగా 'అస్పృశ్యులు' అనే మాటలు మనం ఎంత అనాగరిక సమాజంలో నివసిస్తున్నామో తెలియచేస్తాయి.

కులవ్యవస్థ సమూలంగా పోవాలి. కులం పేరుతో మనిషిని వెనుకకు తోసే పరిస్థితులు మారాలి. కేవలం ఆర్థిక సంబంధాలుకూడా పోవాలి. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో నిజమైన అభివృద్ధి

జరిగితేనే వ్యక్తికి స్వేచ్ఛగా ఆలోచించగలిగిన చైతన్యం వస్తుంది. ఆ చైతన్యం వున్నరోజున కులం, మతభేదాలు పాటించని విశాలదృక్పథం వస్తుంది. వర్ణాంతర, మతాంతర వివాహాలు సులభంగా, హెచ్చుగా జరుగుతాయి.

ప్రస్తుత సమాజ పరిస్థితులలో అసలు స్త్రీలే సమాన వ్యక్తులుగా చూడబడడం లేదు. ఇంకా ఆమె భర్త యిష్టాయిష్టాలకు నడుచుకునే ఆస్తిగానే పరిగణింపబడుతుంది. ఈ పరిస్థితి పోవాలంటే స్త్రీల హోదా పెరగాలి. హోదా అంటే ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్ర్యం చాలా వరకు అవసరం అని చెప్పక తప్పదు. ఆర్థిక స్వాతంత్ర్యంవున్నా, అవసరం వచ్చినప్పుడు పురుషుణ్ణి ధిక్కరించి స్వతంత్రంగా, నిర్భయంగా, నిశ్చింతగా, జీవించడం మనదేశంలో స్త్రీ జాతికి సాధ్యమవుతుందా? అని మనం కొంత సూక్ష్మదృష్టితో పరిశీలించినప్పుడు, సాంఘిక పరిస్థితులుకూడా స్త్రీలకు వ్యతిరేకంగావున్నాయి అని కనిపిస్తుంది.

ఇందుకు కారణాలు ఏమిటి? స్త్రీల పరిస్థితులకు, కులాంతర, మతాంతర వివాహాలకు సంబంధం వుందా ? ఇలాంటి వివాహాలు జరగాలంటే, స్త్రీల దుస్థితికి మూలకారణాలు గ్రహించి దానిని కూకటివ్రేళ్లతో సహా నిర్మూలించాలి.

మానవ విలువలలో, పరివర్తనలో మార్పు రావడానికి ఇలాంటి వివాహాలు దోహదం చేస్తాయి. అభ్యుదయంవైపు ఒక అడుగు ముందుకు వేస్తున్నాం అని రుజువు చేయడానికి యిలాంటి వివాహాలను ప్రోత్సహించడంకూడా చాలా అవసరం.

సామాజిక చైతన్యం పెరుగుతూంటే శాస్త్రీయ దృక్పథంకూడా వికసిస్తుంది. ఇలాంటి చైతన్యం కొరకు పోరాడటం అభ్యుదయం కోసం పోరాడుతున్నాం అని మాట్లాడే వాళ్ళందరూ దీక్షతో సాగించాల్సిన కృషి.

అసలు వివాహం అంటే ఏమిటి ? భార్యకు, భర్తకువుండే సంబంధం ఎలాంటిది ? జీవితాంతం కలిసివుంటూ సుఖదుఃఖాలను పంచుకుంటూ ఒక కుటుంబాన్ని ఏర్పరచుకోవడం. ఈ కుటుంబం అంటే కేవలం పిల్లలను

కనడం, పెంచడం మాత్రమే కాదు. మానసిక సుఖాన్ని, ఆనందాన్ని కలుగచేసే యిద్దరు వ్యక్తుల సహజీవనం. ఈ యిద్దరూ జీవితాంతం కలిసి వుండాలంటే కొన్ని సమాన అభిరుచులు, స్వభావంతో పాటు సామరస్యం, సహనంకూడా కావాలి. పరస్పర గౌరవం వుండాలి. ఈ గౌరవం, హోదా, అంతస్థు, ఆర్థిక సమానతలకు అతీతంగా వుండాలి.

ప్రస్తుతం మన సమాజంలో అలాంటి అవకాశాలు వున్నాయా ? ఇద్దరు వివాహం చేసుకునే ముందు, ఒకరిని గురించి మరొకరు అవగాహన చేసుకునే అవకాశం కావాలి. ఒకరిని గురించి ఒకరు అర్థం చేసుకోవడానికి కొంత సమయం కావాలి. వివాహానికి ముందు స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితులు వుండాలి. లేకపోతే తాత్కాలిక వ్యామోహాలకులోనై, ప్రేమ నిజంగానే వుందనుకుని భ్రమపడి వివాహాలు చేసుకుంటే, అలాంటి వివాహాలు విఫలం కావచ్చు. విచ్ఛిత్తికి దారితీయవచ్చు. కాని ఇలాంటి భయాలతో అసలు అవకాశాలు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసం ?, సాధ్యం ? ఇలాంటి విషయాలు మన సమాజంలో యింకా చర్చనీయాంశాలుగానే వున్నాయి. పరిపక్వ దశకు రాలేదు.

కాని, ఏ సమస్య అయినా ఒకటి ముందుకు వచ్చినప్పుడు పట్టుదలతో పోరాటాలకు దిగాలి. కార్యక్రమాలు చేపట్టాలి. సమయం ఎప్పుడో వస్తుంది అని చూస్తూకూచుంటే, ఆదర్శాలు మాటలలోనే వుంటాయి. కేవలం కులం కారణంగానో, వేరువేరు మతాలు కారణంగానో ఇద్దరు వ్యక్తులు, మేము కలిసి జీవితాంతం సుఖంగా కాలక్షేపం చేయగలం, అనుకుని ముందుకువచ్చినా సాంప్రదాయాల కారణంగా తల్లిదండ్రులు ఒప్పుకోవడంలేదు. కారణం సామాజికంగా తమ అంతస్థుకు దెబ్బతగులుతుందని భయం. ఒకేరకమైన అభిరుచులు, స్వభావాలు, ఆదర్శాలుగల ఇద్దరు వ్యక్తుల సుఖమయ జీవితాలు కొన్ని యీ పరిస్థితుల ప్రాబల్యంలో నలిగి పోతున్నాయి.

ఇప్పటికీ సహజంగా సనాతన కుటుంబాలలో వివాహాలు నిశ్చయించేది తండ్రే. వివాహాలు స్వర్గంలో జరుగుతాయి, మనచేతిలో ఏముంది ? అనే వేదాంతంతో సాంప్రదాయపు ముసుగుతుంచి బయటపడలేక అలా మాట్లాడు

తుంటారు. మన భారతదేశంలో వివాహాలు — స్వర్గంలో కాదు గదా — భూమి మీదనే, పైగా చాలా ఆడంబరాలతో, ఖర్చు తో కూడిన వ్యవహారంగా తయారయ్యాయి.

ఒకవైపున సమాజంలో స్త్రీలకు అన్యాయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు భారతదేశ స్త్రీ అంటే నిజమైన సంస్కృతికి ప్రతిరూపం అనిపేరు. స్త్రీ అంతఃసౌందర్యాన్ని భర్తకు మాత్రమే అంకితం అనేది మంచి సాంప్రదాయం అని గర్వించాము. ఇప్పుడు కాబరే డాన్సుల పేరుతో పెద్ద పెద్ద హోటళ్లలో జరుగుతున్న నాట్యాలు స్త్రీలను ఎంత అధోగతికి తీసుకు పెడుతున్నాయో చూస్తున్నాం. మంచి సాంప్రదాయాలను మంటగలిపి కేవలం డబ్బుకోసం ఎంత నీచానికైనా స్త్రీలను పతనం చేస్తోంది ఒకవైపు యిదే సమాజం.

మరొకవైపు, ఆడంబరంతో జీవితాలు గడపాలనే కోర్కెలు, అంతస్థులను పెంచుకోవాలనే కాంక్షలతో ముక్కుపచ్చలారని స్త్రీలు హత్యలు, ఆత్మహత్యలకు దిగేటట్లు చేసింది సమాజం. కట్నంపై ఆధారపడే వివాహాలు, ముఖ్యంగా ఆర్థిక కారణాలుగా, భర్తపై ఆధారపడడం సహజం. స్త్రీని బజారువస్తువుగా నీచంగా చిత్రించడంలో అశ్లీల సాహిత్యం, కొన్ని సినిమాలకుకూడా బాధ్యతవుంది. కేవలం దరిద్రం కారణంగానే పొట్టకూటి కోసం వ్యభిచారం నిస్సహాయ స్థితిలో చేస్తున్నారనేది అనేక పరిశీలనలలో రుజువయింది.

వేలాది సంవత్సరాలుగా వస్తున్న సాంప్రదాయాలు, సిద్ధాంతాలు, స్త్రీలను దాస్యంలో వుంచడానికే ఉపయోగంగా వున్న వాటిని సంఘ సంస్కర్తలు తమ కృషి ఫలితంగా నిర్మూలించినట్లు చరిత్ర రుజువుచేసింది. అలాగే యీ రోజున స్త్రీలు చైతన్య వంతులవుతున్నారు. వారిని అడ్డుకునే పరిస్థితులకూ వారికీ పోరాటాలు జరుగుతాయి. స్వతంత్రంగా, వివాహాలు, ఏ కులానికి చెందినా, ఏ మతానికిచెందినా తన జీవితం సుఖమయం కాగల దనుకుంటే చేసుకోవడానికి ఆసక్తిని చూపించే స్త్రీలు, పురుషులు లేకపోలేదు. ఇలాంటి వివాహాలు కేవలం కులం, మతమేకాదు, భాష జాతి వేరైనా సరే,

ప్రపంచంలో, అనేక దేశాలలో జరుగుతున్నాయి. సుఖప్రదమైన కుటుంబ జీవితానికి ఆటంకాలు లేనందువల్లనే, అలా వివాహాలు చేసుకునే వారిసంఖ్య ప్రపంచంలో హెచ్చుతుంది.

మన దేశంలో కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అభివృద్ధి చెందుతూ ముందుకు సాగిపోతుంటే, ఇలాంట వివాహాలు — కులం, మతం, భాష, దేశం — లాంటి అంశాలకు అతీతంగా జరగడం అవసరం. అలా జరగడం అభ్యుదయానికి ఒక మెట్టు ముందుకు వేసినట్లుగా ఆశించడం సహజం.

"ప్రేమ అనేది ఇతరులను గురించి ఆలోచించేది. ఇతరుల శ్రేయస్సుకు ప్రేరణ కలిగించేది. ఒక లక్ష్యంతో తనకు భిన్నమైన, ప్రత్యేకమైన, విలక్షణమైన వ్యక్తియొక్క జీవితానికి సంబంధించినది"

— సైమన్ డి బోవార్

వివాహం ప్రసాదించే వరాలను గురించి, పెండ్లి ప్రమాణాల స్థిరత్వాన్ని గురించి ప్రసంగించేవారే, వివాహబంధంలోని వారి సంకెళ్ళను విడదీస్తే, వారికి స్వేచ్ఛనిస్తే సామాజిక వ్యవస్థ మొత్తం బదాబదలవు తుందని చెప్తారు. ఇలా విభిన్న వాదాలు చేయటం కుదరదు. బంధితుడు ఆనందాన్ని అనుభవిస్తుంటే అతనిని కటకటాలలో బంధించడం ఎందుకు? అతడు ఆనందానికి దూరమైతే అతడు సంతోషంగా ఉన్నాడనే నటన ఎందుకు?"

— బెర్నార్డ్‌షా

"మన చర్యల పరమోద్దేశ్యాన్ని గురించిన జ్ఞానమూ, తద్భిన్నంగా సంచరించదలచే వారియెడల సహనభావమూ, ఈ రెండూ వ్యక్తిగత ఆనందానికి సామాజిక సాపురస్యానికి కీలక మార్గాలు"

('పెండ్లిలో అలలు' అనే గ్రంథంలో)

— బ్లాక్‌హామ్

కుల భేదాల తొలగింపుకు కులాంతర వివాహాలు

వి. గంగాధరరావు

కులం అనేది భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న విలక్షణ సాంఘిక జాడ్యం. కులం ఎలా పుట్టింది, ఎవరు దీనికి కారకులు, కాలక్రమేణా కులం చిలవలు పలవలుగా ఎలా పరిణమించిందీ వివరించడం ప్రస్తుతం అనవసరం. కులం అనే భావన ఒక వాస్తవికంగా మారిందని గ్రహిస్తే చాలు లోగడ దీనిపై చాలా చర్చ జరిగింది. స్థూలంగాచూస్తే ఎవరి కులాన్ని వారు సమర్థించడం కనిపిస్తుంది. పైకిమాత్రం కులం పోవాలని అందరూ అంటూ వుంటారు. ఆచరణలో మాత్రం కులం ఒక రుగ్మతగా మారి, అన్ని రంగాలకు విస్తరించింది. కుల సంఘాలు వెలిశాయి. కుల మహాసభలు జరుగుతున్నవి. కులం పోవాలంటేనే, ఎవరి కులాన్ని వారు ఉద్ధరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిభకు ప్రాముఖ్యత ఇవ్వటంలేదు. అది చాలా శోచనీయం. ఇలాంటి వైరుధ్యంలో బ్రతుకుతున్నాం.

వైజ్ఞానికంగా విడమరచి పరిశీలిస్తే కులం నిలబడదు. అయినా సైన్సు చదువుకున్న వాళ్ళుసైతం కుల పరిధినుండి ఒక పట్టాన బయట పడలేక పోతున్నారు. రానురాను వైజ్ఞానిక, సాంకేతిక అభివృద్ధి విపరీతంగా జరుగుతుండగా కులం హరించక తప్పదు. ఎటువచ్చి ఎంతకాలం అనేది ప్రశ్న. 'కులం' అనేది అశాస్త్రీయం, అజ్ఞానం నుండి పుట్టిన ఒక దోషగుణం అని గ్రహిస్తే, తొలగించడానికి మనం ఏమి చేయగలం అనేది చూచుకోవాలి.

జీవితంలో భిన్న దశల్లో అనేక రంగాలలో, కులాన్ని పాటించకుండా ఉండగలుగుతున్న వారు సైతం వివాహ విషయం వచ్చేసరికి కులాన్ని పట్టించుకుంటున్నారు. కనుక వ్యక్తి జీవితంలో కులం అనేది పెళ్ళి సమయంలో కీలక పాత్ర నిర్వహిస్తున్నదనవచ్చు. సాధారణంగా పెళ్ళి

దగ్గరకు వచ్చేసరికి అమ్మమ్మ బాధపడుతుందనో, నాన్న పట్టుబట్టాడనో, అమ్మ మాట ఇచ్చిందనో, ఇలాంటి వంకలు, కుంటి సాకులు పెట్టడం పరిపాటి. వీటన్నింటినీ అధిగమించి కులాంతర వివాహాలు చేసుకుంటున్న వారు కొద్ది మంది లేకపోలేదు. అయితే అందులోనూ కొందరు "ఏ కులం అయినా ఫరవాలేదు గానీ, ఫలానా కులం మాత్రం కాగూడదు" అంటుంటారు. అంటే అంటరాని తనాన్ని మానసికంగా తొలగించుకోలేక పోతున్నారని అర్థం. కులం పోగొట్టడానికి కులాంతర వివాహాలు ఉత్తమ మార్గం అని నా నమ్మకం. ఇప్పుడు కొందరు కులాంతర వివాహాలు చేసుకున్నారు. అయినా కులం పోవడానికి అది నాంది కావడంలేదు. ఎందుకని? ఇందులో ఒక ప్రధాన దోషంవుంది. అది బహుశః చట్టపరంగా సవరించవచ్చు. రెండు కులాలవారు పెళ్ళి చేసుకున్న తరువాత వారికి, వారి పిల్లలకు కులం అనే గుర్తింపు ఉండరాదు. కాని ఉంటున్నది. మన సమాజంలో చట్టాలు పురుషుల ఆధిపత్యతో ఏర్పరచారనడానికి యిదొక నిదర్శనం. పెళ్ళి అయిన తరువాత భార్య కులంపోయి, భర్తకులం వస్తుంది. వారి పిల్లలుకూడా తండ్రి కులం అవలంబిస్తారు. రిజర్వేషన్ల అవకాశాల కోసం యిలాంటివి దుర్వినియోగం చేసేవారి విషయం అలా వుంచుదాం.

మన చట్టంలో రావలసిన మార్పు ఏమంటే, కులాంతర వివాహం జరగగానే భార్యకు భర్తకు కులం ఎక్కడా ఉండరాదు. కులం పేరిట లోగడ ప్రభుత్వం యిస్తున్న అవకాశాల్ని కూడా వీరు వినియోగించరాదు. ఇక వారి పిల్లలకు కులం అనేది చట్టరీత్యా ఉండకూడదు. అప్పుడు గానీ కులాంతర వివాహాలకు అర్థం, సార్థకం వుండదు. అలాంటివారు మానవ కులం అనే ఉన్నత స్థాయికి ఎదగాలి. అంతకు తక్కువ స్థాయికి దిగజారరాదు.

మార్గాంతరంగా ప్రభుత్వం కొన్ని విధానాలు అవలంబించాలి. కులాంతర వివాహాలు చేసుకున్న వారికీ, వారి పిల్లలుకూ ఉద్యోగాలల్లో, స్కూళ్ళలో ప్రత్యేక రిజర్వేషన్లు చూపాలి. ఇవి శాసన బద్ధంగా అమలు పరచాలి. ఇవిగాక, కుల ప్రసక్తి వచ్చే పేర్లను తొలగించడం, పాఠ్య గ్రంథాలలో కులాన్ని పోత్సహించే పాఠాలు, పద్యాలు లేకుండా చేయడం, రేడియో, టి.వి.లలో కూడా కుల ప్రసక్తి తొలగించడం ఎంతైనా అవసరం.

ఇంతవరకు మనం చర్చించిన విషయం ఏమంత కొత్తదికాదు. ఏదో ఒక సందర్భంలో పెద్దలు యిలాంటి సూచనలు చేసారు.

ఇతర రంగాలలో జరుగుతున్న వేగాన్ని మన సమాజం అందు కోవాలంటే కులజాడ్యాన్ని అంతవేగంగా తొలగించుకోవాలి. దీనికి ఒక పరిష్కారమార్గం కనిపిస్తున్నది. చిత్తశుద్ధితో కులం పోవాలనే వారంతా యీ విషయాన్ని దీక్షగా ఆలోచించాలి.

కులంలో పెళ్ళిళ్ళు నిషేధిస్తూ కులాంతర వివాహాలను బాగా పోత్సహించాలి. కులాన్నికూడా అంటరాని తనంతో సమానంగా చూడాలి. దీని వలన ఒక ప్రశ్న ఉద్భవిస్తుంది. పెళ్ళి అనేది వ్యక్తి స్వేచ్ఛగా నిర్ణయించుకోవలసిన విషయం గనుక, ఇలాంటి నిర్బంధాలు, నిషేధాలు మంచిది కాదనవచ్చు. అలాంటి స్వేచ్ఛాప్రియులకు సమాధానం సులభమే. ఇప్పుడుకూడా నూటికి తొంభై శాతం పెళ్ళిళ్ళు స్వేచ్ఛగా, ప్రేమించుకొని జరగడంలేదు. తల్లిదండ్రులు, సంరక్షకులు ఏర్పాటు చేస్తున్నవే యివన్నీ. నిజానికి కుల పరిధి దాటిపోయిన తరువాత, ఫలానా కులంలో, మతంలో, జాతిలో పెళ్ళిచేసుకోవాలనే నియమం లేదు. కనుక వ్యక్తి స్వేచ్ఛ విస్తరిస్తున్నది. ప్రపంచమంతటా ఎక్కడైనా పెళ్ళి చేసుకోవచ్చు. అందువలన స్వేచ్ఛా ప్రియులు కులంలో పెళ్ళిళ్ళు నిషేధాన్ని సమర్థించాలి. అంటే ఈ ప్రయత్నంవల్ల రెండు లక్ష్యాలు సాధించవచ్చు. అటు కులం రూపుమాసి పోతుంది. ఇటు స్వేచ్ఛ పెరుగుతుంది. అంతేకాదు. కులం పోవాలంటే ఆచరణకు దిగనివారి బండారం బయట పడుతుంది.

మనం లోగడ అనేక ఆచారాలను, దోషాలను నిషేధం ద్వారా బలవంతంగా పోగొట్టుకోవలసి వచ్చింది. సతీ సహగమనం, దేవతలకు నరబలులు లాంటివి మచ్చుతునకలు. అలాగే బాల్య వివాహాలు. వితంతు వివాహం అభ్యంతరంలేకుండా పోయింది.

అలాగే కులం అనేది మంచిదికాదు, పోగొట్టాలి అనుకున్న తరువాత, తీవ్రచర్య తీసుకోక తప్పదు. అనేక మార్గాలద్వారా దీనిని పోగొట్టే ప్రయత్నాలు విఫలమైనప్పుడు మార్గాంతరం నిషేధమే. ఏ పనిచేస్తున్నా

అవరోధాలు ఉంటాయి. అలాగే కులాన్ని పోగొట్టడానికి చేసే ప్రయత్నంలో కూడా లక్ష అడ్డంకులు రావచ్చు. ఆ అడ్డంకులను, అవరోధాలను అధిగమించి ప్రగతి సాధించాలి.

ఇప్పటికే కులజబ్బు ముదిరింది. దీనికి శస్త్ర చికిత్సచేసి తొలగించటం అవసరం. చూస్తూ ఊరుకుంటే కులజాడ్యం మనల్ని మింగేస్తుంది. పైగా వెర్రితలలువేసే ప్రమాదంకూడా కనిపిస్తుంది.

కులం చాలా శతాబ్దాలుగా వస్తున్నప్పటికి నేటి ఉద్రిక్తత ఎన్నడూ రాలేదు. దీనికి కారణం ఒక్కటే. అన్ని రంగాలలోనూ అదుపుచేయగల రాజకీయాధికారి పరిధిలోకి కులం ప్రవేశించింది. అందువలన పరిమాదం అంటున్నాం. ఇంకా ఇది నాగజెముడు వలె వ్యాపించకముందే, కులాన్ని తొలగించుకోవాలి. అందుకే కులంలో పెళ్ళిళ్ళు శిక్షార్హం చేయడం ఒక్కటే పరిష్కారమార్గంగా కనిపిస్తున్నదంటున్నాను. ఆలోచించండి.

ఆర్థికంగా సంపన్నులైతే కులం పోతుందనడానికి ఆధారాలు కనిపించడంలేదు. అలాగే చదువుకున్న వారిలో కులజాడ్యం తగ్గలేదు. ఇదొక ప్రత్యేకరుగ్మత. కనుక పరిత్యేక చికిత్స అవసరం. పక్షులకు, చీమలకు సైతం కులాల పేర్లు పెట్టిన సమాజం మనది! అందువలన దీనిని పూర్తిగా మట్టుపెడితే తప్ప, ఏ మాత్రం మిగిలినా మళ్ళీ తలెత్తుతుంది. కుల వివాహాలు నిషేధించడం, కులంలో పెళ్ళి అంటే శిక్ష అయితేనే ఇది పోతుంది.

"మగడు రక్షకుడు, ఆలి రక్షిత కానప్పుడే వారిద్దరిమధ్య నిజమైన భాగస్వామ్య జీవితం నెలకొంటుంది."

— ఎం. ఎన్. రాయ్

"పరస్పర సమ్మతి, ప్రేమ కాకపోతే మరేవి లైంగిక నీతికి ప్రాతిపదికలు?"

— ఎం. ఎన్ రాయ్

"స్త్రీ పురుషుల సాహచర్యం, పరస్పర అవగాహన ప్రేమగా వికసించిన దశలో వారిరువురి సంతోషప్రదమైన కలయికే వివాహం"

— కార్లిస్ లామంట్

కుల, మత, జాతి, భాష, రంగు, ప్రాంత పరిసక్తిలేని వివాహాలు

— ఎం. వి. రామమూర్తి

కులాన్ని, మతాన్ని వివాహసందర్భంగా పరిగణనలోకి తీసుకొనరాదని అభ్యుదయగాములు అందరూ అంగీకరిస్తున్నారు. కాగా వీటి ప్రాబల్యాన్ని తగ్గించడానికి, లేదా నిర్మూలించడానికి ఏమిచేయాలనే అంశంపై అభిప్రాయ భేదాలు పొడసూపుతున్నాయి. కులాంతర, మతాంతర వివాహాలు అవశ్యం అనుసరణీయమని కొందరు వాదిస్తుంటే కుల మత పరిసక్తిలేని వివాహాలు కావాలని మరికొందరు ప్రతిపాదిస్తున్నారు. వాదోపవాదాలు చెలరేగి తీవ్రమయి పరస్పర నిందలకుకూడా దారితీస్తున్నాయి. మొదటి రకం భావాన్ని ఆమోదించేవారు రెండవ వర్గాన్ని భీరువులని, సమస్యను ఎదుర్కొనకుండా దాటవేసే పలాయన వాదులని విమర్శిస్తున్నారు. రెండవ వర్గం వారు మొదటివారిని ఆవేశపరులని, కార్యాచరణ పేరుతో ఆలోచనను తోసిరాజనే వారని ప్రతి విమర్శ చేస్తున్నారు. ఈ వాదాలలోని వసను, ఔచిత్యాన్ని, బలాన్ని గమనించటం అవసరం.

ఒక పురుషుడు ఒక స్త్రీని గాఢంగా ప్రేమించి, అభిమానించి వివాహ మాడదలచుకున్నాడను కుందాము. అపుడు అతడు ఆమె కులాన్ని, మతాన్ని అడిగి తెలుసుకొని తన మతానికి లేక కులానికి ఆమె చెందియుంటే ఆమెను వివాహమాడే సంకల్పం విరమించాలన్నమాట. కులాంతర మతాంతర వివాహాలను మాత్రమే చేసుకోవాలని నియమం పెట్టినప్పుడు - ఈ సూత్రాన్ని ఇంకా పొడిగిస్తే ఆమెతో పరిచయమయి ఆమె తనకు తగిన సహచారి కాగలదనేభావం కలిగినపుడే ఆమె కులాన్ని, మతాన్ని తెలుసుకొని ఆమె విభిన్న కులానికి లేక మతానికి చెందినప్పుడే ఆమెపై అభిమానాన్ని పెంచుకోవలసి వస్తుంది. ఈ రెండు సందర్భాలలో పైన ఉదహరింప బడిన పరివర్తన విడ్డూరంగా ఉంటుంది. అంతేకాదు సందర్భరహితంగా ఉంటుంది. ఇక్కడ ప్రేమకు ఆధారపీఠం ఏమిటనే విషయం

చర్చనీయాంశం అవుతున్నది. భిన్నకులానికి లేక వేరొక మతానికి చెందియుండటం ముఖ్యాంశం అయితే, వివాహ ఎంపికలో భూమికలు వహించ పలసిన పరస్పర అవగాహన, సానుభూతి, అభిమానం, ఇద్దరికీ ఇష్టమైన కొన్ని అంశాలు లేక అభిరుచులు, ఆసక్తిదాయకాలు లాంటివి వెనుకకు నెట్టబడతాయి. వివాహం విషయంలో పూర్వం కులం, మతం ఆంక్షలను విధిస్తే ఇపుడు మరొక రీతిలో అడ్డువస్తున్నాయనేది సత్యం. అంతేకాదు ఆ స్త్రీ "నన్ను ప్రేమిస్తున్నావా? లేక నా విభిన్న కులాన్ని ప్రేమిస్తున్నావా?" అని నిగ్గదీసి అడిగితే అతడు ఏమని సమాధానం చెప్పగలడు? నిమ్న జాతి కులానికి చెందిన యువతిని వివాహ మాడానని ఒక పురుషుడు సగర్వంగా చెప్పుకుంటే, ఆమె "నన్ను పెండ్లి చేసుకున్నావా? లేక నా అంటరానితనాన్ని పెండ్లాడావా?" అని సూటిగా ప్రశ్నిస్తే, అతని పరిస్థితి ఏమవుతుంది? వ్యతిరేక పద్ధతిలో కులతత్వ విజృంభణకాక మరేమిటి ఇది? పూర్వం ఒకే కులంవారిని అభిమానిస్తే ఇపుడు విభిన్న కులం వారిని మాత్రమే అభిమానించడం జరుగుతున్నది. అంటే అన్నిటికీ గీటురాయి కులం తప్ప మరేమీ కాదనే కదా!

మరొక అంశాన్ని ప్రస్తావించవలసి ఉంటుంది. కులంలో, మతంలో విశ్వాసంలేని వ్యక్తి మరొకవ్యక్తిని "నీ కులం ఏమిటి? నీ మతం ఏమిటి" అని ఎలా ప్రశ్నిస్తాడు. తనకు కులం, మతం అక్కరలేదనే మనిషి మరొక మనిషి కులాన్ని, మతాన్ని గురించి వాకబు చేయపూనినాడంటే — వివాహ సందర్భంగా — వాటికి ప్రాధాన్యత ఇవ్వదలచినట్లే కదా! తనకు పనికిరాని విషయాలు ఇతరులకు ఎలా పరిగ్రహణాంశాలు అవుతాయి? ఎందుకు కావాలి?

కులం మతం, పెండ్లి సందర్భంగా పట్టింపుకు కారణభూతాలు కారాదనటం ఒక పద్ధతి. అంటే కుల మత ప్రసక్తి ఉండరాదన్నమాట. కుల మత ప్రసక్తిని వివాహ ఎంపిక విషయంగా తీసుకొనిరానని ఒక వ్యక్తి తీర్మానించుకోవడం ఒక ఎత్తు; కులాంతర వివాహాన్ని, మతాంతర వివాహాన్ని మాత్రమే చేసుకుంటానని నిశ్చయించుకోవడం మరొక ఎత్తు. ఈ రెండు మనస్తత్వాలమధ్య హస్తి మశకాంతర భేదమున్నది. ఒక ఉదాహరణలో ఈ విషయం స్పష్టమవుతున్నది. "నాకు కులం లేదు,

మతంలేదు" అని ప్రకటించేవారు ఉంటారు. అదిగాక కులాంతర వివాహాలు చేసుకున్నవారి సంతానం ఉంటే ఆ యువతీ యువకులకు కులం ఉండదు. అలాగే మతాంతర వివాహాలు చేసుకున్న వారి సంతానానికి జన్మతః మతం ఉండదు. అపుడు కులాంతర వివాహమే చేసుకుంటానని పట్టుదల వహించే వ్యక్తికి పై చెప్పిన రెండు తరగతులకు చెందిన వ్యక్తులు వివాహార్హులు కాకుండా పోతారు. అలాగే మతాంతర వివాహమే కావాలని భీష్మించుకున్నవారికి కూడా పై రెండు తరగతులకు చెందిన వ్యక్తులు వివాహ ఎంపిక విషయంగా పరిగణనలోకి రారు. ఇలాంటి పరిణామం ఆభిలషణీయమా?

మరియొక అంశం మన దృష్టిని ఆకట్టుకుంటున్నది. నాకు కులంలో విశ్వాసంలేదని ప్రకటించిన వ్యక్తికి కులం ఉండదుకదా! ఆ వ్యక్తి కులాంతర వివాహమే చేసుకుంటానని ప్రతిన పూనడంలో అర్థం లేదుకదా! ఇదే తర్కం మతాంతర వివాహం విషయంలో పనిచేస్తుంది.

కాగా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవడానికి ప్రగతిశీలుడైన వ్యక్తి సంకోచింపరాదు. ఇతర కారణాలవల్ల ఒక వ్యక్తిని ఎంపిక చేసుకొని అవతలి వ్యక్తియొక్క కులమో, మతమో తెలిసిన తరువాత ఏక కులమనో, భిన్న కులమనో కారణాన వివాహప్రతిపాదన విరమించడం అవివేకమవుతుంది.

కులాన్ని, మతాన్ని వదులుకొనలేని వారూ సమాజంలో ఉన్నారు. మతం వ్యక్తిగత విషయమని, కులం వృత్తిసంబధమని అర్థం చెప్పుకునే వారున్నారు. వారి అభిప్రాయం తప్పా లేక ఒప్పా అనేది ఇప్పుడు ఇక్కడ విచారణీయాంశం కాదు. కాగా వారు ఆ దృక్పథాన్ని అవలంబించినా మరియొక కులం వారిని, మరియొక మతం వారిని పెండ్లాడటానికి అభ్యంతరం చెప్పరు. అలాంటి వారిని 'పంక్తి బాహ్యులు' గా పరిగణించ గలమా? సర్వమత సహనం పేరుతో విభిన్న ప్రార్థనా పద్ధతులను, విభిన్న పూజా విధానాలను ఆలుమగలుకూడా కలిగి ఉండవచ్చనే ధోరణిలో ఉన్నవారున్నారు, వారిని మత రహిత వివాహాలను చేసుకోమంటే, కులరహిత వివాహాలను ఆమోదించమంటే, అంగీకరించరు. కనుక కులరహిత,

మతరహిత వివాహాలుగా అలాంటివారి వివాహాలను పేర్కొనలేము. అలాగే వాటిని మతవ్యతిరేక వివాహాలని అభివర్ణించలేము. దంపతులిరువురికీ మతంలో — విభిన్న మతాలవారైనా — విశ్వాసం ఉండవచ్చు కదా!

కనుక కులం, మతం, జాతి, రంగు, భాష, ప్రాంతం, తెగ అనేవి వివాహం విషయంలో అప్రధానాంశాలుగా పరిగణించడానికి వీలయినపరిస్థితి కలగాలి. అంటే కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, రంగు, తెగ ప్రసక్తిలేని వివాహాలు ఆమోదకరం కావాలి. విజ్ఞులు అలాంటి వాటిని, ప్రోత్సహించాలి.

"ప్రేమతో కూడియుండని జ్ఞానం నిష్ఫలం; జ్ఞాన సమన్వితం కాని ప్రేమ ఫలితాలు ప్రమాదకరం కావచ్చును"

—బెనీటా ర్రిడ్ రస్సెల్

ప్రేమికులు కేవలం పరస్పరం ప్రేమించుకున్నపుడే గాక, ఇరువురు కలసి అనేక విషయాలను అభిమానించినపుడు మాత్రమే ప్రేమ శాశ్వతంగా మనగలుగుతుంది"

— వాల్టర్ లిప్‌మన్

"వివాహం కేవలం లైంగికానుభూతి కోసం, లేక ప్రేమ కోసం కాదు ..... అది మౌలికంగా ఆర్థిక 'యూనిట్'. భద్రత సాహచర్యం లాంటి మానసిక విలువలను అది పెంపొందిస్తుంది; అనేక జీవితానందాలను పొలు పంచుకునేలాగు స్త్రీ పురుషులకు అవకాశం ఇస్తుంది"

— పాల్ కుర్ట్జ

"స్వచ్ఛమైన ప్రేమ నెలకొనియున్న దశలో నిజాయితీ, నిష్కాపట్యమూ, విశ్వాసంలాంటి ముఖ్యమైన విలువలు దర్శనమిస్తాయి"

— పాల్ కుర్ట్జ

"లైంగిక కలయికకు లైంగికానుభూతి ప్రకటనకు సాధనంగా వీర్పడిన వ్యవస్థలు చాలావరకు సంప్రదాయికాలు. వాటిని మార్చవచ్చును"

— పాల్ కుర్ట్జ

వివాహ వ్యవస్థకు అవసరంవుందా?

— మహీధర రామమోహనరావు

వివాహ వ్యవస్థకు అవసరంవుందా — అనే ప్రశ్నకు అర్థంలేదు. మన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అది సమాజంలోవుంది. దానిని ఒకరు ఆలోచించి ఏర్పరచిందేమీ కాదు. అత్యవసరమూ, అతి సహజమూగా వచ్చింది. సమాజ పరిణామ క్రమంతో అది అనేక రూపాలు మారింది, అవతరాలు ఎత్తింది.

మానవుడు జంతుసంతతినుంచి విడబడి, తనకొళ్లమీద తాను నిలబడి పది లక్షల సంవత్సరాలు అయిందని వూహ. ఆ దశలో మనుష్యుడు పదిమందికి మించని గుంపులుగా జీవించివుండాలి. ప్రకృతి, పరిసరాలూ అతడు గుంపుగా జీవించవలసిన అవసరాన్ని, ఆ గుంపుపరిమితినీ కూడా నిర్ణయించాయి. ఆ దశలో ఆ గుంపులోని ఆడ-మగ అందరూ ఒక కుటుంబం. గుంపు నశించకుండేందుకూ, విస్తరించేందుకూ అవసరం అయిన స్త్రీ పురుష సంప్రయోగానికి ఆ అత్యంత ప్రథమ దశలో రక్త సంబంధాలనుపట్టి, వయస్సు అంతరాన్నిపట్టి కూడా నిషేధం వుండడానికి వీల్లేదు. క్రమంగా సమాజంలో కనబడిన ఆరోగ్యావసరాల దృష్ట్యా కావచ్చు, రక్తసంబంధీకులమధ్య నిషేధాలు అనేక అంతరువులతో విస్తరించాయి. "ప్రారంభ కాలంలో చాలామంది ఉమ్మడి వివాహ బంధంతో ఇమిడి వుండే వారు. కాని, ఒక్కొక్క మార్పు వచ్చినప్పుడల్లా వారి సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. చివరకు ఆ బంధంతో ఒక్క జంటని మాత్రమే ఇముడ్చుకునే స్థితివచ్చింది. ఇదే ఈనాడు అమలులోవున్న వివాహ పద్ధతి" – అంటాడు, ఫ్రెడిరిక్ ఏంజిల్స్ తన "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక" అనే గ్రంథంలో (విశాలాంధ్ర ప్రచురణ పుట – 52)

ఈ మధ్యకాలంలో వివిధ దశలలో రక్త సంబంధీకుల పెళ్లి, ప్యూనలాన్ పెళ్లి, జంట పెళ్లి వంటి పేర్లతో ఆ యా నాటి స్త్రీ — పురుష సంప్రయోగ వ్యవస్థకి పేర్లు పెట్టుకున్నాం. పేరు ఏదయినా అది స్త్రీ పురుష సంబంధాల ఏర్పాట్లకు పెట్టుకున్న సంకేతనామం తప్ప వేరుకాదు. అందుచేతనే వివాహ వ్యవస్థ అవసరమా అన్నప్రశ్నకి అర్థంలేదు అనడం. అది మానవ సమాజం మనుగడకు అవసరం. అందుచేతనే దానిమీద సమాజం ముద్ర వుండక తప్పదు. వుంది.

ఆ ముద్ర మన వివాహ పద్ధతులరూపంలో, ఆచారాలు, అలవాట్ల రూపంతో వుంటుంది. మనం సాంప్రదాయిక వివాహ పద్ధతి అనేదాంట్లో కులాన్ని, దానిలోని శాఖల్ని పాటించాలి. "సమాన వియ్యం" అన్నది వధూవరుల మధ్యకాదు; వారి కులాలమధ్యా, కుటుంబాల మధ్యాగాని. కులాలమధ్యా, కుదురులమధ్యా, కుటుంబాల మధ్యాకూడా అంతరాల్ని పాటిస్తుంది మన సమాజం.

అలాగే సంప్రదాయ వివాహపద్ధతిలో కన్యాదానం, కన్యావరణం వుంది. అందులోని అర్థం ఆ శబ్దాలే చెప్తున్నాయి. కాయనో, కసరునో, చెంబునో, తప్పెలానో ఇచ్చినట్లు తండ్రి కన్యను దానం చేస్తాడు. 'ధర్మ ప్రజాసంపత్యర్థం' ఆ వరుడు స్వీకరిస్తాడు. పిల్లదాని ఇష్టాయిష్టాలతో సంబంధం నిరాకరించే సమాజం మనది. నిరుపమా నిరంజన్ ట్రాసిన 'మాధవి' నవలలోని మాధవి మన వధువులకు తాతమ్మ.

ఈ రెండూ మన సంప్రదాయిక వివాహ పద్ధతికి మూలస్తంభాలు. అది భూస్వామ్యయుగపు సమాజ వ్యవస్థను సూచిస్తూంది. సగోత్ర వివాహ నిషేధాలు, పునర్వివాహ (స్త్రీకి మాత్రమే) నిషేధాలు ఆ సమాజంలోని సంబంధాలకు ప్రతిబింబాలు.

ఈనాడు మనం ఈ నిషేధాలను నిరాకరించడం నూతన సమాజ సంబంధాలకు సూచన. అంతేకాదు. వివాహం కులానికీ, కుదురుకూ, కుటుంబానికీ లోపలనో, బయటనో మాత్రమే వుండాలనే నిబంధనలనూ ఆచారంలోంచి తోసివేస్తున్నాం. ఇదీ ఇంతవరకు పాటిస్తున్న సమాజ నిబంధనలకు వ్యతిరేకమే.

దీనికన్నా ముఖ్యమైనది ఇంకొకటుంది. వధూవరుల యిష్టం, అయిష్టంనుపట్టి వివాహాలు జరగటం, జరగకపోవడం పాటిస్తున్నాం. వివాహ విచ్ఛేదాన్ని ఆమోదిస్తున్నాం. పునర్వివాహాన్ని అంగీకరిస్తున్నాం. వీనికి వున్న పరిమితులూ, ఆటంకాలూ, అటకాయింపులూ సమస్యకాదు, ఇక్కడ. వానిని అధిగమించి, వధూవరుల అంగీకారం వివాహం విషయంలో అంత కంతకు అధిక ప్రాధాన్యం వహిస్తూంది. ఇది నూతన సమాజ ఆవిష్కారానికి సూచన.

ఈ పరిణామదశలో చాలా ముఖ్యమైన కొన్ని మార్పులు వచ్చాయి. అందులో మొదటిది వివాహ సంబంధాల విశ్వవ్యాపకత్వం, ఇంతఃపూర్వపు సమాజాలు విధించిన కుల, మత, జాతి, దేశ పరిధులను అధిగమించి స్త్రీ పురుషులు వివాహ బంధాలు ఏర్పరచు కొనేందుకు అధికారమూ, స్వేచ్ఛనూ వివాహబంధంలో పురుషునితో పాటు స్త్రీకి కూడా సమానస్థాయి, సమాన హక్కున్నూ, తల్లిదండ్రిలూ, ఇతర పెద్దలా ఇచ్ఛనుగాక వధువు తన పునోదండిని అమలు జరుపుకోవాలనడమూ, వివాహంలో స్త్రీ సమాన బాధ్యత కలదనడమూ నూతన సమాజ రూపం స్థిరపడుతుందనడానికి సూచనలు.

దీనికి అనుగుణంగా వివాహ పద్ధతిలో, ప్రక్రియలలో సహజంగానే మార్పులు వచ్చేస్తున్నాయి.

నిన్నటి పత్రికలో ఒక వార్త చదివాను. కాన్పూర్‌లో సుమన్‌రాజ్ అనే యువకుడు నీలంచతుర్వేది అనే యువతి చేయిచేయీ కలిపి జీవిత భాగస్వాములు అయినట్లు ప్రకటించారు. అదే వివాహం. దానికి ఏ విధమైన మత సంబంధమయిన తంతు, తతంగాలూ, సమాజ సంబంధమైన వేడుకలు, ఏమీలేవు. ఇరుపక్షాల పెద్దల అంగీకారంతోనే ఇది జరిగిందని దానికో ఉపశీర్షిక (టైట్‌పిన్) వుందనుకోండి.

1930 నాటికే మన వివాహ పద్ధతులు మారవలసి వున్నదనే గ్రహింపు వచ్చింది. ఏవిధంగా మారాలి ? ఎందుకు మారాలి ? పురోహితవర్గం మారాలి అనుకున్నారు కొందరు. అంతేకాదు వివాహ మంత్రాలూ, ప్రతిజ్ఞలూ మొత్తం తంతు అంతా జనానికి అర్థంకాని సంస్కృతంలోవుంది. అవన్నీ

తెలుగులో వుండాలన్నారు మరికొందరు. ఈ తతంగం అంతా మరీ బెడదగావుంది తగ్గించుకొందామన్నారు, మరికొందరు.

1936 ప్రాంతాల నుంచి ఈ వివాహ పద్ధతిని శాస్త్రీయపంథాతో ఆలోచించడం, సర్దుబాటుచేయడం ప్రారంభమైనదనవచ్చు. కన్యాదానం వగైరాలు తొలగించి సభాముఖంలో వధూవరులు దండలు మార్చుకోవడం, పరిమాణాలు చేయడం వివాహ కార్యక్రమం చేసేరు. సామాజికమైన వేడుకలస్థానంలో, పాత కొత్త వివాహపద్ధతుల తేడాను, మార్పు అవసరాన్ని వివరిస్తూ ఉపన్యాసాలు వచ్చేయి. ఈ పద్ధతిని బలపరిచినదీ, వ్యాప్తిలో పెట్టినదీ కమ్యూనిస్టులు.

మధ్యలో 'స్వేచ్ఛా పరిణయం' ఒక వాదంగా వచ్చింది. అది ఎక్కువకాలం మనలేదు. విస్తరించనూలేదు.

వివాహపద్ధతితో వచ్చిన ఈ మార్పుతో సాంప్రదాయిక పద్ధతిలో అంతర్గతంగావుంటూ వచ్చిన వైరుధ్యాలను తొలగించడానికి ప్రయత్నం జరిగింది. అయితే ఒకటి మిగిలింది. వ్యక్తిగత ఆస్తిహక్కు ప్రాతిపదికగా సాగుతున్న మన సమాజంలో ఈ నూతన పద్ధతికి చట్టపరమైన బలం కుదర లేదు. అంతవరకూవున్న కుల, మత పరమైన రక్షణ తొలగింది. మనుష్యుల లోని సహజమైన మంచితనం, న్యాయబుద్ధి కొత్తపద్ధతిలో జరిగిన వివాహాలను సమర్థించి కాపాడింది. అంతేగాని వానికి చట్టబలంలేదు. కనుక రిజిస్ట్రేషనును ప్రోత్సహించడం తప్పలేదు.

కొంచెం ఇంచు మించుగా మనం ఈనాడు అనుసరిస్తున్న వివాహ పద్ధతి ఇది.

ఈ విధంగా స్త్రీ పురుషసంప్రయోగ (వివాహం) సమస్యలోవున్న రెండు అంశాలూ — ఒకటి వధూవరులకు మాత్రమే పరిమితమయినదీ, రెండు - సమాజ వ్యవస్థగతిక్రమానికి సంబంధించినది. రెండూ ఈ పది లక్షల సంవత్సరాల కాలంలో ఎన్నో మార్పులకు లోనయ్యాయి. దశా విశేషాన్ని బట్టి నీతి నియమాల నిర్ణయమూ, ఆచారాలు, అలవాట్లు, ప్రమేయమూ

మారేయి. మారుతున్నాయి. మారుతాయి. ఈ మార్పుల్ని సమాజ గతమయిన పరిణామాలూ, దాని అవసరాలే నిర్ణయిస్తాయి.

వివాహం అన్నది పైనుంచి ఎవరో తెచ్చిపెట్టిందికాదు. స్త్రీ పురుష సంబంధాలను సమాజగతికి అనుగుణంగా సరిపుచ్చుకుంటూ సంఘమే–అంటే మనమే – రూపొందించుకున్ననియమాల సంపుటి. దీనిని అల్లాగే చూడాలి.

"మానవ కుటుంబాలు సమాజాన్ని నిర్మించే ఇటుకలు. వాటిని కలిపివుంచే సిమెంటు నీతి."

— హెక్టర్ హాటను

"ఉద్వేగమూ, మేధస్సూ ఈ రెండూ సమష్టిగా వైవాహిక ప్రేమకు గట్టి పునాదిని నిర్మిస్తాయి"

—కార్లిస్ లామాంటీ

వివాహం : వ్యక్తి స్వేచ్ఛ

— సురవరపు

వివాహం అనేది వ్యక్తిస్వేచ్ఛకు సంకెల అనేది నా నిశ్చితాభిప్రాయం. అయితే ఈ సంకెలను బుద్ధిపూర్వకంగా మానవ జాతి ఎందుకు తగిలించుకున్నదో, ఎప్పుడు తగిలించుకున్నదో పరిశోధకులు ఇదమిద్దంగా తేల్చి చెప్పలేకపోతున్నారు.

ప్రాణికోటిలో మానవులలో తప్ప ఈ పద్ధతి మరే ప్రాణికీలేదు. మానవులలోకూడా బహుశా తొలి రోజులలో ఉండేది కాదేమో. జాతిని కొనసాగించడం లేదా పరిరక్షించడం ప్రతిప్రాణికి సహజమైన శారీరక ధర్మం. ఈ శారీరక ధర్మనిర్వహణ కొరకే ప్రతి ప్రాణిలోనూ లైంగిక వాంఛ ఉంటుంది. లైంగికవాంఛ తీర్చుకోవడానికి పెట్టిన కట్టుబాటును వివాహం అంటున్నారని కొందరి అభిమతం. అయితే ఎటువంటి కట్టుబాటుకూ లొంగకపోవడం లైంగిక వాంఛయొక్క ధర్మం. ఇనుప కచ్చడాలు బిగించిన రోజుల్లోనూ, సాంఘికంగా, చట్టపరంగా, ధార్మికంగా ఇంకా అనేక విధాలుగా ఎన్నెన్ని కఠినమైన నిబంధనలు చేసినా కట్టుబాట్లు పెట్టినా వివాహబంధాన్ని అధిగమించిన కామవాంఛ మానవుల్లో చావలేదు; చావదు. వ్యాసభారతంలోనిది ఔనోకాదో — కాని ద్రౌపది శ్రీకృష్ణునితో అన్నట్లుగా ప్రచారంలో ఉన్న —

"పంచమే పతి యిస్యంతి మహ్య షష్ఠోపిరోచతే
పురుషాణా మభావేన సర్వనార్య పతివ్రితాః"

అన్నమాట — (అంటే — కావలసిన మగాడు దొరక్కనే పతివ్రతలుగా ఉంటున్నారు) ఒక్క ఆడవాళ్ల విషయంలోనే కాక మగాళ్ళ విషయంలో కూడా వర్తిస్తుంది.

మొదట్లో వివాహం అనే పద్ధతిలేని రోజుల్లో ఆడదే కుటుంబానికి పెద్దగా వుండేదంటారు. బహుశా ఇది నిజమే కావచ్చుననిపిస్తున్నది.

ఇతర ప్రాణుల్లో సహజ సిద్ధంగాఉన్న అలవాట్లను పరిశీలిస్తే ఆడది పిల్లల్ని కనడమేకాదు; కన్నపిల్లల వల్ల విస్తృతమైన కుటుంబాన్ని నడపడంకూడా ఆడదే. ఏ ప్రాణుల మందలను తిలకించినా ఆడవి ఎక్కువగా ఉండటం — మొగవి ఒకటో రెండో ఉండటం కనిపిస్తుంది.

వివాహం పుట్టకముందు అలాగే ఉండేదేమో మానవజాతి.

'వివాహం అనేది వ్యక్తి స్వేచ్ఛకు సంకెల' అంటూనే ప్రారంభించాను ఈ వ్యాసాన్ని. ఈ సంకెల మగాళ్ల స్వేచ్ఛను హరిస్తోందా, ఆడవాళ్ల స్వేచ్ఛను హరిస్తోందా? ఇద్దరి స్వేచ్ఛనూ సమానంగా హరిస్తోందా? అన్న ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించాలని బాగా ఆలోచిస్తే – అధ్యయనంచేస్తే తేలేది ఆడవాళ్ల స్వేచ్ఛను ఎక్కువగా హరించడానికే 'వివాహం'ను ఈనాడు నవనాగరిక సమాజంలో అమలులోఉన్న వివాహపద్ధతిని మగవాడే రూపొందించి ఉంచాడని నా అనుమానం.

ఆడదానికి "అబల" అని మగాడు పేరుపెట్టాడు గాని, శారీరక బల పరీక్షచేసిచూస్తే – మానవుల్లోనే కాదు; ఏ ప్రాణిలో అయినాసరే ఆడదే బలవంతురాలు అని తేలుతుంది. అత్యాధునిక మధ్యతరగతి నాగరిక జీవితాన్ని ఉదాహరణగా తీసుకొని పరిశీలించండి; పొద్దున్నేలేచి, వాకిలూడ్చుకొని, బాసన్లు కడుక్కొని, బెడ్‌కాఫీ భర్తకిచ్చి, పిల్లలను తయారుచేసి బడికిపంపి, భర్తకు స్నానానికి నీళ్ల దగ్గర్నుంచి అన్నీ సమకూర్చి — ఆయనకుపెట్టి తానుతిని — ఇద్దరూ తలో ఆఫీసుకు వెళ్ళి, ఆఫీసులో పనులుచేసుకొని ఇంటికివచ్చి మళ్లీ రాత్రి వంటలూ వార్పులూ చేసి, పక్కలుసద్ది పిల్లల్ని పండుకోబెట్టి, భర్త ప్రక్కలోకివచ్చే ఆడది అలసటఎరుగదు — ఆఫీసులో ఒక్కగంట ఎక్కువ పనిచేస్తే అలసి సొమ్మసిల్లుతాడు మగాడు. ఇటువంటిదాన్ని 'పాదదాసి'గా చేసుకుంటే ఎంతగానో సుఖపడవచ్చునని మగాడు ఈ ఉచ్చు బిగించాడేమో ననిపిస్తుంది.

పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలను గురించి పరిశోధించినవారు "వ్యక్తిగత ఆస్తి" కోసం పెళ్లి పుట్టిందన్నారు. "వ్యక్తిగత ఆస్తి" కీ పెళ్ళికీ అంతటి అవినాభావ సంబంధం ఉండాల్సినపని లేదనివిస్తోంది.

పై గా పెళ్లివల్ల వ్యక్తిగత ఆస్తిని వ్యక్తి వినియోగించడంలో కూడా వ్యక్తిస్వేచ్ఛకు భంగం కలుగుతున్నదేమో ననిపిస్తున్నది.

మరికొందరు 'యోనిశుచి' పరిరక్షణ కోసం దీన్ని రూపొందించా రంటారు. కాని మనకన్నా మన పూర్వీకులే ఈ విషయంలో పురోగాములుగా వున్నట్లు ఆధారాలున్నాయి. ప్రతి బహిష్టు తర్వాత స్త్రీయోని పరిశుద్ధం అవుతుందనీ, పరిశుద్ధంకావడానికి స్త్రీయోనికున్న ఈ సహజధర్మం పురుషులకు లేదనీ పూర్వీకులే అంగీకరించారు.

కామవాంఛను కట్టుబాటులో పెట్టకపోతే సుఖవ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నదికనుక వివాహబంధాన్ని సృష్టించి ఉంచారని మరికొందరి నమ్మకం. కాని విచ్చలవిడిగా కామవాంఛ తీర్చుకోవడానికీ సుఖవ్యాధులు ప్రబలడానికీ అంత దగ్గరి సంబంధంలేదు. "కాల్ గర్ల్స్" అనే జారిణులు విదేశాల్లో రోజు ఎందరికో సంభోగసుఖాన్ని పంచిపెడుతూ సుఖరోగాలు తగలకుండా ఉంటున్నారు. పారిశుధ్యపు అలవాట్లు, ఆరోగ్య రక్షణ, చికిత్స ఇవి ఉంటే వాటిని అదుపు చెయ్యవచ్చు. వివాహబంధంతో కాదు. వాటిని వివాహబంధం అదుపు చెయ్యజాలదని ఆచరణలో, అనుభవంలో రుజువైన సత్యం.

వివాహవ్యవస్థ లేని రోజుల్లో మానవజాతి సుఖరోగాలతో తీసిపోయిందని గానీ, మానవనాగరికతా వికాసం జరగలేదని గాని, ఆనాటి మానవ సమాజం ఈనాటికన్నా పతనావస్థలో ఉండేదని కానీ చెప్పడానికి ఆస్కారాలేవీ లేవు.

కనుక 'వివాహం' అనేదాని సృష్టికర్త మగాడే కావాలి; వివాహం మగాడికి అవసరమా? ఆడదానికా? ఈనాటి నవనాగరికులను ఈ ప్రశ్నవేస్తే అలోచించకుండా టక్కున ఆడదానికేనని సమాధానం చెపుతారు. ఎందుకని? తండ్రిలేని 'సంతానం'అంటే, (కుంతీ సుతులంటే) సమాజంలో ప్రచారంలోవున్న చిన్నచూపు; పాతివ్రత్యానికి సమాజంలోఉన్న పెద్దచూపువల్ల. ఈ భావాలను బాగా ప్రచారంచేసి, పసుపు కుంకుమే జీవిత పరమావధి, పతిసేవే సతికి గతి, అన్న భావాన్ని ఆడాళ్లలో సైతం బాగా నాటినవాడు ఈ మగాడే. ఈ అభిప్రాయాలను, ప్రచారాలను ఒక్క నిమిషం విస్మరించి పరిశీలిస్తే వివాహం కావలసింది మగాడికేనని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇటీవల కొన్ని పరిశోధనలు జరిగాయి. 1981 తొలిరోజుల్లో న్యూయార్క్‌లో "డోగ్లాస్‌నాలెస్" నాయకత్వంలో ఒక పరిశోధకుల బృందం తమ పరిశోధనా ఫలితాలను ప్రకటిస్తూ శిశువు అణువణువునా సాగే ప్రాణప్రక్రియకు కావలసిన జన్యపదార్థన్నంతటినీ (DNA) తల్లి గర్భమే సరఫరా చేయగలదని ఉద్ఘాటించారు. అందువల్ల వివాహంకాని ఆడదాన్ని, కట్టుకున్నవాడు లేడు కనుక అసంపూర్ణ వ్యక్తి అనడం అశాస్త్రీయమన్నారు. మగాళ్లు ప్రచారంచేసిన పైభావాలు లేకపోతే, ఏ మగాడితోనైనా సంభోగించి, స్త్రీ సంతానం కనవచ్చు; పెంచవచ్చు; పోషించవచ్చు; స్త్రీ శరీరంలో ఇందుకు కావలసిన శక్తి - అవయవాలూ, లక్షణాలూ అన్నీ ఉన్నాయి. మగాడికి అలాకాదు; కొడుకు కావాలంటే పెళ్లి చేసుకోవలసిందే; పెళ్లి లేకుండా కామవాంఛ తీర్చుకోగలడు గాని మగవాడు సంతానం పొందలేడు. అందుకని ఈ బంధాన్ని సృష్టించి శాశ్వతం చేసుకున్నాడేమో ననిపిస్తుంది.

ఈ బంధాన్ని ఎంత శాశ్వతం చేసుకున్నాడంటే - తన మరణం తర్వాత కూడా తెగకుండా బిగించాడు. "జన్మజన్మల బంధం" అని కథల్లల్లాడు. కల్పనలు చేశాడు. కవిత్వం, కావ్యాలూ, ప్రణయ గీతాలురాసి, సంకెల వేయించుకొనేది దాన్ని సంకెలగాకాక సౌభాగ్యంగా, దాస్యంచేసేది తాను చేసేది దాస్యంకాక ధర్మంగా, అది లేకపోవడం అవమానకరంగా భావించేంతగా నూరిపోశాడు; అలా నూరిపొయ్యకపోతే, అంత గట్టిగా కట్టుదిట్టంగా ఈ అబద్ధాన్ని నిబద్ధి చెయ్యకపోతే తనకన్నా శారీరకంగా బలవంతురాలైన ఆడది, తనకూ, తన మరణం తర్వాత తన సంతానానికి తరతరాలదాకా దాస్యంచేస్తూ ఎలా ఉండగలదు?

ఒక సందర్భంలో డాక్టర్ రామ మనోహరలోహియాగారన్న మాటలను ఇక్కడ ఉదహరిస్తాను. "అసలు పాపమనేది ఏదైనావుంటే, ఈనాడు జరుగుతున్న వివాహాలకూ, వివాహానంతర జీవితానికీ మించిన పాపం మరేదీలేదు" అని.

వివాహబంధంవల్ల మానవుల కామవాంఛ కట్టుబాట్లకు లొంగలేదని, లొంగబోదని, వివాహపు కట్టుబాట్లను అతిక్రమించి కామవాంఛ తీర్చుకోవడం సర్వత్రా సాగుతూనేవున్నదని గమనించాం. స్త్రీ - పురుష ఆకర్షణ

సర్వకాల సర్వావస్థలలోనూ ఒకేరకంగా ఉండదనికూడా చూసాం. 'మోజులు' తీరుతుంటాయి; కొత్తవి మొలకెత్తుతుంటాయి.

అలాగే వివాహం చేసుకోలేక పోయినట్లయితే యువతీయువకులంతా విచ్చలవిడిగా, కామవాంఛ తీర్చుకుంటూ వుంటారనే భావంకూడా సరైంది కాదు. జీవితంలో 24 గంటలూ ప్రాణులకు ఇదేయావ ఉండదు. ఆహార, నిద్రా, భయ, మైథునాల్లో ఈ యావది నాలుగోస్థానం. పైఖరిపైనా, నిమగ్నతపైనా తీరికపైనా ఇంకా అనేకవిధాల వాతావరణాలపైనా ఈ కోరిక ఆధారపడి ఉంటుంది.

శారీరకంగా బలవంతురాలైన ఆడది, ఏవో బలహీన క్షణాల్లో ఉండగా మగాడు దానికి పెళ్లి ఉచ్చును బిగించిఉంటాడు. శారీరకంగా బలవంతుడు కాకపోయినా మగాడు ఆడదానికన్నా ఆక్రమణ పైఖరి ఎక్కువగా ఉండే వాడు; కనుక, గర్భవతిగా ఉన్నప్పుడు బాలింతగా వున్నప్పుడు అండదండలు అవసరమైన ఆడది ఈ ఉచ్చుకు లొంగిపోయి వుంటుంది.

'స్త్రీ స్వాతంత్ర్యం' కావాలని కోరేవారు వివాహ వ్యవస్థను రద్దు చేస్తేతప్ప అది దుర్లభమని గుర్తించాలి.

'వివాహం' అనేదాన్ని అట్టేపెట్టినందువల్ల మానవజాతికి ఒరిగే ప్రయోజనం ఏమీలేదు — సరే దాన్ని రద్దు చేసినట్లయితే పూర్తిగా నామ రూపాలు లేకుండా ధ్వంసం చేసినట్లయితే మానవజాతికి కలిగే ప్రయోజనాలు ఏమన్నా ఉన్నాయో లేదో పరిశీలిద్దాం.

'వివాహం' రద్దయితే కలిగేగొప్ప ప్రయోజనం మానవుల్లో వికసించే ధైర్య సాహసాలు, తెగింపు. ఈనాడు శతాబ్దం సగటు మానవులు సమాజంలో ప్రతినిత్యం, ప్రతిక్షణం జరుగుతున్న అన్యాయాలకు — అక్రమాలకూ వ్యతిరేకంగా తిరగబడక పోవడానికి, అవినీతి — అక్రమాలతో అనుక్షణం రాజీపడుతూ, బ్రతుకులు కొనసాగిస్తూ వుండటానికి ప్రధాన కారణం ఈ వివాహబంధమే. వివాహబంధంతో ఆడదాన్ని బాలిసను చేసుకున్న మగాడు, దాన్ని కాపాడుకోవడానికి సమాజానికి బానిస అయిపోతున్నాడు. ఆడదాని వ్యక్తిస్వేచ్ఛను కట్టడిచేసి తాను కట్టుబడిపోతున్నాడు. విప్లవాలు రాకపోవడానికి, అన్యాయం యథావిధిగా

కొనసాగడానికీ, సమాజంలోని ఇంకా ఎన్నో అనర్థాలకు ఈ వివాహబంధమే మూలకారణం.

ఈ బంధం రద్దయితే కలిగే రెండో ప్రయోజనం పరిపాలనా స్వేచ్ఛత. ప్రఖ్యాత గ్రీకు తత్వవేత్త పాలకుడు పెళ్లి చేసుకోవద్దని ఏనాడో రాశాడు. ఆయన కాలపు పాలకులు మగవారే; ఇప్పుడు ఆడవారుకూడా పాలకులుగా ఉంటున్నారు కనుక — తల్లులు కాదలచుకున్నవారు పాలకులు కావద్దని, పాలకులు కాదలచుకున్నవారు తల్లులు కావద్దని కూడా సూత్రీకరించాల్సి వస్తుంది.

ఇప్పుడు సమాజంలో స్థిరంగా నాటుకొనిఉన్న అభిప్రాయాలను కాదని వివాహవ్యవస్థ రద్దుకాదు. అయితే ఈ యుగంలో ఇందు అనుకూలత చాలా ఉన్నది. గర్భధారణ మానవుల గుప్పిట్లోకి వచ్చింది. ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా గర్భధారణ జరిగే రోజులు పోయినై. కనుక వివాహవ్యవస్థ రద్దుకోసం మానవజాతి, ముఖ్యంగా మహిళాలోకం ఉద్యమించడానికి ఇది మంచితరుణం.

వివాహాన్ని పూర్తిగా రద్దుచేసే దశలో మొదటి దశగా మాతృస్వామ్య కుటుంబాల వికాసాన్ని ప్రోత్సహించవచ్చు; ఆస్తిహక్కు పూర్తిగా స్త్రీపరం చేయడం ద్వారా, కుటుంబ యాజమాన్యాన్ని ఆమెకప్పగిస్తే మానవజాతి బాగా వికసించగలదనడంలో సందేహంలేదు.

క్రమంగా ప్రతివ్యక్తి తన పేరుతో తండ్రి పేరుకు బదులుగా తల్లి పేరు ధరించే పరిస్థితి రావాలి; దీనితోబాటే — 'కులట' అన్న పదం స్థానంలో "కులటడు" అనే పదం; "కాల్ గరల్" అన్న పదం స్థానంలో "కాల్ బోయ్" అన్న పదాలు వాడుకలోకివచ్చి "లంజ కొడుకులు" అన్న పదం పూర్తిగా మాయమైపోయే దిశగా మానవ నాగరికత వికసిస్తే ఎంత బాగుండును?

వివాహం మత తంతా?
లేక
సమానుల కలయిక సంబంధమా?

—మమతా లక్ష్మన్న

(ఆంగ్లంలో శ్రీమతి లక్ష్మన్న వ్రాసిన పరిశోధనా వ్యాస సంగ్రహ పాఠం ఇది).

గృహస్థాశ్రమంలో అడుగిడటానికి ప్రతివ్యక్తి విధిగా చేయవలసిన లాంఛనాయుత కార్యక్రమము, మత తంతు ఈ రెండూకలిసి హిందూ వివాహ సారమని చెప్పవచ్చు. (శ్రీభు 1954)

ధర్మమూ, ప్రజ (సంతానం), రతి (సుఖ ప్రాప్తి) ఈ మూడూ పైన చెప్పిన వరుస క్రమంలో హిందూవివాహ లక్ష్యాలు (కపాడియా 1972). హోమము, పాణిగ్రహణం, సప్తపది ముఖ్యమైన మత సంబంధమైన ఆచారాలు. (కపాడియా 1972)

భారతదేశంలోని ముస్లిం సమాజంలో వరుని కుటుంబం వారు వధువు ఇంటికి 'పైఘం' పంపుతారు. ఆ ప్రతిపాదనను వధువు కుటుంబం వారు అంగీకరిస్తే 'మహర్' (వరుడు ఇచ్చే శుల్కం) విషయమై ఇరుకుటుంబాలు ఒప్పందానికి వస్తాయి. నికా (పెండ్లి) కు తేది నిర్ణయం అవుతుంది. ఆ రోజున వరుడు తన బంధువర్గంతో కలిసి వధువు ఇంటికి వెళ్తాడు. 'కాజి' ఇద్దరు సాక్షులతో వధువు సమ్మతిని లాంఛనాయుతంగా తీసుకుంటాడు. తరువాత వరుని సమ్మతిని గ్రహిస్తారు. ప్రార్థన జరగటం, ఇస్లాం మతంలో అంతకు క్రితం జరిగిన ప్రసిద్ధిచెందిన వివాహాలను గురించి ముచ్చటించడం జరుగుతుంది. తరువాత వివాహాన్ని ధృవపరుస్తాడు కాజీ.

"స్త్రీకి మహమ్మదు తక్కువ స్థానాన్ని కేటాయించాడు. ఆమెకు భర్తసేవే పరమావధి. ఒక్కగంట కూడా, వ్యవధిలేకుండానే ఏ కారణం చెప్పకుండానే అతడు ఆమెను పరిత్యజించవచ్చు. ఆమెకు విడాకులిచ్చే అతని అధికారం సంపూర్ణమైనది; ఎవరూ ప్రశ్నించ వీలులేనిది. అలాంటి అధికారం ఆమెకు ఇవ్వబడలేదు. భర్తకు అలా ఇష్టమయితే, ఆమె అలా అయిష్టంగా, నిరాదరణకు గురిఅయి, లేక మరో సవతినిపొంది, భర్తకు దాసురాలిగా జీవయాత్ర సాగిస్తుంది." (విలియం మెయిర్)

క్రైస్తవమతంలో వివాహం ఏక పత్నీకం, ఏక భర్తృకం; అది జీవితాంతము కొనసాగవలసినది. విడాకులను అనుమతించదు ఆ మతం. వివాహమయిన తదుపరి భార్య తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కోల్పోతుంది; భర్త పేరును వాడాలి. విడాకులకు వీలులేదు కనుక, పురుషులు ఊంపుడు కత్తెలను చేపట్టే ఆచారం వెలిసింది. ఎనిమిదవ హెన్రీ రాజు పోప్‌తో సంబంధం త్రెంచుకున్న తరువాత భార్య కాథరినుకు విడాకులిచ్చి మరల వేరొక వనితను వివాహమాడాడు. స్త్రీలకు ఆనాడు ఆస్తిహక్కులేదు; పౌర సత్వాలు లేవు. ఇది అసమ్మతి ప్రదర్శనలకు దారితీసింది. అనేక దేశాలలో కోర్టులద్వారా విడాకులిచ్చే పద్ధతి అమలులోనికి వచ్చింది. అలాగే భారతదేశంలో శాసనపరంగా విడాకుల వెసులుబాటు కల్గింది.

జీవిత సహచరుల ఎంపిక:- ఈ విషయంలో విధి నిషేధాలున్నాయి. ఫలాని కులంలోనే వివాహం చేసుకోవాలని, ఒకే గోత్రంలో వారిని, సపిండులను, ప్రవర కలవారిని వివాహమాడరాదనే సూత్రాలు హిందూ వివాహ పద్ధతిలో బలంగా ఉన్నాయి. ఈ ఆచారాన్ని ఉత్తర భారతదేశంలో ఖచ్చితంగా పాటిస్తారు. దక్షిణాదిన మేనరికాలు, మేనమామను వివాహమాడటం ఆచారంగా వస్తుంది; అంతేకాదు, ఇలాంటి సంబంధాలను ఎక్కువగా ఆదరించడం జరుగుతున్నది. ఏ కుటుంబాల పిల్లలను వివాహమాడరాదో మనువు నిర్దేశించాడు. ధర్మాన్ని తృణీకరించేవి అంటే సామాజిక బాధ్యతలను, వ్యక్తిగత బాధ్యతలను నెరవేర్చనివి, వేదాధ్యయనం లేనివి అంటే మతాన్ని అంగీకరించనివి, ఆ కుటుంబ సభ్యులలో ఎవరికైనా కుష్టు,

మూర్ఛ లాంటి వ్యాధులుంటేను ఆ కుటుంబాల పిల్లలను వర్జించాలి. ఇలా ఎన్నో లక్షణాలను వివరించాడు మనువు.

వివాహ వయస్సు :- హిందూ వివాహ శాస్త్రజ్ఞులు, శాసనకర్తలు వయస్సు విషయంలో వరాధిక్యత ఉండాలని నిర్దేశించారు. ముప్పది ఏండ్ల పురుషుడు 12 ఏండ్ల బాలికను వివాహమాడాలని మనువుచెప్పాడు. ముప్పదేండ్ల పురుషుడు పదేండ్ల పిల్లను పెండ్లాడాలని భీష్ముడు ధర్మరాజుకు ధర్మోపదేశం చేశాడు. వాత్సాయనుడు బాల్య వివాహాలను నిరసించి వధువుల శారీరకంగాను, మానసికంగాను పరిణితులు కావాలన్నాడు. వరుని వయస్సు విషయంగా అందరూ 24, 25 ఏండ్లు దాటాలన్నారు. వధువు వయస్సును గురించి అభిప్రాయా భేదాలున్నాయి. క్షత్రియులలో స్వయంవర పద్ధతి ఆచారమయింది. మగపిల్లలకు బాల్య వివాహాలు చేయటం తరువాత వచ్చిన సంప్రదాయం.

ముస్లిం సమాజంలో వివాహం సర్వత్రా ఆచరణ యోగ్యమయినది. బ్రహ్మచర్యాన్ని ఆ మతం ప్రోత్సహించదు. 15 సంవత్సరాల వయస్సు వచ్చినవారు ఎవరైనా వివాహమాడవచ్చును. ఏమైనా, ఇరువురి సమ్మతి అవసరం. ముస్లిం పురుషుడు ముస్లిమేతర స్త్రీని వివాహమాడవచ్చును. కాని ముస్లిం స్త్రీ ఇతర మతస్తుని పెండ్లాడరాదు. మైనర్లు, మానసిక శక్తి లేనివారు సంరక్షకుల అనుమతితో వివాహబంధంలో ప్రవేశించవచ్చును.

బౌద్ధమతంలో వివాహం సామాజిక ఒప్పందం. చాలా నిరాడంబరమైన తంతు ఉంటుంది. ఇరువదిఎండ్ల వయస్సు దాటిన స్త్రీ తన ఇచ్ఛ వచ్చిన పురుషుని భర్తగా స్వీకరించవచ్చును.

వివాహం ఇరువురు వ్యక్తులమధ్య సంబంధమేకాక వధువును వరుని కుటుంబంలో ఆమోదంతో చేర్చుకోవడమూ, ఆమె ఆ కుటుంబానికి చెందడం ప్రాధాన్యత వహించాయి. 'పతివ్రత' భావం పెరిగి బాల్య వివాహాలు, కన్యాత్వరక్షణ పెరిగాయి.

'కులీనులు' అనేక మంది స్త్రీలను పెండ్లాడటము బెంగాలులో అమలులో ఉండేది. కేరళలో నాయరు కుటుంబాలలో ఈ పద్ధతి ఒకప్పుడు

ఉన్నది. కొన్ని తెగలలో, కులాలలో మొదటి పెండ్లివిందు వినోదాలతో, మత విధులతో జరిపిస్తారు; తరువాత భర్త భార్యను పైకం గాని, వస్తువు గాని తీసుకొని ఇతరులకు మార్పిడి చేయవచ్చును. అలా ఆమెను భర్త విక్రయిస్తాడు. (DUMONT 1970)

ఇదంతా పరిశీలిస్తే వివాహానికి సంబంధించిన మత తంతులన్నీ స్త్రీకి తక్కువ హోదాను ఇచ్చినట్లు తేలుతుంది. బహుశః ఋగ్వేద కాలంలో స్త్రీలు విద్య నభ్యసించగలిగి పండితులు కాగలిగిన పరిస్థితిలో వారికి ఈనాటి కన్న ఎక్కువ హోదా ఉన్నదేమో! అలాంటి స్త్రీలు వివాహమాడేవారు కారు. వారిని 'పుత్రికలు' అని పిలిచేవారు. కాలం సాగిపోయిన కొలదీ ఆమెను శూద్రనిస్థితికి తేవడం, పెండ్లితో ఆమెకు ఉద్ధరణ జరగడం గమనించాలి. భర్తతో కలిసి మతవిధుల నిర్వహణలో పాల్గొనే అర్హత ఆమె భార్యగా సంతరించుకుంటున్నది. ఈ మత తంతులన్నీ పురుషాధిక్య సమాజ చిహ్నాలే. ఇంటినీ కుటుంబాన్ని చూచుకోవడం, మతపరంగా భర్తకు సాయపడటం అమె విధ్యుక్త ధర్మాలు. స్త్రీలను దేవతలుగా పేర్కొనటం, 'శక్తి' గా అభివర్ణించటం జరుగుతున్నది. ఏదైనా ఆమెను పురుషునితో సరిసమానమైన వ్యక్తిగా చూడలేదని దీనివల్ల కూడా తేలుతుంది.

కాలక్రమేణ ఈ మతతంతులు అర్థంలేనివై పోతున్నాయి. ఏమి వాగ్దానాలు చేస్తున్నారో తెలియకుండానే ప్రతిజ్ఞలున్న మంత్రాలను ఉచ్చరించడం, పెండ్లి తంతును కొనసాగించడం ఈనాటి వివాహాలలో కన్పడుతున్నది. తమకంటే అధికులను అంటే కులీనులను వివాహమాడే పద్ధతి ఫలితంగా వరునికి కాన్కలతో మొదలయి వరకట్నంతో ఆగిపోయింది. మొదటినుంచీ స్త్రీ ఎవరో ఒకరి సొత్తుగా పరిగణింపబడి, బరువు భారంగా ఎంచబడేది. అవకాశం దొరకగానే వదిలించుకోవలసిన వస్తువు ఆమె. భర్త ఇంటిలో ఆమె పరాయిది. తన భర్త కుటుంబానికి సేవ చేయడమే ఆమె విధి.

వివాహ వ్యవస్థ యొక్క భవిష్యత్తు :- ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా మనం ఆధునిక విలువలను సంతరించుకో గలిగాము.

వాటి కనుగుణంగా, వర్తమాన కాలానికి తగినట్లు వివాహ వ్యవస్థలో పెద్ద మార్పులు చేస్తేనే అది మనగలదు.

ప్రప్రథమంగా అది సరిసమానస్తులమధ్య కలయిక కావాలి. అంతే కాని స్త్రీని భర్తకు దానంచేయటంకారాదు. భర్తచేత, అతని కుటుంబీకులచేత వస్తువుగా ఎంచబడి, నిరాదరణచేయబడే పరిస్థితి పోవాలి. సమానస్తుల మధ్య సంబంధమయితే అది ఇరువురి న్యాయమైన స్వేచ్ఛాయుతమైన సమ్మతిపై ఆధారపడాలి. అవతలి మనిషియొక్క కుటుంబ సభ్యులను గురించి తెలుసుకోవడం అవసరమే కావచ్చును. కాని ముఖ్యమైన అంశాలు వధూవరులకు సంబంధించినవి. ఇరువురిమధ్య సఖ్యతకు అవకాశం ఉందా, ఒకరిపై మరొకరు శ్రద్ధవహించగలరా, ఒకరికోసం మరొకరు ఎంతవరకు త్యాగం చెయ్యగలరు, ఒకరిని మరొకరు ఎంతవరకు త్యాగం చెయ్యమని ఆశించకుండా ఉండగలరు; ఇవి ప్రధానమయిన ప్రశ్నలు. మత వివాహం కావాలనుకునే వారికోసం మత వివాహం ఆచారాలు మార్చాల్సి ఉంటుంది. మత పద్ధతిలో వివాహం జరిగినా, మతేతర విధానంలో పెండ్లి అయినా ప్రతి వివాహాన్ని రిజిష్టరు చేయించాలి. ఇది సర్వేసర్వత్రా అన్ని మతాలవారికీ, కులాలవారికీ వర్తించాలి. ఇది పెండ్లి విషయమైన రికార్డును భద్రపరచటమే కాక బాల్య వివాహం, బహు భార్యత్వం, వరకట్నం, బలవంతంగా బాలికలను పెండ్లి చేసుకోవటం లాంటి దురాచారాలను అరికట్టుంది. విడాకుల విషయంగా ఉన్న శాసనాలను మార్చాలి.

అంతమాత్రాన పాశ్చాత్యుల పద్ధతులను ఆమోదిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఆశించరాదు. సనాతన సంప్రదాయ ఆచారాల కంటే ఆవి ఏమంత మెరుగుగాలేవు. ఈనాడు పాశ్చాత్య ప్రపంచంలో వివాహవ్యవస్థ విషయమై సలహాలిచ్చేవారి హితబోధలను గమనిస్తే అవి మనువు శాసించిన ధర్మాల లాగానే ఉంటున్నవని తేలుతుంది. దాంపత్య జీవితంలో ఆనందం సాధించాలంటే సకాలంలో పెండ్లి జరగాలని, మత పరమైన వివాహాలు ఎక్కువ కాలం మనగల్గుతున్నాయని పైగా ఆనందదాయక మవుతున్నాయని చెప్తున్నారు. సంప్రదాయ సిద్ధమైన పునస్సంధానం, తృప్తి కరమైన నివాసం, ఎక్కువ ఖర్చుతో పెండ్లి, వివాహపూర్వం సలహా పొందడం,

సరియైన కారణం ఉంటే వివాహం మున్ముందుగా మానుకోవటం, ఇరువురి కుటుంబాలు సమ్మతించడం, ఇరుకుటుంబాలు ఇంచుమించుగా పోలికలున్న కుటుంబ పరిస్థితులు కలిగి ఉండటం, సమాన హోదాతో ఉండటం ఇవన్నీ తోడ్పడే అంశాలని సలహాలు ఇస్తున్నారు. (గ్లోవర్) ఇందులో కొన్ని అంశాలు నిజం కావచ్చును. కాని దాంపత్యంలో ఆనందం ప్రాప్తించటానికి ఇవి ముఖ్య ప్రాతిపదికలు కావు. ఇరువురు జీవిత భాగస్వాములు తమ వ్యక్తిత్వాలను పెంచుకోవటానికి సుసంపన్నం చేసుకోవటానికి అవకాశము ఉన్నపుడు, ఒకరు పెదగడానికి మరి యొకరు సాయపడుతున్నపుడు, ఒకరి అభివృద్ధి మరొకరికి నష్టదాయకం కానపుడు, ఇరువురు తమ పిల్లలకు చుట్టూ ఉన్న సమాజానికి తోడ్పడుతున్నపుడు, ఇద్దరినీకలిపేది ప్రేమ పరస్పరానురాగమూ అయినప్పుడు, ఒకరి పెత్తనానికి అధికారానికి మరొకరు లొంగివుండవలసిన అవసరం లేనపుడు మాత్రమే, వర్తమానకాలపు వివాహం ఆనందప్రదమవుతుంది. మేరీస్టోప్స్ అన్నట్లు "ఆధునికవివాహం భాగస్వాములకు ఇతోధిక స్వేచ్ఛను ఇస్తున్నప్పటికీ, స్త్రీ యొక్క వ్యక్తిత్వాన్ని కుంచించేదిగాను పురుషులకు విసుగుపుట్టించేదిగాను ఉన్న కుటుంబ పరిధినిమించి వారిద్దరిని ఉన్నతస్థాయితో సన్నిహితంచేసే పనులు ఆసక్తులను ఇరువురిమధ్య ఏర్పరుస్తుంది. స్త్రీ యొక్క స్వేచ్ఛా పరిధి, ఆమె వ్యాసంగాలు సంవత్సర సంవత్సరానికీ పెరుగుతున్నాయి; అయినా వివాహం సామాన్యంగా మేధాజీవితానికి చరమగీతం పాడుతున్నది. పురుషులతోపాటు సమంగా స్త్రీలకు మానసికాభివృద్ధికి స్వేచ్ఛావకాశాలు కలిగిన నాడే వివాహం ఉన్నతస్థాయికి చేరుకోగలదు.

ఈనాడు ఎక్కువమంది స్త్రీలు సృజనాత్మక [illegible] లేదంటే, తమ సృజనాశక్తిని ఎలా వినియోగించాలో వారికి తెలియకుండా మనిషిని బలవంతంచేసి అణగద్రొక్కే గతకాలపు ప్రభావాలకు లోనవుతున్నామనే దానికి అవి చిహ్నాలుగా పరిగణింపబడ్డాయి."

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10968

అనుబంధం

పరిశీలించబడిన గ్రంథాలు :-

1. PRABHU, P.N. : HINDU SOCIAL ORGANISATION
POPULAR Book depot, BOMBAY 1954.

2. KAPADIA, K.M. : MARRIAGE and FAMILY in INDIA
oxford university press, DELHI 1972.

3. SUR, A.K. : SEX and MARRIAGE IN INDIA
Allied Publishers, CALCUTTA. 1973.

4. LAKSHMANNA, C. : CASTE DYNAMICS IN VILLAGE INDIA
Nachiketa Publications, BOMBAY 1971.

5. Dr. LELARD and GLOVER : How to Marry SOMEONE YOU CAN LIVE WITH ALL YOUR LIFE.
Vikas Publishing House Private Ltd.
NEW DELHI.

6. STOPES, Dr. MARIE : MARRIED LOVE
Allied Publishers Private Ltd.
BOMBAY 1966.

7. D' SOUZA, ANTHONY : HAPPINESS IN MARRIAGE
Indian Social Institute, Lodi Road,
NEW DELHI.

8. DUMONT, LOUIS : HEMO HIERARCHIS,
Vikas Publications, DELHI 1970.

9. TOWARDS EQUALITY : REPORT OF THE COMMITTEE ON THE STATUS OF WOMEN IN INDIA,
Government of India 1974.

—)o(—

వివాహ వ్యవస్థ: ఆవశ్యకత

— జె. కమలాబాయి

సామాజిక జీవితంలో వివాహం ఒక ముఖ్యమైన వ్యవస్థ. మానవ చరిత్రలో పరిణామ ఫలితంగా ఈ వ్యవస్థ ఏర్పడింది. స్త్రీ పురుషులు కలిసి సంసారమేర్పరచుకొని, భావిపౌరులను తీర్చిదిద్ది, క్రమపద్ధతిలో సంఘాన్ని పెంపొందించడానికి వైవాహిక జీవితం అవసరమైంది. కేవలం సృష్టి కొనసాగించడానికో, లేక ప్రకృతి సిద్ధమైన లైంగిక వాంఛలను తీర్చుకొనుటకో మాత్రమే కాక స్త్రీ పురుషులమధ్య ఒక విధమైన బంధమూ, అన్యోన్యత, సహకార భావమూ, కష్టసుఖాలలో భాగస్వామ్య మనస్తత్వం ఇవన్నీ వివాహానికి ప్రాతిపదికలు. సామాజిక నియమబద్ధతకు దారితీస్తుంది వివాహం.

మన దేశంలో వివాహాలు చాలావరకు పెద్దలు ఏర్పాటు చేస్తున్నవే. ఇటీవల వధూవరుల ఇష్టాఇష్టాలను తెలిసికొని పెళ్ళిళ్ళు చేయడం జరుగుతోంది. ఏదైనా తమ సంతానంయొక్క బాగోగులను మనస్సులో వుంచుకొని, వారి సుఖసంతోషాలను ఆశించి వారికి తగిన వధూవరులను ఎంపిక చేయడం గమనిస్తున్నాం. ఇటీవల యువతీ యువకులు పరిచయాలు పెంచుకొని, పరస్పరాభిమానాలు వృద్ధిచేసుకొని, ప్రేమ వివాహాలు చేసుకోవడం పరిపాటి అయింది. ఈ పద్ధతులన్నింటిలో తోడూ నీడల కోసం ఆరాటం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. స్త్రీ పురుషులు ఉద్యోగాలు చేసుకుంటూ కొంచెం వయస్సు మీదిరిన తర్వాత, తోడుంటే బాగుంటుందని భావించి, వివాహతంతు లేకుండా కలసి నివసిస్తే తప్పేమిటని కొందరు ప్రశ్నించవచ్చు. విదేశాల విషయం ఎలావున్నా, మనదేశంలో ఈ పద్ధతి ప్రస్తుతం చాలా ఎబ్బెట్టుగాను, అవాంఛనీయంగానూ వుంటుంది. ఈరకపు సమష్టి జీవితంలో అన్యోన్యత జీవితాంతం వుంటుందని వూహించినా అది ఎక్కడోగాని సంభవించదు. మున్ముందు అవిద్య అంతటా నశించి, సంఘ పరిస్థితులన్నీ వేరేవిధంగా మారితే చెప్పలేము కాని ప్రస్తుతం ఇది అనుసరణీయం కాదు.

మానవజాతిలో పిల్లలకు పది, పదిహేను సంవత్సరాలు నిండేవరకు తల్లిదండ్రుల అండదండలు అవసరం. జంతువులలో, పక్షులలో, తదితర మానవేతర జాతులలో ఇంత కాలవ్యవధి అవసరంలేదు. సంతానాన్ని సరిగా పెంచే నిమిత్తం ఆ జాతులలో స్త్రీ పురుషబంధం స్థిరరూపం పొంద నక్కరలేదు. మనుష్యులలో అలాకుదరదు. తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు పిల్లలకు చాలా అవసరం. కనుక మానవజాతికి వివాహబంధం ఆవశ్యకం. 'తల్లి మాత్రమే పిల్లలను ఒంటరిగా పెంచలేదా?' అనేప్రశ్న ఉదయించవచ్చును. అది అసాధ్యంకాదు. కాని దానివల్ల అనేక ఇబ్బందులు కల్గుతాయి. పిల్లలు అనేక మానసిక అనుబంధాలకు, ఆపేక్షలకు దూరమై పోతారు. తద్వారా చాలా బాధ్యత తల్లిమీదనే పడుతుంది. పిల్లలు పెరిగి పెద్దవారైన తర్వాత వేరుగా కాపురం వుంటుంటే తల్లి ఒంటరి దవుతుంది. వృద్ధాప్యంలో తోడులేకుండా వుండవలసి వస్తుంది. పిల్లల మీద ఆధారపడదామంటే వాళ్ళ బాధ్యతలు, ఇబ్బందులు అడ్డురావచ్చును, అప్పుడు భర్త అన్నవాడుంటే ఈ బాధలు ఇద్దరికీ తగ్గుతాయి. పూచీలూ. పనులూ, విభజించుకొని వివాహమైన స్త్రీ పురుషులు ఒక ఇంట్లో కాపురం చేస్తూ పిల్లలను పొందితే ఇవన్నీ వారిద్దరికీ ఆసక్తిదాయక విషయా లవుతాయి. తల్లిదండ్రులమధ్య మమతాను రాగాలతో కూడిన సంబంధం ఏర్పడి వారివారి బాధ్యతలు వారికనుక్షణం గుర్తుకు వస్తాయి. కనుక తమ శ్రేయస్సుకోసం స్త్రీ పురుషులు వివాహమాడటం కర్తవ్యమవుతుంది.

